www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 200 | బుధవారం | 9 జనవరి, 2019

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

అగ్రవర్ణ పేదల 10% కోటా బిల్లుకు లోక్‌సభ జై

323 - 03 బంపర్ మెజార్టీతో

నెగ్గిన 124 రాజ్యాంగ సవరణ బిల్లు

న్యూఢిల్లీ: అగ్రవర్ణాల పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 124వ రాజ్యాంగ సవరణ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. దాదాపు 5గంటల సుదీర్ఘ చర్చ అనంతరం రాత్రి పది గంటల సమయంలో జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు మద్దతుగా 323 మంది సభ్యులు ఓటు వేయగా కేవలం ముగ్గురు మాత్రమే వ్యతిరేకంగా ఓటు వేశారు. అంతకు ముందు బిల్లును వ్యతిరేకిస్తూ తమిళనాడుకు చెందిన అన్నాడిఎంకె సభ్యులు వాకౌట్ చేశారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడం గందరగోళానికి, అవినీతికి కారణమవుతుందని చర్చ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు తంబిదురై దుయ్యబట్టారు. కాగా, ఈ బిల్లు రాజ్యాంగానికి ద్రోహం చేయడమేనని మజ్లిస్ నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ అంటూ ఎన్నికలకు ముందు హడావుడిగా బిల్లును తీసుకు వచ్చినందుకు ఎన్‌డిఏ ప్రభుత్వాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. అంతకు ముందు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత మంత్రి థావర్ చంద్ గెహ్లాట్ బిల్లును సభలో ప్రవేశపెడుతూ, ఈ బిల్లును సమర్థించాలని సభ్యులను కోరారు. ఈ రోజు చారిత్రాత్మకమైనదిగా ఆయన అభివర్ణించారు. ప్రధాని నరేంద్ర మోడీ సభలోనే ఉన్నప్పటికీ ఆయన మాట్లాడలేదు. లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ సహా దాదాపు అన్ని పార్టీలు బిల్లును సమర్థించినప్పటికీ బిల్లును ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టిన తీరు పట్ల చాలా మంది సభ్య zలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మరికొన్ని నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనుండగా మోడీ ప్రభుత్వం ఇప్పుడు ఈ బిల్లును తీసుకు రావడం రాజకీయ జిమ్మిక్కేనని కూడా వారు విమర్శించారు. కాంగ్రెస్ సీనియర్ సభ్యుడు కెవి థామస్ తరువాయి 6లో

నేడు రాజ్యసభకు బిల్లు

లోక్‌సభ నిరవధిక వాయిదా





సీతారామ విజయం

సీతారామ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు మంజూరు

రాష్ట్ర చీఫ్ ఇంజినీర్‌కు కేంద్రం లేఖ

ఫలించిన సిఎం కెసిఆర్ కృషి

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించి నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి పర్యావరణ అనుమతులు మంజూరయ్యాయి. కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ పరిధిలోని ఎక్స్‌పర్ట్ అప్రెయిజల్ కమిటీ నవంబరు 16వ తేదీన సమావేశమైన సందర్భంగా ఈ ప్రాజెక్టుపై చర్చించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున చీఫ్ ఇంజనీర్ కూడా ఆ సమావేశానికి హాజరై ప్రాజెక్టు వివరాలను తెలియజేయడంతో పాటు కమిటీ సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. ఆ కమిటీ సభ్యులంతా ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అంశాలను లోతుగా అధ్యయనం చేసి పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖకు సిఫారసు చేసింది. దీంతో మంత్రిత్వశాఖ సోమవారం అనుమతులను మంజూరు చేస్తూ రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్‌కు లేఖ రాసింది. కమిటీ సిఫారసుల మేరకు అనుమతి మంజూరు చేసినట్లు స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి కెసిఆర్ సైతం సాగునీటి ప్రాజెక్టులకు అవసమైన పర్యావరణ, అటవీ తదితర అనుమతులను కేంద్రం నుంచి సకాలంలో తెప్పించుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. కేంద్ర పర్యావరణ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ ఇటీవల తరువాయి 6లో

మన కోటా కోసం కొట్లాడండి

టిఆర్ఎస్ ఎంపిలకు సిఎం ఆదేశాలు 3

లోక్‌సభలో గొంతు వినిపించిన ఎంపిలు



అగ్రవర్ణ పేదల కోటా బిల్లుకు **టిఆర్ఎస్ మద్దతు**

అయోధ్యపై రాజ్యాంగ ధర్మాసనం



సిజె రంజన్ గొగోయ్ నేతృత్వంలో ఐదుగురు జడ్జీలతో బెంచ్


10 నుంచి విచారణ

న్యూఢిల్లీ: వివాదాస్పద అయోధ్య కేసు పై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు మంగళవారం అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది. ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఈ ధర్మాసనం ఈ నెల 10న ఈ అంశంపై విచారణ జరుపుతుంది. ఈ దర్మాసనంలోని మిగతా తరువాయి 6లో

అలోక్ వర్మకు మళ్లీ సిబిఐ డైరెక్టర్ పదవి

పునరుద్ధరించిన సుప్రీంకోర్టు

కేంద్రం తీరును ఆక్షేపించిన అత్యున్నత న్యాయస్థానం



న్యూఢిల్లీ: సిబిఐ డైరెక్టర్ అలోక్ వర్మ కేసులో సుప్రీంకోర్టులో మోడీ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. అలోక్‌వర్మను వెంటనే విధుల్లోకి తరువాయి 6లో

క్యూనెట్ కేటుగాళ్లు అరెస్టు



1000 కోట్ల మల్టీలెవల్ చీటింగ్

మన తెలంగాణ/ హైదరాబాద్ సిటీ బ్యూరో: క్యూనెట్ పేరుతో మల్టీలెవల్ మార్కెటింగ్ చేస్తూ పలువురిని మోసం చేస్తున్న 58 మంది నిందితులను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు అరెస్టు చేశారు. బాధితుల్లో ,నిందితులు ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఉండగా, 10మంది ఇతరులు ఉన్నారు. వారిపై సైబరాబాద్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో 30 కేసులు నమోదయ్యాయి. వివిధ బ్యాంక్ ఖాతాల్లో ఉన్న రూ.2.7 కోట్లను ఫ్రీజ్ చేశారు. వీరి తరువాయి 6లో

కుంచెపోటు



సార్‌కి 'ఐ' ఫోబియా... ఆర్‌బి'ఐ', రాహుల్ 'ఐ', సిబి'ఐ' వంటివి చూస్తే అంతే!



సాయికృష్ణకు అండ

తల్లిదండ్రులను అమెరికా పంపిస్తాం, వైద్య సహాయానికి ఆదేశాలు పంపాం 3

మిచిగాన్‌లో కాల్పులకు గురైన సాయికృష్ణ కుటుంబసభ్యులకు కెటిఆర్ హామీ

ఇఎన్‌టి+కు ఏర్పాట్లు

టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ నియామకం

మన తెలంగాణ/ హైదరాబాదః రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా చేపట్టిన చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) తోపాటు దంత వైద్య పరీక్షలకు ఏర్పాట్లు ముమ్మరం చేసారు. దీనికోసం టెక్నికల్ అడ్వైజరీ కమిటీ ఏర్పాటైంది. శిభిరాల ఏర్పాటుకు అవసరమైన బడ్జెట్, వైద్య పరికరాలు కొనుగోలు, నిర్వహణకు అవసరమైన వైద్యుల తాత్కాలిక నియామకానికి సర్కారు సన్నాహాలు ప్రారంభించింది. వచ్చే నెల నుంచే ఈ శిభిరాలు ప్రారంభించాలని ప్రభుత్వం సూచన ప్రాయంగా ఆదేశాలు జారీ చేయటంతో వైద్య ఆరోగ్య శాఖాధికారులు కసరత్తు ప్రారంభించారు. అందుకోసం అవసరమైన వైద్య పరికరాలు, ఆయా రంగాలకు చెందిన వైద్యులు, నిపుణుల లబ్యతపై నివేదికలు సిద్ధంచేసారు. ప్రభుత్వంలో ప్రస్తుతం పనిచేస్తున్న వైద్యులు సరిపోనందున తాత్కాలిక పద్దతిలో తీసుకోవాలని భావిస్తున్నట్లు ఉన్నతస్థాయి వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే కోటి మందికి పైగా కంటి పరీక్షలు చేశారు. వచ్చే నెలలో కంటి వెలుగు కార్యక్రమం పూర్తి కానుంది. ఆ వెంటనే ఈఎన్‌టీ, దంత వైద్య శిబిరాలు ప్రారంబించాలని ముఖ్య మంత్రి ఇప్పటికే ఆదేసించిన విషయం తెలిసిందే. వచ్చే నెలలోనే ఈ శిభిరాలను ప్రారంభించాల్సి రావడంతో వైద్య ఆరోగ్యశాఖ వర్గాల్లో ఆందోళన మొదలైంది. ప్రభుత్వ వైద్యులతోనే ఈఎన్‌టీ, డెంటల్ వైద్య పరీక్షలు చేయడానికి ప్రస్తుత సిబ్బంది సరిపోయే పరిస్థితి కనిపించడంలేదు. అంతేకాదు ఇప్పుడున్న ప్రభుత్వ వైద్యులను ఈ ప్రత్యేక పరీక్షల కోసం పూర్తిస్థాయిలో కేటాయిస్తే సంబంధిత ఆసుపత్రుల్లో సేవలకు తరువాయి 6లో

ఢిల్లీలో టిఆర్ఎస్ భవనానికి చంద్రశేఖర్ రూ.5 లక్షల విరాళం



మనతెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సమితి ఢిల్లీలో నిర్మించబోయే పార్టీ భవనానికి రంగారెడ్డి జిల్లా టిఆర్ఎస్ ఉపాధ్యక్షులు వసిలి చంద్రశేఖర ప్రసాద్ రూ.5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం ప్రగతి భవన్‌లో టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావును కలిసి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. కెటిఆర్‌ను కలిసిన వారిలో చంద్రశేఖర్ వెంట శేర్‌లింగంపల్లి ఎంఎల్ఎ అరికెపూడి గాంధీ కూడా ఉన్నారు.

సహకార ఎన్నికలకు మళ్లీ బ్రేక్

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో సహకార ఎన్నికలకు మరోసారి బ్రేక్ పడింది. రాష్ట్ర ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఎటువంటి నోటిఫికేషన్ ఇవ్వకూడదని వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి. పార్థసారథి సహకార శాఖకు స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికలు ముగియగానే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలకు నిర్వహించాలని ముందుగా భావించారు. సిఎం కె.చంద్రశేఖర్‌రావు కూడా ఆ దిశగా అధికారులకు సంకేతాలు ఇచ్చారు. అందులో భాగంగా ఫిబ్రవరి రెండో వారంలో ప్యాక్స్‌లకు ఎన్నికలు నిర్వహించేందుకు ఈ నెల 17వ తేదీన నోటిఫికేషన్ ఇవ్వాలని సహకార శాఖ అధికారులు సర్వం సిద్ధం చేసుకున్నారు. ఇందుకోసం ప్యాక్స్ ఓటర్ల తుది జాబితాను కూడా రూపొందించుకున్నారు. ఫిబ్రవరి రెండో వారంలో ప్యాక్స్‌లకు ఎన్నికలు ముగియగానే ఇదే నెల 25వ తేదీ కల్లా డిసిసిబి, డిసిఎంఎస్, టెస్కాబ్‌కు ఎన్నిక పూర్తి చేయాలని షెడ్యూల్‌తో పాటు ప్రణాళికలు సిద్ధం చేసి పెట్టుకున్నారు. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపి సీటు ఆశించి, భంగపడే వారికి డిసిసిబిలతో స్థానం భర్తీ చేయాలని అధికార పార్టీ భావిస్తోంది.

భూముల సమాచారం క్లిక్కు దూరంలో





ప్రత్యేక లింకును తయారు చేయించిన సిసిఎల్‌ఏ
వివాదరహితంగా, తప్పులు లేకుండా సమాచారం

మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో భూములకు సంబంధించిన తాజా సమాచారం ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. దీనికోసం ప్రత్యేక లింకును సిసిఎల్‌ఏ తయారు చేయించింది. భూ పరిపాలన ప్రధాన కమిషనర్(ccla.telangana.gov.in) వెబ్‌సైట్లో సిటిజన్ స్టేటస్ కింద పేర్కొన్న 'నో యువర్ ల్యాండ్ సర్వీసు'ను నొక్కగానే http://ccla.telangana.gov.in/landstatus.do అనే ప్రత్యేక లింకు తెరుచుకుంటుంది. ఇందులో భూముల వివరాలను రెవెన్యూ శాఖ పొందుపరిచింది. దీని ద్వారా రైతులు, కొనుగోలుదారులకు కనీస సమాచారం లభ్యం కానుంది. సర్వే నెంబర్ల వారీగా భూములు, ఖాతా నంబర్ల వారీగా ఆర్‌వోఆర్ (1బీ) వివరాలను పొందుపరిచింది. 31 జిల్లాల వారీగా డివిజన్, మండలం, గ్రామాల వివరాలు నమోదు చేసి సమాచారం తెలుసుకునేలా ఈ వెబ్‌సైట్‌ను అధికారులు తయారు చేయించారు. రాష్ట్రంలో ప్రాథమిక సమాచారం కోసం అప్పటివరకు అందుబాటులో ఉన్న 'మాభూమి' సేవలు భూరికార్డుల ప్రక్షాళన మొదలైన తరువాత నిలిచిపోయాయి. దీని స్థానంలో సమీకృత ధరణి సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం ప్రకటించింది. అయితే రెవెన్యూ విభాగానికి మాత్రమే సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉంది. దీనిని ప్రజలకు చేరువ చేసేందుకు మరింత సమయం పట్టే అవకాశముంది. ఈ నేపథ్యంలో తొలివిడత ప్రక్షాళన పూర్తయ్యాక సేవా రుసుము చెల్లించి మీసేవ ద్వారా భూముల పహాణీ, 1బీ కాపీలు పొందవచ్చని రెవెన్యూ శాఖ తెలిపింది. దీంతో రైతులు, ప్రజలకు కొంత ఇబ్బం ది కలిగింది. తాజాగా సిసిఎల్‌ఏ వెబ్‌సైట్లో వివరాలు లభ్యమవుతుండడంతో ఉచితంగా భూములకు సంబంధించిన వివరాలు తెలుసుకునే అవకాశం వచ్చింది. ప్రస్తు తం సిసిఎల్‌ఏ వెబ్‌సైట్లో సమాచారం కేవలం ప్రాథమిక అవగాహన కోసమే పెట్టామని మీసేవ ద్వారా అధీకృత పత్రాలు మాత్రమే చెల్లుబాటు అవుతాయని రెవెన్యూ శాఖ స్పష్టం చేసింది.

ఐదురోజుల పాటు గ్రామం-లోనే వీఆర్వోలు

రెవెన్యూ శాఖలో కీలక సంస్కరణలు అవసరమని ప్రభుత్వం భావించింది. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి కొత్త మాన్యువల్‌ను విడుదల చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. జనవరి నెలలోనే సవరించిన భూ రికార్డులతో యాజమాన్య పత్రాల అందజేత, నూతన పట్టాదారు పాసు పుస్తకాల జారీతో కొత్త శకం మొదలుపెట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. అందులో భాగంగానే రెవెన్యూ పరిపాలనలో భాగంగా వీఆర్వోలు ఇకపై కనీసం వారంలో 5 రోజులు పనిచేసే చోటే నివాసం ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది. గ్రామాల్లో భూములు, పంటల తీరును గురించి తెలుసుకునేందుకు వీఆర్వోలకు ట్యాబ్‌లను అందించాలని కూడా ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం. జియో ట్యాగ్ ఫొటోగ్రఫీ విధానంతో పంటల ఫొటోలను తీసి భద్రపరిచే చర్యలకు శ్రీకారం చుడుతున్నారు. తద్వారా సాగు వివరాలు కూడా కచ్చితంగా లెక్కలోకి తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

రెవెన్యూ రికార్డులను స్కాన్ చేసి ...

రెవెన్యూ శాఖలో మొదటిసారిగా గ్రామాల మొత్తం రికార్డులకు సంబంధించి ఆయా గ్రామాల వీఆర్వోలకు బాధ్యతలను ఇవ్వనున్నారు. విధిగా గ్రీవెన్స్ రిజిస్ట్రర్, మూమెంట్ రిజిస్ట్రర్‌ను వీఆర్వోలు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఫారం...1, ఫారం..బి, ..ఫారం..7 ఆర్వోఆర్ యాక్టు 1971 ప్రకారం రెవెన్యూ రికార్డులను స్కాన్ చేసి వీఆర్వో సిద్ధంగా ఉంచుకోవాలని గతంలో అధికారులు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. తెలంగాణ రాష్ట్రంలోని 11,200 రెవెన్యూ గ్రామాల్లోని 10,250 రికార్డులను ఇప్పటికే డిజిటలైజ్ చేశారు. త్వరలో మొత్తం మ్యాపులను భువన్ పోర్టల్‌లో నిక్షిప్తం చేయనున్నారు. రాష్ట్రంలోని 360 కార్యాలయాల్లో తహసీల్దార్లు, అసిస్టెంట్ డైరెక్టర్లకు మోడ్రన్ రికార్డుల రూముల కల్పన వేగంగా జరుగుతోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా సేత్వారి, డిజిటలైజేషన్ విలేజ్ మ్యాపులను సర్వే సెటిల్‌మెంట్, భూ రికార్డుల శాఖ సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేసింది. భూ రికార్డుల ప్రక్షాళన పూర్తయిన తరువాత 10,800 గ్రామాల్లో సర్వే నెంబర్ల వారీగా ఒక్కో గ్రామ భూములన్నీ ఆన్‌లైన్‌లో కనిపించనున్నాయి.

భూ రికార్డుల ప్రక్షాళన జరిగినందున...

గతంలో మాభూమి వెబ్‌సైట్‌లో హైదరాబాద్ పరిసర జిల్లాలకు సంబంధించిన సేత్వార్, నక్షా (మ్యాప్) వివరాలు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం కేవలం భూముల ప్రాథమిక సమాచారం మాత్రమే ఉంది. అభ్యంతరాలతో నిలిచిపోయిన భూముల ప్రక్షాళన జరిగిందా? లేదా? వివరాలు తెలుస్తాయి. సంబంధింత సర్వే నెంబర్, ఖాతానెంబర్ లేకుంటే దరఖాస్తు ఇంకా పరిష్కారం కాలేదని సమాచారం. భూ రికార్డుల ప్రక్షాళన జరిగినందున కొత్తగా భూములు కొనేవారికి సిసిఎల్‌ఏ సమాచారంతో నిజమైన పట్టాదారులు ఎవరూ? హక్కుల విషయంలో న్యాయపరమైన చిక్కులు ఏమైనా ఉన్నాయా ? తెలుసుకునే వీలుంది. వివాదాలుంటే ఆ భూముల వివరాలు అందుబాటులో ఉండవని సిసిఎల్‌ఏ అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుత సమాచారం చూసుకొని అందులో ఏమైనా తప్పులుంటే రైతులు, యజమానులు సరిచేసుకునేందుకు రెవెన్యూ అధికారులను సంప్రదించేందుకు వీలు కలుగుతుంది. తద్వారా భూముల రికార్డులను ఎప్పటికప్పుడు వివాదారహితంగా తప్పులు లేకుండా చూసుకునేందుకు వీలుకలుగుతుందని రెవెన్యూ అధికారులు తెలిపారు.



అసెంబ్లీకి ఎంత ఖర్చు చేశారు..!



- లెక్క తేల్చే పనిలో త్రిసభ్య కమిటీ
- అభ్యర్థులు వ్యయ నివేదిక ఇచ్చేందుకు ఈ నెల 10వ తేదీ వరకే గడువు
- సమర్పించకుంటే మూడేళ్ల పాటు పోటీకి అనర్హత
- 2014లో ఖర్చులు సమర్పించలేదని 47 మందిపై ఇసి వేటు

మన తెలంగాణ/హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ప్రచార ఖర్చులను తేల్చే పనిలో ఎన్నికల అధికారులు నిమగ్నమయ్యారు. ఈ నెల 5వ తేదీ నుంచే ఎన్నికల ఖర్చుపై నియోజకవర్గ స్థాయిలో త్రిసభ్య కమిటీలు సమావేశాలు ప్రారంభించాయి. కొన్ని జిల్లాల్లో ఈ ప్రక్రియ తుది దశకు చేరుకున్నట్లు సిఇఒ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. వీటిలో అభ్యర్థి తన బ్యాంకు ఖాతా ద్వారా చేసిన ఖర్చుల వివరాలను సమర్పించడంతో పాటు వ్యయ పరిశీలకులు నమోదు చేసిన ఖర్చులపై క్షుణ్ణంగా చర్చించి నివేదికను తయారు చేయనున్నారు. ఇసి నిబంధనల ప్రకారం అసెంబ్లీ ఎన్నికలకు పోటీ చేసే వారి ఖర్చు పరిమితి రూ. 28 లక్షలుగా ఉంది. దీని ప్రకారం 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులందరూ విధిగా ఎన్నికల ప్రచారంలో చేసిన ఖర్చులను వివరాలను నివేదించాల్సి ఉంటుంది. గుర్తింపు, రిజిస్టర్, ఇండిపెండెంట్ అభ్యర్థులందరూ కలిపి మొత్తం 1821 మంది అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. వీరంతా ఈ నెల 10వ తేదీ కల్లా సంబంధిత రిటర్నింగ్ అధికారులకు ప్రచార ఖర్చుల వివరాలను సమగ్ర నివేదిక రూపంలో సమర్పించాల్సి ఉంటుంది. వాటిని రిటర్నింగ్ అధికారులు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయానికి, కేంద్ర ఎన్నికల సంఘానికి పంపిస్తారు. అయితే చాలా మంది స్వతంత్ర, రిజిస్టర్ పార్టీల అభ్యర్థులు తమకెందుకులే తక్కువ ఓట్లు వచ్చాయని, డిపాజిట్ గల్లంతు అయిందికదా ఇంకెందుకు అనుకుంటూ నిర్లక్ష్యంగా వదిలేస్తుంటారు. ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఎన్నికల అధికారులు హెచ్చరిస్తున్నారు. ఖర్చుల వివరాలు సమర్పించకపోతే ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 10(ఎ) ప్రకారం మూడేళ్ల పాటు అది కూడా మరో ఆరు నెలల్లో ఎన్నికలు వస్తాయనే సమయంలో పోటీ చేయకుండా అనర్హులుగా ప్రకటిస్తారని అధికారులు చెబుతున్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన 47 మంది అభ్యర్థులు ప్రచార వ్యయాన్ని సమర్పించనందుకుగాను వారిని కేంద్ర ఎన్నికల సంఘం 2018 అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2021 వరకు దేశంలో జరిగే ఎన్నికలకు అనర్హులుగా ప్రకటించడమే ఇందుకు ఉదాహరణ. ఇందులో నిజామాబాద్ జిల్లా నుంచి టిడిపి నేత దొడ్డల రామకృష్ణ, మహబూబ్‌నగర్ నుంచి రమేష్ బండారీలు తమకు మినహాయింపు ఇవ్వాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు అప్పీల్ చేసుకున్నారు.దీనిపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి ఈ ఇరువురిపై కేంద్ర ఎన్నికల కమిషన్ పోటీకి అనర్హుల జాబితా నుంచి మినహాయించింది. ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 11 ప్రకారంగా అప్పీల్‌కు వెళ్లడం వల్ల వారికి మినహాయింపు కలిగింది.

అప్పీల్‌కు అవకాశం

అత్యవసర పరిస్థితుల్లో అనర్హులైన వారికి చట్టంలో పునఃపరిశీలనకు అవకాశం ఉంది. అయితే వారు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు అప్పీల్ చేసుకుని సరైన సాక్ష్యాధారాలు చూపించాల్సి ఉంటుంది. అభ్యర్థి అనారోగ్యానికి గురి కావడం, నిరక్షరాస్యుడు కావడం, సకాలంలో ఖర్చులు సమర్పించాలని తెలియకపోవడం వంటి కేసులపై కొంత ఊరటనిచ్చేందుకు చట్టంలో అవకాశం ఉంది.



పార్లమెంట్‌లో మంగళవారంనాడు మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌తో టిఆర్ఎస్ ఎంపి జోగినపల్లి సంతోష్‌కుమార్ సెల్ఫీ తీసుకున్న దృశ్యం

5వేల మందికి ఉచిత శిక్షణ

నగర సిపి అంజనీకుమార్



మన తెలంగాణ/ హైదరాబాద్ః హైదరాబాద్ నగరంలోని గోషామహల్ శివకుమార్ లాల్ స్టేడియంలో 5000 వేల మంది ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు పోలీసు శాఖలో వివిధ విభాగాల్లో సుశిక్షితులైన 50 మంది అధికారులతో ఉచిత శిక్షణ ఇస్తున్నామని నగర సిపి అంజనీకుమార్ తెలిపారు. తెలిపారు. పోలీసుశాఖ ఆధ్వర్వంలో నిర్వహిస్తున్న శిక్షణ పొందిన వారిలో 80శాతం మంది అభ్యర్థులు కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. అభ్యర్థులకు ఇండోర్‌తో పాటు ఔట్‌డోర్‌లోనూ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. నగరంలోని భాగ్యకిరణ్ ఇనిస్టిట్యూట్ అధినేత భాగ్యకిరణ్ సహకారంతో ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల ఉద్యోగాలకు సంబంధించి అన్ని రకాల శిక్షణను పోలీసు ఉద్యోగాల కోసం పోలీసు శాఖ ఆధ్వర్యంలో 6 నెలలుగా శిక్షణ కొనసాగనుందని తెలిపారు. ఇప్పటికే నాలుగు వేల మందిని ఎంపిక చేసి పోలీసు ఉద్యోగాల కోసం హైదరాబాద్ పోలీసులు శిక్షణ ఇస్తున్నారు. పోలీసులు కావాలనుకునే వారికి ఇది మంచి అవకాశమని, ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం శిక్షణ ఇస్తున్నట్లు నగర పోలీసు కమిషనర్ తెలిపారు. పోలీసు ఉద్యోగాల పట్ల మహిళలు ఆసక్తిచూపించడం మంచి పరిణామమన్నారు. పోలీసు ఉద్యోగాల భర్తీలో మహిళా అభ్యర్థులకు 30 శాతం రిజర్వేషన్ ఉందని వివరించారు. అభ్యర్థులకు ప్రిమినలరీ 200 మార్కుల పరీక్షను 3 గంటల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. తెలంగాణ చరిత్ర, ఎకనామిక్స్, జనరల్ ఇంగ్లీష్, అర్థమెటిక్, ఇండియన్ జాగ్రఫి, జనరల్ సైన్స్‌లతో కలిపి 14 అంశాలపై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ నగరంలోని నార్తజోన్‌లో దోబిఘూట్ హాకీ గ్రౌండ్, సెంట్రల్ జోన్ ఎన్టీఆర్ స్టేడియం, సౌత్‌జోన్ బార్కస్ చంద్రాయణగుట్ట గ్రౌండ్లలో శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. పోలీసు అధికారి మధుకర్ స్వామి, గోషామహల్ ఎసిపి నరేందర్‌రెడ్డి తదితరులు శిక్షణ బృందంలో కీలక భూమిక పోషిస్తున్నారని సిపి అంజనీకుమార్ వారిని అభినందించారు. ఆగస్టు 2017లో అప్పటి సిటి పోలీసు కమిషనర్‌గా మహేందర్‌రెడ్డి పనిచేసిన కాలంలో ఉచిత శిక్షణ కార్యాక్రమం మొదలైందన్నారు. హైదరాబాద్ సిటి పోలీసు ఉన్నతాధికారులు నిరుద్యోగ యువతను పోలీసు శాఖలో ఉద్యోగ అవకాశం కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా రిక్రూట్ చేసుకుని గత సంవత్సర కాలంగా వారికి శిక్షణ ఇస్తున్నామన్నారు.

ప్రపంచమంటే భగవత్ విభూతి

మనతెలంగాణ/ సిటీబ్యూరో : మనుష్యులందరికీ కారణమైన తత్వమే సాక్షాత్తు భగవంతుడు, ఆ భగవంతుడు ఎప్పుడూ కూడా పదిలంగా ఉండాలని కోరుకోగలిగితే అది మనిషి జన్మకు సార్థకత అని ప్రముఖ ఆద్యాత్మిక గురువు చినజీయర్ స్వామీజి చెప్పారు. నగరంలోని నందగిరిహిల్స్‌లో మైహోం గ్రూపుల అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు నివాస ప్రాంగణంలో నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా 24వ రోజు ఆయన తన ఆద్యాత్మిక ప్రవచనాలను వినిపించారు. భగవంతుడు ఏ ఒక్క ప్రదేశంలో పదిలంగా ఉండడని, ఆయన సర్వాంతర్యామియని, ఆత్మ ఎప్పటికీ అశాంతిలోకి వెళ్ళదని, అదెప్పుడూ శాంతిలోనే ఉంటుందని ఆయన వెల్లడించారు. ఈ లోకమంతా భగవంతుడి శరీరమనుకుంటే, ఈ దేహంతా ఆరోగ్యకరంగా ఉండాలని కోరుకుంటే చాలని, ఈ ప్రపంచానికి పెట్టే పేరు ''భగవత్ విభూతి'' విభూతియంటే సంపదని ఆయన వెల్లడించారు. మనుష్యులు చేసేవి రెండు రకాల పొరపాట్లుయని, ఒకరికి చెందిన వస్తువు, తనవి అని చెప్పడం మొదటి దొంగతనం, అతి విలువైన ఆత్మను దొంగిలించడం రెండవదని, సాక్షాత్తు పరమాత్మను దొంగిలిస్తున్నాడని, ఇందులో మూడోది చాలా శిక్షార్హమైనవని ఆయన తెలిపారు. ''సిరియెయ్‌నమ: శ్రీధరాయ నమ:'' మొదటి గురువుకు చెందినదని, అది వేదసారమైన మంత్రమిదియని ఆయన తెలిపారు. ప్రపంచమంతా యదార్థమని, 'అనిత్యమూ' అంటే శాశ్వతమైనది కాదని, ''అసత్యం'' అంటే వాస్తవం కానిదియని, ఏది అనిత్యమో అది అసత్యమని, ఏది అసత్యమో అది మిధ్యా అని అనకూడదని మన పూర్వికులు వివరించారని తెలిపారు. నిత్యమూ, సత్యమూ అనే రెండు పదాలు, నిత్యమంటే మూడు కాలాల్లోనూ అలాగే ఉండుట, మూడు కాలాలంటే గడిచి, గడుస్తున్న, రాబోయే కాలంలో కూడా మార్పులేకుండా ఉండేదానిని నిత్యం అని, సత్యమంటే 'అర్థ క్రియాకారిత్వం సత్యత్వం' కావాలి, ఒకపనికి ఉపయోగపడితే దానిని సత్యమని, నిత్యమంటే 'త్రికాల అబాధ్యం' అంటారని, మార్పు జరుగుతూ ఉంటే అనిత్యమని జీయర్ స్వామీజి తెలిపారు. 'కల' అంటే సత్యమని, కానీ, అనిత్యమని, ఈ ప్రపంచంలో కనిపించే వస్తువులన్నీ నిత్యములని కానీ, సత్యములని ఆయన చెప్పారు. మానవత్వం కలిగిన ఓ జీవి భూమి మీద ఎప్పటికీ ఉంటుందని, ''మృత్యుకేత్త్యేవ సత్యం''

చినజీయర్ స్వామీజీ

మృత్యుక అంటే మట్టి... మట్టి ఎప్పుడూ అలానే ఉంటుందని, అది ఆకారాలు మారుతూ ఉంటుందని జీయర్ స్వామీజి తెలిపారు. ప్రపంచంలోని ప్రతీది ఏదో ఒక ప్రయోజనం చేకూర్చడానికే ఉంటాయని, ప్రతి చుక్క నీరు ఆకాశం నుంచి రాదని, ఉన్న నీరు భూమి మీద నుంచే వస్తుందని, ప్రదేశాలు మారుతూ ఉంటుందే తప్ప భూమిమీదున్న నీరు ఎక్కడికీ పోదని ఆయన విశదీకరించారు. ప్రపంచంలో జీవుల సంఖ్య ఒక్కటేనని, అవి స్థిరంగా ఉంటాయని, కానీ దేహాలు మాత్రమే మారుతూ ఉంటాయని, పాపపు కర్మల మేరకు జీవులు వేర్వేరు దేహాలుగా మారడం జరుగుతుందని, మానవ దేహం... పంది లక్షణాలు, మానవ దేహం.. చేప లక్షణాలు, మానవ దేహం కుక్క గుణాలు ఇలా జీవులు దేహాలను మార్చుకుంటూనే ఉంటాయే గానీ జీవుల సంఖ్య మారదని, మానవ దేహం జంతు ప్రవృత్తియని ఆయన సోదాహరణంగా తెలిపారు. కనిపించే ప్రపంచమంతా పవిత్రమైనది, చాలా విలువైనది, దివ్యమైనది, స్వచ్ఛమైనది... దీనిని నాశనం చేయరాదని, ప్రతి వస్తువులోనూ దైవమున్నదని, మనం కోరుకోవాల్సింది మంచి జరగాలని కోరుకోవాలని, ఆత్మ ఎప్పుడూ కనిపించదు, ఆత్మ కేవలం దేహం ద్వారానే కనిపిస్తుందని వేదాలు చెప్పాయని, ఈ ప్రపంచమంతా ప్రవాహ సత్యమని ఆయన వెల్లడించారు. అనుష్టానమంటే మంచి సాధనయని, అనుసంధానమంటే నిరంతరం ఆలోచించడమని జీయర్ స్వామీజి వివరించారు.





పౌరసరఫరాలశాఖ సంస్థ ఛైర్మన్‌గా మారెడ్డి



(ఫైల్ ఫొటో)

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్ర పౌరసరఫరాలశాఖ సంస్థ ఛైర్మన్‌గా మారెడ్డి శ్రీనివాసరెడ్డిని ప్రభుత్వం నియమించింది. సిఎంగా కెసిఆర్ రెండవసారి ప్రమాణ స్వీకారం చేసిన కార్పొరేషన్ పదవుల నియామకాలకు శ్రీకారం చుట్టారు. రెండవసారి ప్రభుత్వం చేపట్టిన తర్వాత పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్‌ను నియమించారు. దీనికి సంబంధించి దస్త్రంపై కెసిఆర్ సంతకం చేశారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన మారెడ్డి నియామకంతో కార్పొరేషన్ పదవుల నియామకాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు ఈ పదవిలో కొనసాగిన పెద్దిరెడ్డి సుదర్శన్‌రెడ్డి ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో వరంగల్ జిల్లా నర్సంపేట శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. దీంతో పౌరసరఫరాలశాఖ సంస్థ ఛైర్మన్‌గా మారెడ్డిని నియమించారు. సిద్దిపేట మండలంలోని ఇరుకోడు గ్రామానికి చెందిన మారెడ్డి టిఆర్‌ఎస్‌లో కీలకంగా పనిచేశారు.

మారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన పల్లా

రాష్ట్ర సివిల్ సప్లై కార్పోరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన మారెడ్డి శ్రీనివాసరెడ్డికి టిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి, శాసనమండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంఎల్‌సి కర్నె ప్రభాకర్, ఎంఎల్‌ఎలు కాలె యాదయ్య, కోనేరు కోనప్ప, దివాకర్‌రావు, టిఎస్ఐఐసి ఛైర్మన్ బాలమల్లు, టిఆర్‌ఎస్ నాయకులు వంశీధరరావులు మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు.

చారిత్రాత్మక నిర్ణయం : లక్ష్మణ్



మన తెలంగాణ/హైదరాబాద్: విద్యా, ఉద్యోగాల్లో అగ్రవర్ణాల్లోని పేదలకు 10% రిజర్వేషన్లు కల్పించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైనదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. మంగళవారం నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో బిజెపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఆకుల విజయంతో కలిసి విలేకరుల సమవేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ, మోడీ తీసుకున్న నిర్ణయం ఎంతో సాహోసపేతమైనదని వ్యాఖ్యానించారు. దేశంలో సామాజిక సామరస్యత, ఆర్థిక సామరస్యత రెండూ ఉండాలని కోరుకుంటున్నామన్నారు. సామాజిక వివక్ష ఎంత అనర్థానికి దారి తీస్తోందో ఆర్థిక అసమానతలు కూడా అశాంతిని కల్పిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ కులం పేరుమీద, మతం పేరుమీద విభజన రాజకీయాలకు పాల్పడిందని విమర్శించారు.

మన కోటా కోసం కొట్లాడండి

- ఎంపిలకు టిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ ఆదేశం
- ఇబిసి కోటా బిల్లుకు మద్దతు

మన తెలంగాణ/ హైదరాబాద్ : అగ్రవర్ణాల్లోని పేదలకు పది శాతం రిజర్వేషన్‌ను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టే బిల్లులో సవరణలకు పట్టుబట్టాలని టిఆర్‌ఎస్ ఎంపిలకు ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ముస్లింలలో వెనకబడినవారికి పన్నెండు శాతం రిజర్వేషన్లను, గిరిజనులకు పది శాతం రిజర్వేషన్లను కేటాయిస్తూ తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపిందని, దీన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టాల్సి ఉందని, కానీ ఇప్పటివరకూ పట్టించుకోలేదని, ఇప్పుడు పార్లమెంటు ఉభయ సభల్లో ఆ అంశాన్ని డిమాండ్ చేయాలని ఎంపిలకు వివరించారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్ల అంశాన్ని చేపట్టినందున ఇదే బిల్లులో తెలంగాణ రిజర్వేషన్ల పెంపు అంశాన్ని కూడా చేర్చేలా కేంద్ర ప్రభుత్వంపై టిఆర్‌ఎస్ ఎంపిలు వత్తిడి తీసుకురావాలని సూచించారు. బిల్లులో సవరణలు తెచ్చి రాష్ట్ర డిమాండ్‌ను నెరవేర్చేలా పట్టుబట్టాలని ఎంపిలకు సిఎం స్పష్టం చేశారు. కెసిఆర్ ఆదేశానుసారం లోక్‌సభలో టిఆర్‌ఎస్ ఎంపిలు ఈ విషయంపై కేంద్రాన్ని నిలదీశారు. బిల్లును ప్రవేశపెడుతున్న సందర్భంగా తెలంగాణ అసెంబ్లీ తీర్మానం మేరకు గిరిజనులు, ముస్లిం మైనారిటీలకు రిజర్వేషన్లు పెంచాల్సిందేనని నినాదాలు చేశారు.

బిల్లులో సవరణలు చేయాలి : ఎంపిలు

అగ్రవర్ణాల్లోని ఆర్థికంగా వెనకబడిన పేదలకు పది శాతం రిజర్వేషన్ కల్పించడానికి ఉద్దేశించి కేంద్ర ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టడాన్ని తమ పార్టీ స్వాగతిస్తున్నప్పటికీ కొన్ని సవరణలు చేయాల్సిన అవసరం ఉందని టిఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత జితేందర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సరిగ్గా ఇదే సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకున్న తమ పార్టీ అధినేత కెసిఆర్ గిరిజనులకు, ముస్లిం మైనారిటీలకు రిజర్వేషన్లను పెంచాలనుకున్నారని, అసెంబ్లీ కూడా ఏకగ్రీవంగా తీర్మానం చేసి పంపిందని, కానీ మోడీ ప్రభుత్వం సంవత్సరాల తరబడి దానికి ఆమోదం తెలపకుండా పెండింగ్‌లో పెట్టిందని గుర్తుచేశారు. కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి తావర్‌చంద్ గెహ్లాట్ లోక్‌సభలో పది శాతం రిజర్వేషన్‌కు సంబంధించి రాజ్యాంగ సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన తర్వాత జరిగిన చర్చలో టిఆర్‌ఎస్ తరపున జితేందర్‌రెడ్డి పై విధంగా వ్యాఖ్యానించారు. రాష్ట్రాల్లోని జనాభా పొందిక, వారి అవసరాలు, సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వారిని వృద్ధిలోకి తేవడానికి అవసరమైన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వాలే స్పష్టత ఉంటుందని, అందువల్లనే గిరిజనుల రిజర్వేషన్‌ను ఆరు శాతం నుంచి పది శాతానికి, ముస్లిం మైనారిటీల రిజర్వేషన్ (బి.సి. జాబితాలోని 'ఇ' (గ్రూపు)ను నాలుగు శాతం నుంచి పన్నెండు శాతానికి పెంచాల్సిందిగా అసెంబ్లీ తీర్మానం చేసిందని గుర్తుచేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులో పలు సవరణలు చేయాల్సి ఉందని, తెలంగాణ ప్రభుత్వం పంపిన బిల్లులోని అంశాలను కూడా ఈ కొత్త బిల్లులో చేర్చాలని డిమాండ్ చేశారు.

డెబ్బై ఏళ్ళుగా విఫలమయ్యాయి

దేశంలోని ప్రతి ఒక్కరికీ ఏదో ఒక రూపంలో ఒక మేరకు ఆదాయం ఉందని, స్వాతంత్ర్యానంతరం ఏడు దశాబ్దాల్లో ఎక్కువ కాలం పాటు పరిపాలించిన కాంగ్రెస్, బిజెపిల వైఫల్యం వల్లనే ఇప్పటికీ దేశంలో పేదరికం ఉందని చర్చ సందర్భంగా లోక్‌సభలో మంగళవారం సాయంత్రం జితేందర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ రెండు ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమే ఇప్పటికీ దేశంలో పేదరికం ఉండడం, ఇప్పుడు ఆ పేదరికాన్ని దృష్టిలో పెట్టుకుని బిల్లు తీసుకురావాల్సిన అనివార్య పరిస్థితులు అని వ్యాఖ్యానించారు. నిజానికి ఇప్పుడు ఈ బిల్లులో 'ఆర్థికంగా వెనకబడిన' అనే పదాన్ని ప్రస్తావించాల్సి వచ్చిందంటే ఆ రెండు పార్టీలు ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.

రిజర్వేషన్ల కల్పనాధికారం రాష్ట్రాలకే ఉండాలి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న కులాలు, మతాలు తదితర అంశాలావరీ జనాభా పొందికలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మార్పు వచ్చిందని ఉదహరించిన జితేందర్ రెడ్డి, ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంత పరిధిలో ముస్లిం జనాభా 8% మాత్రమే ఉండేదని, విభజన అనంతరం 12% అయిందని, గిరిజనుల జనాభా సైతం 6% నుంచి 10%కు పెరిగిందని వివరించారు. భౌగోళికంగా ప్రాంతాలు విడిపోవడంతో వాటికి అనుగుణంగా జనాభా పొందికలోనూ మార్పు వచ్చిందని పేర్కొన్నారు. సామాజిక, ఆర్థిక వెనకబడిన పరిస్థితులనుదృష్టిలో పెట్టుకునే జనాభాకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం ముస్లింలకు 12%, గిరిసులకు 10% రిజర్వేషన్‌ను పెంచాలనుకుందని, మతం, కులాల ఆధారంగా కాదని వివరించారు. కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం దీనికి కులం, రంగు పులిమి ఇప్పటికీ ఆమోదం తెలపకుండా పెండింగ్‌లో పెట్టిందన్నారు. తమ పార్టీ నాయకులు చాలాసార్లు ప్రధానిని కలిశారని, రిజర్వేషన్ పెంచాల్సిన అవసరాన్ని వివరించారని, ఈ సభలో సైతం పార్లమెంటు సభ్యులుగా కేంద్ర ప్రభుత్వ తాత్సారానికి నిరసన వ్యక్తం చేశామని గుర్తుచేశారు. ఒక దేశానికి ఒకటే చట్టం ఉండాలని కూడా తాము నినదించామని, తమిళనాడులో 69% రిజర్వేషన్ విధానం అమలవుతున్నప్పుడు తెలంగాణకు అది ఎందుకు ఉండకూడదన్న అంశాన్ని ప్రశ్నించామని గుర్తుచేశారు. తమిళనాట 69% రిజర్వేషన్ అమలవుతున్నట్లుగానే తమ రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా రిజర్వేషన్‌ను ఖరారు చేసే అధికారంఉండాలని, ఇప్పటికే పంపిన బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని ఆయన డిమాండ్ చేశారు.

చివరి రోజున సమంజసం కాదు : వినోద్

చివరి రోజున బిల్లు తీసుకువచ్చి బిజెపి ప్రభుత్వం గందరగోళ పరిస్థితిని తీసుకువచ్చిందని కరీంనగర్ ఎంపి బి.వినోద్‌కుమార్ వ్యాఖ్యానించారు. నెల రోజుల నుంచి పార్లమెంట్ నడుస్తున్నా, ఇంత ముఖ్యమైన బిల్లు కేంద్ర ప్రభుత్వానికి చివరి రోజే గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. ఈ బిల్లుపై మీడియాతో వినోద్‌కుమార్ మాట్లాడుతూ, దేశ ప్రజల భవిష్యత్తుతో ముడిపడిన ప్రాధాన్యమైన ఈ బిల్లుపై మాట్లాడేందుకు ఎంపిలకు చాలా తక్కువ సమయమే మిగిలిందని, బిల్లును పూర్తి స్థాయిలో అధ్యయనం చేసేందుకు కూడా సమయం లేదని అన్నారు. తెలంగాణ ను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర అసెంబ్లీ ఎస్‌టి, మైనారిటీల రిజర్వేషన్లు పెంచుతూ తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని, ఇప్పుడు కేంద్రం తీసుకొచ్చిన బిల్లులో (ఎకనామికల్లీ అదర్ కాస్ట్స్) బిల్లుతో పాటు తెలంగాణ శాసనసభ తీర్మానంచేసి పంపిన మైనార్టీ, ఎస్‌టి రిజర్వేషన్ బిల్లుకు కూడా ఆమోద ముద్ర వేయాలని తాము డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

సాయికృష్ణకు అండగా ఉంటాం

టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



మనతెలంగాణ/హైదరాబాద్ : అమెరికాలో దుండగుల చేతిలో కాల్పులకు గురై చికిత్స పొందుతున్న మహబూబాబాద్‌కు చెందిన విద్యార్థి సాయికృష్ణకు పూర్తిగా అండగా ఉంటానని టిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.టి.రామారావు తెలిపారు. సాయికృష్ణ కుటుంబ సభ్యులు మంగళవారం బేగంపేటలోని క్యాంపు కార్యాలయంలో కెటిఆర్‌ను కలిసి ప్రభుత్వం సహకారాన్ని కోరారు. సాయికృష్ణ తల్లిదండ్రులు వెంటనే అమెరికాకు వెళ్లేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తామని కెటిఆర్ వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సాయికృష్ణ ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సాయికృష్ణ ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారని, అయితే ఆయనకు పలు శస్త్రచికిత్సలు అవసరమని అక్కడ ఉన్న సాయికృష్ణ మిత్రులు తమకు తెలియజేశారని వారు కెటిఆర్‌కు తెలిపారు. అవసరమైతే మరింత సహకారం కోసం కేంద్ర ప్రభుత్వ విదేశీ వ్యవహారాల శాఖ తరపున సహాయం కోసం విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్‌తో మాట్లాడుతామని సాయికృష్ణ కుటుంబ సభ్యులకు కెటిఆర్ హామీ ఇచ్చారు. ఈ మేరకు మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు సీతారాం నాయక్ నేరుగా కేంద్ర మంత్రి సుష్మాస్వరాజ్‌ను కలిసినట్లు కెటిఆర్ తెలిపారు. ప్రస్తుతం సాయికృష్ణకు ఎలాంటి ఆటంకాలు లేకుండా వైద్య సహాయం అందుతుందని, అయితే ఆయనకు భీమా సౌకర్యం లేకపోవడంతో తమకు ఆర్థిక సహాయం అవసరమవుతుందని ఈ సందర్భంగా సాయికృష్ణ కుటుంబ సభ్యులు కెటిఆర్‌ను కోరారు. సాయికృష్ణను అన్ని విధాలా ఆదుకుంటామన్న కెటిఆర్, ముందుగా కుటుంబ సభ్యులు అమెరికా వెళ్లేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని తక్షణం అందించాలని ముఖ్యమంత్రి కార్యాలయ స్పెషల్ సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డికి కెటిఆర్ విజ్ఞప్తి చేశారు. సాయికృష్ణ కుటుంబ సభ్యులు అమెరికా వెళ్లేందుకు అవసరమైన అత్యవసర వీసాలను జారీ చేయాల్సిందిగా హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్ కేథరిన్ హెడ్డాతోనూ కెటిఆర్ ఫోన్‌లో మాట్లాడారు. కుటుంబ సభ్యుల రవాణా ఖర్చులతోపాటు రాష్ట్ర ప్రభుత్వం తరపున తక్షణమే కొంత ఆర్థిక సహాయాన్ని అందిస్తామన్నారు.

టిఆర్‌ఎస్‌లో టిడిపి ఎంఎల్ఏ?

తుమ్మలతో హైదరాబాద్‌లో భేటీ

మన తెలంగాణ / హైదరాబాద్ : ఖమ్మం జిల్లాలోని అశ్వారావు పేట నియోజకర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసి గెలిచిన మెచ్చా నాగేశ్వరరావు త్వరలో టిఆర్‌ఎస్‌లో చేరే అవకాశంఉంది. ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో నగరంలో మంగళవారం భేటీ అయ్యారు. అనారోగ్యంతో ఉన్న తుమ్మలను పరామర్శించడానికే తాను హైదరాబాద్ వచ్చి కలిశాను తప్ప రాజకీయ అంశమేదీ లేదని మెచ్చా నాగేశ్వరరావు మీడియాతో వ్యాఖ్యానించారు. కానీ టిఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నందునే తుమ్మల ద్వారా రాయబారం నడుపుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే సత్తుపల్లి నియోజకవర్గం నుంచి గెలిచిన ఆ పార్టీ శాసనసభ్యుడు సండ్ర వెంకటవీరయ్య టిఆర్‌ఎస్ నేతలతో టచ్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. వీరిరువురూ కలిసి టిఆర్‌ఎస్‌లో చేరి తెలంగాణ తెలుగుదేశం పార్టీని శాసనసభలో టిఆర్ఎస్‌లో విలీనం చేసే అవకాశాలున్నట్లు వార్తలు వస్తున్నాయి.



మార్గరేట్ ఆటోబయోగ్రఫీ

మనతెలంగాణ/ హైదరాబాద్ : రాజస్థాన్ మాజీ గవర్నర్ మార్గరేట్ అల్వా తెలుగురాష్ట్రాల గవర్నర్‌ను మర్యాద పూర్వకంగా మంగళవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ గవర్నర్ మార్గరేట్ అల్వా ఆటోబయాగ్రఫీ పుస్తకాన్ని గవర్నర్ నరసింహన్‌కు అందచేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ సతీమణి విమలా నరసింహన్ కూడా పాల్గొన్నారు.

కెసిఆర్ దార్శనికత దేశానికి అవసరం

టిఎన్‌జిఓ డైరీ ఆవిష్కరణలో హరీశ్‌రావు



మన తెలంగాణ/ హైదరాబాద్ : అసాధ్యమనుకునే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి కెసిఆర్ రాష్ట్రంలో చెపట్టి సుసాధ్యం చేశారని, నాలుగున్నరేళ్ళ కాలంలో రాష్ట్రంలో అమలైన అనేక పథకాలు యావత్తు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, అందువల్లనే ఆయన దార్శనికత రాష్ట్రానికే కాక మొత్తం దేశానికే అవసరమని సిద్దిపేట శాసనసభ్యుడు హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కెసిఆర్ చెప్పినట్లుగా రాష్ట్రంలోని మొత్తం పదిహేడు లోక్‌సభా స్థానాలు టిఆర్‌ఎస్‌కు, స్నేహపూర్వకంగా ఉన్న ఎంఐఎంకు రావాలని అన్నారు. తెలంగాణ ఎన్‌జిఓ డైరీ ఆవిష్కరణ సందర్భంగా రాష్ట్ర సాధనకు ఉద్యమంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్‌జివోలు చేసిన కృషితో మొదలుపెట్టి భవిష్యత్తులో వారి పాత్రతో రాష్ట్రం సాధించే అభివృద్ధి వరకు అనేక అంశాలను హరీశ్‌రావు ప్రస్తావించారు. ఉద్యమం సమయంలో కెసిఆర్‌కు వెన్నడి ఉన్న ఎన్‌జిఓలు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉనికిలోకి వచ్చిన పథకాలను కూడా అద్బుతంగా ప్రజల్లోకి తీసుకెళ్లిన ఘనత వారిదేనన్నారు. ఉద్యోగులతో కలిసి తెలంగాణ సాధించామని, ఉద్యోగులతో కలిసే రాష్ట్రం అభివృద్ధి దిశగా నడుస్తోందన్నారు. తెలంగాణ ఎన్‌జివోలకు, తెలంగాణ ఉద్యమానికి అవినాభావ సంబంధం ఉందని గుర్తుచేసిన హరీశ్‌రావు ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణ పదాన్ని నిషేధిస్తే 'తెలంగాణ ఎన్‌జిఓ' అని పేరు పెట్టుకున్న చారిత్రక నిర్ణయాన్ని ఉదహరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తెలంగాణ ఎన్‌జిఓల పాత్ర చారిత్రాత్మకమని, ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న సమయంలో ఆర్‌టిఏ (రవాణా) కార్యాలయానికి లగడపాటి రాజగోపాల్ వస్తే ఉద్యోగులకు అండగా నిలబడ్డామని గుర్తుచేశారు. స్వామి గౌడ్‌పై దాడి జరిగిందని, ఆ సమయంలో ఉద్యోగులంతా పోలీస్ స్టేషనులోనే ఉండేందుకు సిద్ధపడ్డారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యోగుల సమస్యలు కెసిఆర్ పరిష్కరిస్తారని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఊహించని విధంగా 43% ఫిట్‌మెంట్ ప్రకటించారని, ఈసారి కూడా అలాంటి సంతృప్తికరమైన నిర్ణయం ఉంటుందని వ్యాఖ్యానించారు. ఉద్యోగుల విభజన, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల, హైకోర్టు విభజనను చంద్రబాబు అడ్డుకున్నారని, అందుకే ఉద్యోగుల విషయంలో సమస్యలు తలెత్తాయన్నారు. కేంద్ర హోం మంత్రిత్వశాఖ సైతం విభజన చట్టంలోని అంశాలు పెండింగ్‌లో ఉంటే సత్వరం పరిష్కరించేందుకు తీసుకున్న చొరవ నామమాత్రమని, కేంద్రంలోమన బలం ఉంటే మన సమస్యలను పరిష్కారం చేసుకోవచ్చన్నారు.

సంపాదకీయం

కేంద్రానికి చెంపదెబ్బ


కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) డైరెక్టర్‌ను అర్ధంతరంగా సెలవులో పంపిన కేసులో సుప్రీంకోర్టు మంగళవారం నాడు ఇచ్చిన తీర్పు ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి గట్టి చెంపపెట్టు వంటిదని అంగీకరించకతప్పదు. అమల్లో గల చట్టబద్ధ విధి విధానాలను ఉల్లంఘించి ఇష్టావిలాసంగా నిర్ణయాలు తీసుకోడం చెల్లదని ఈ తీర్పు ద్వారా సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. సిబిఐ డైరెక్టర్ అలోక్ వర్మను, స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ అస్థానాను ఒకే సారి సెలవు మీద పంపిస్తూ గత అక్టోబర్ 23న కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. అలోక్ వర్మను సిబిఐ డైరెక్టర్‌గా తిరిగి నియమించింది. ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా ఎం. నాగేశ్వర్ రావు నియామకాన్ని రద్దు చేసింది. అలోక్ వర్మ సిబిఐ డైరెక్టర్‌గా కీలక నిర్ణయాలు తీసుకోరాదని షరతు విధించింది. ఆయనపై ఆరోపణలను దర్యాప్తు చేసి సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సివిసి) ఇచ్చిన నివేదిక ఆధారంగా హై పవర్డ్ కమిటీ చేసే సూచన మేరకు అలోక్ వర్మ విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందు కోసం ఈ కమిటీని వారం రోజుల్లో సమావేశపరచాలని వ్యవధిని నిర్ణయించింది.

వాస్తవానికి లోక్‌పాల్ చట్టం ప్రకారం ప్రధాని, లోక్‌సభలో అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ సారథి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా ఆ పదవిలోని వారు సిఫార్సు చేసే వేరే న్యాయమూర్తితో కూడిన హై పవర్డ్ కమిటీ ఎంపిక మేరకు సిబిఐ డైరెక్టర్ నియామకం జరగాలి. ఆ వ్యక్తి డైరెక్టర్‌గా రెండేళ్లపాటు కొనసాగాలి. మధ్యలో తొలగించవలసి వస్తే మళ్లీ హై పవర్డ్ కమిటీ నిర్ణయాన్నే పాటించాలి. కేంద్ర ప్రభుత్వం ఈ నిబంధనను ఉల్లంఘించి అలోక్ వర్మను సిబిఐ డైరెక్టర్ పదవీ బాధ్యతలనుంచి తప్పించి సెలవు మీద పంపింది. అలోక్ వర్మకు అస్థానాకు మధ్య విభేదాలు బహిర్గతమై సిబిఐ పరువు గంగలో కలిసిపోయినందున పరిస్థితిని చక్కదిద్దడానికి ఇద్దరిని సెలవు మీద పంపిస్తున్నట్టు కేంద్రం తన చర్యను సమర్థించుకున్నది. కేంద్రం వ్యవహరించిన తీరును మొత్తంగా సుప్రీంకోర్టు ఇప్పుడు ఆక్షేపించినట్టయింది.

అలోక్ వర్మను డైరెక్టర్‌గా నియమించక తప్పని పరిస్థితుల్లో కేంద్రం గుజరాత్ కేడర్‌కు చెందిన ఐపిఎస్ అధికారి రాకేష్ అస్థానాను అడిషనల్ డైరెక్టర్‌గా నియమించింది. అప్పుడే ఆయన నియామకాన్ని సవాలు చేస్తూ కామన్ కాజ్ అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. 2002 నాటి గోధ్రా సబర్మతి ఎక్స్‌ప్రెస్ రైలు బోగీ దగ్ధం కేసు ప్రత్యేక దర్యాప్తు అస్థానా సారథ్యంలోనే సాగింది. ప్రధాని మోడీ స్వయంగా కోరి అస్థానాను సిబిఐ అడిషనల్ డైరెక్టర్‌గా నియమింప చేశారనే అభిప్రాయం కూడా ఉన్నది. ఆయనకు లాలూప్రసాద్ యాదవ్ పశుగ్రాసం కుంభకోణం కేసును కూడా అప్పగించారు. అడిషనల్ డైరెక్టర్‌గా అస్థానా పలువురి నుంచి లంచాలు తీసుకున్నారని ఆధారాలు లభించడంతో గత ఏడాది అక్టోబర్‌లో సిబిఐ ఎఫ్ఐఆర్ దాఖలు చేసి దర్యాప్తు ప్రారంభించింది. అస్థానాకు, లంచం ఇచ్చిన వ్యక్తికి మధ్యవర్తిగా వ్యవహరించారన్న కారణంతో ఒకరిని అరెస్టు కూడా చేశారు. ఇంచుమించు ఇదే సమయంలో రాఫెల్ కేసు దర్యాప్తు చేపట్టాలని కోరుతూ కేంద్ర మాజీ మంత్రులు యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరీ, ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌లు సిబిఐ డైరెక్టర్ అలోక్ వర్మను కలుసుకున్నారు. అలోక్ వర్మే లంచం తీసుకున్నాడంటూ అస్థానా చేసిన ప్రతి ఆరోపణలపై సివిసి దర్యాప్తు చేపట్టింది. ఈ విధంగా మొదటిసారిగా సిబిఐ డైరెక్టర్, అడిషనల్ డైరెక్టర్ మధ్య విభేదాలు బయటపడడంతో ఇద్దరినీ ఒకే గాటన కట్టి సివిసి సిఫార్సు మేరకు ఏక కాలంలో ఉభయులనూ కేంద్రం సెలవు మీద పంపించింది. దీనిని అలోక్ వర్మ సుప్రీంకోర్టులో సవాలు చేసి కేసు గెలుచుకున్నారు. వాస్తవానికి అలోక్ వర్మ పదవీ కాలం ఈ నెల 31తో ముగిసిపోతుంది.

రాఫెల్ కేసులో సిబిఐ దర్యాప్తు చేపట్టకుండా చేయడానికే అలోక్ వర్మను తప్పించారని రాహుల్ గాంధీ ఆరోపించారు కూడా. కేంద్ర ప్రభుత్వం, సివిసి అలోక్ వర్మను, అస్థానాను ఒకే రీతిలో పరిగణించి వ్యవహరించాయిగాని సుప్రీంకోర్టు దీనిని సిబిఐ డైరెక్టర్ పదవికి సంబంధించిన నిబంధనల ఉల్లంఘన కేసుగానే గుర్తించి తీర్పు ఇచ్చింది. సిబిఐ డైరెక్టర్ స్వేచ్ఛకు, శీల సమగ్రతకు ఆదర్శ వ్యక్తిగా ఉండాలని ఆ పదవిని అన్ని రకాల జోక్యాలకు అదుపాజ్ఞలకు అతీతంగా ఉంచినప్పుడే అది సాధ్యమవుతుందని ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ సారథ్యంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్య కేంద్రంలోని ప్రభుత్వాలకు శిరోధార్యం కావాలి.

అగ్రవర్ణ కోటా ఆంతర్యం?



చూపు

ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో ప్రవేశాలకు సంబంధించి 10 శాతం రిజర్వేషన్లు ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గం బిల్లు ప్రవేశపెట్టింది. ఇప్పుడున్న 50 శాతం రిజర్వేషన్లకు అదనంగా ఈ రిజర్వేషన్లు ఉంటాయి. ఈ రిజర్వేషన్లు ఎవరికి వర్తిస్తాయంటే జనరల్ కేటగిరీలో ఇప్పటి వరకు ఎలాంటి రిజర్వేషన్ సదుపాయం లేని అగ్రకులాలకు చెందిన పేదలు ఈ రిజర్వేషన్ పరిధిలోకి వస్తారు. అగ్ర కులాల్లో పేదలంటే ఎవరో కూడా నిర్వచనం ఇచ్చారు. ఏడాదికి 8 లక్షల రూపాయల కన్నా తక్కువ ఆదాయం కలిగిన వారు ఈ పరిధిలోకి వస్తారని చెప్పారు. అంటే నెలకు దాదాపు 67 వేల రూపాయల కన్నా తక్కువ సంపాదించేవారంతా ఈ పరిధిలోకి వస్తారు. అంతర్జాతీయ దారిద్ర్యరేఖ లెక్కల ప్రకారం రోజుకు 133.32 రూపాయల సంపాదనతో జీవించేవారు నిరుపేదలని భావించాలి. అంటే నెలకు 3990 రూపాయల సంపాదన కలిగిన వారు. ఈ లెక్కన చూస్తే దేశంలో దాదాపు 30 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని ఇటీవలి గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో ఎంతమంది అగ్రవర్ణాల వారున్నారన్న లెక్కలేమైనా ప్రత్యేకంగా ఉన్నాయా? లెక్కలు తీస్తే వెనుకబడిన కులాలతో పోల్చితే చాలా తక్కువ మంది అగ్రవర్ణాలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్లు తెలుస్తుంది. అందుకే కాబోలు ఏడాదికి 8 లక్షల ఆదాయపరిమితి, ఐదెకరాల భూయాజమాన్య పరిమితిని ఈ రిజర్వేషన్లకు వర్తింపజేశారు. ఈ స్థాయిలో ఆదాయ పరిమితి, భూ యాజమాన్య పరిమితి లేకపోతే చాలా మంది అగ్రవర్ణాలకు ఈ రిజర్వేషన్ల వల్ల ఉపయోగం ఉండదు.

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి పరాజయానికి కారణం అగ్రవర్ణాలు పార్టీకి దూరం కావడమేనని ఆర్ఎస్ఎస్ చేసిన వ్యాఖ్యల తర్వాత ఈ రిజర్వేషన్ల నిర్ణయం వెలువడిందని కూడా గమనించాలి. దేశంలో షెడ్యూల్డ్ కులాలు, తరగతులపై దౌర్జన్యాల నిరోధక చట్టాన్ని తూట్లు పొడిచే ప్రయత్నాలు ఇంతకు ముందు జరిగాయి. తర్వాత బిజెపి కాస్త వెనక్కి తగ్గింది. కాని అగ్రవర్ణాలు ఎప్పటి నుంచో ఈ చట్టం పట్ల వ్యతిరేకత కలిగి ఉన్నాయి. అందువల్లనే బిజెపి వైఖరి పట్ల వ్యతిరేకతతో అగ్రవర్ణాలు దూరమయ్యాయన్నది ఆర్ఎస్ఎస్ విశ్లేషణ? ఇప్పుడు ఈ బిల్లు చట్టమైతే దేశంలోని అగ్రవర్ణాల్లో దాదాపు 90 శాతం మంది ఈ రిజర్వేషన్లకు అర్హత పొందుతారు. నిస్సందేహంగా ఈ చట్టం అగ్రవర్ణాలకు సంతోషం కలిగిస్తుంది. కాని వాస్తవమేమంటే, ఇప్పుడు ఉద్యోగాలు ఎక్కడున్నాయి? ఉద్యోగాలను సృష్టించకుండా ఉద్యోగాల్లో రిజర్వేషన్ల వల్ల ప్రయోజనమేమిటి? ఉత్తరాది మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఓడిపోడానికి నిరుద్యోగ సమస్య కూడా ఒక కారణం. ఉద్యోగాలే లేనప్పుడు రిజర్వేషన్ల వల్ల ఉపయోగం ఉండదు.

ఉద్యోగాల్లో ఎస్‌టి, ఎస్‌టి, ఒబిసి వర్గాలు రిజర్వేషన్లు ఉండడం వల్లనే ఈ మాత్రమైనా ఉద్యోగాలు పొందగలుగుతున్నాయి. మిగిలిన జనరల్ కేటగిరీలో ఉద్యోగాలు ఎవరికి లభిస్తున్నాయో లెక్కలు తీస్తే అందులో నాన్ రిజర్వుడు సముదాయాల సంఖ్య చాలాచాలా తక్కువ ఉంటుంది. రిజర్వేషన్ సదుపాయంలేని వర్గాలే ఎక్కువగా జనరల్ కేటగిరిలో ఉద్యోగాలు పొందుతున్నాయి. ఈ వర్గాల్లో పేదలకు ప్రత్యేకంగా పదిశాతం రిజర్వేషన్ కల్పించడం బాగానే ఉంది. కాని ఇప్పుడు సూచించిన ఆదాయ పరిమితులను చూస్తుంటే నిజంగా అల్పాదాయ వర్గాలే ఈ రిజర్వేషన్ సదుపాయం పొందగలుగుతాయా అన్నది ఆలోచించాలి.

ఆర్ఎస్ఎస్ చాలా కాలంగా ఎస్సి, ఎస్‌టి, ఒబిసి వర్గాలను కూడా కలుపుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ అగ్రవర్ణాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నమాట కాదనలేని వాస్తవం. జనరల్ కేటగిరిలోని పేదలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో వినిపిస్తుంది. 2015లో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగత్ రిజర్వేషన్లపై వ్యాఖ్యానిస్తూ కులం కాదు పేదరికం ప్రాతిపదిక కావాలన్నారు. పేదరికం ప్రాతిపదికన రిజర్వేషన్ల గురించి మాట్లాడడమంటే చారిత్రకంగా అణగారిన వర్గాలకు లభించే సదుపాయం తొలగించే దొడ్డిదారి ప్రయత్నంగా చాలా మంది విమర్శించారు. పేదరిక నిర్మూలన అనేది ప్రభుత్వం ప్రత్యేక పథకాల ద్వారా చేయవలసిన పని. ఉద్యోగాలను కల్పించడం, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం వంటి చర్యల ద్వారా పేదరిక నిర్మూలనకు ప్రయత్నించవలసి ఉంటుంది. పేదరిక నిర్మూలనకు రిజర్వేషన్లు మార్గం కాదు. శతాబ్దాల సామాజిక వెనుకబాటును తొలగించే సానుకూల వివక్షగా రిజర్వేషన్లు వచ్చాయి. ఇప్పుడు పేదరికం ప్రాతిపదికన రిజర్వేషన్లను ప్రవేశపెట్టడం రిజర్వేషన్ల మౌలిక సూత్రాన్నే నిరాకరించడం అవుతుంది. ఏ సముదాయానికైనా రిజర్వేషన్లు కల్పించడమన్నది హడావిడిగా జరిగే పని కాదు.

వెనుకబాటును నిర్ధారించే అధ్యయనాలు జరగాలి. కమిషన్లు సర్వే నిర్వహించాలి. లెక్కలు తీయాలి. ఇవన్నీ లేకుండా రిజర్వేషన్లను ఏ ప్రాతిపదికన ఇస్తున్నారు? అగ్రవర్ణాల్లో పేదరికం ఎంత ఉందన్నది అధ్యయనం చేశారా? అగ్రవర్ణాల్లో ఏ ఏ సముదాయాల్లో ఎక్కువ పేదరికం ఉన్నదో తెలుసుకున్నారా? ముస్లిం, క్రైయిస్తవ మత సముదాయాల్లో పేదరికం, హిందూ అగ్రవర్ణాల్లో పేదరికం అన్నీ ఒకేలా ఉన్నాయా? ఈ లెక్కలు తేలకుండా 10 శాతం రిజర్వేషన్ ఎవరెవరికి ఇస్తారు? ఎలా ఇస్తారు? న్యాయస్థానంలో ఈ నిర్ణయం నిలబడుతుందా? వంటి అనేక ప్రశ్నలు ఇప్పుడు తలెత్తుతున్నాయి. అగ్ర వర్ణ పేదల రిజర్వేషన్‌ను రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్ లో చేర్చాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. 9వ షెడ్యూల్‌లో చేర్చినప్పటికీ కోర్టు సమీక్షించే అవకాశం ఉంది. అంటే ఈ నిర్ణయం అమలు అనేది చాలా అనుమానాస్పదం.

ఇటీవల కేంద్రమంత్రి ఉపేంద్ర కుష్వాహా మంత్రివర్గం నుంచి రాజీనామా చేశారు. ఒబిసిల వర్గీకరణ విషయంలో మోడీ ప్రభుత్వ నిరాసక్తతను విమర్శిస్తూ ఆయన రాజీనామా చేశారు. 2017లో ఏర్పడిన జస్టిస్ రోహిణి కమిషన్ ఒబిసిల్లో సబ్ కేటగిరీలను సిఫారసు చేసింది. ఒబిసి రిజర్వేషన్ల విషయంలో తలెత్తిన ఈ వర్గీకరణ సమస్యను ఇంతవరకు పరిష్కరించలేకపోయినప్పుడు, అగ్రవర్ణాలకు రిజర్వేషన్లలో ఈ సమస్య తలెత్తకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారు. పైగా రిజర్వేషన్లు కేవలం సామాజిక వెనుకబాటు ప్రాతిపదికన మాత్రమే ఇవ్వాలని రాజ్యాంగం 340వ అధికరణ స్పష్టం చేస్తున్నప్పుడు పేదరికం ప్రాతిపదిక ఎలా అవుతుంది?

2011లో యుపిఎ ప్రభుత్వం 27 శాతం ఒబిసి కోటాలో 4.5 శాతం మైనారిటీలకు కేటాయించినప్పుడు బిజెపి తీవ్రంగా వ్యతిరేకించింది. మైనారిటీలకు రిజర్వేషన్ల విషయంలో తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చిన బిజెపి ఇప్పుడు 10 శాతం రిజర్వేషన్ల విషయంలో జనరల్ కేటగిరిలో అందరికీ వర్తింపజేయక తప్పదు. అంటే ముస్లిములు, క్రైస్తవులకు కూడా ఈ కోటా వర్తిస్తుంది. అదికూడా ఉద్యోగాలు సృష్టిస్తేనే ... కొంతవరకు దీనివల్ల మైనారిటీలకు ప్రయోజనం కలగవచ్చు. హిందూ అగ్రవర్ణాలకు దీనివల్ల లభించే ప్రయోజనాలు ప్రత్యేకంగా ఏమీ ఉండవు. ఇప్పటికే జనరల్ కేటగిరిలో వారే ఎక్కువగా ఎంపికవుతున్నారన్నది కాదనలేని యదార్థం. ఈ నిర్ణయం వల్ల బిజెపికి రాజకీయ ప్రయోజనం తప్పకుండా లభిస్తుంది. నోట్లరద్దు, జిఎస్‌టి, నిరుద్యోగం, అధిక ధరలు, రాఫెల్ వగైరా అనేక సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్ళించవచ్చు. తమకు కూడా రిజర్వేషన్ సౌకర్యం లభించిందని అగ్ర కులాలు ఆనందించే వాతావరణం ఏర్పడుతుంది. ఇది బిజెపికి రాజకీయంగా లాభసాటి కావచ్చు.

✻ ఉమైర్

రైతు కోసం సమగ్ర వ్యూహం



భారతి కోడె
9440103411

మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో ఒక మారుమూల పల్లెలో నివసించే ఒక సన్నకారు రైతు గోపాల్ . ఉన్న కొద్దిపాటి భూమిలో సజ్జలు, ఉల్లిపాయలు పండిస్తూ తన భార్య, ముగ్గురు పిల్లలతో గుట్టుగా బతుకుతున్న కుటుంబం అతనిది. కొన్నేళ్ల క్రితం సమయానికి వర్షాలు విపరీతంగా పడటంతో ఆ ఊరి లో ఉల్లి పంట విరగకాసింది. దాదాపు అందరు ఉల్లి రైతులు కావడం, దిగుబడి మరీ ఎక్కువగా ఉండడంతో ధర బాగా పడిపోయి గోపాల్ కి పెట్టుబడిగా పెట్టిన డబ్బుకూడా తిరిగి రాకుండా పోయింది. దీనితో విత్తనాలు, ఎరువులకోసం గాను షావుకారు దగ్గర చేసిన అప్పు తిరిగి కట్టలేకపోయాడు. దాని మీద వడ్డీ విపరీతంగా పెరిగిపోవడం, అతని చిన్న కొడుకుకి వచ్చిన అనారోగ్యం వల్ల షావుకారు దగ్గర మరింత అప్పు చేయాల్సి రావడం ఆ కుటుంబాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశాయి. ఆ అప్పులు తీర్చేందుకు వ్యవసాయంతో పాటు అదనంగా గోపాల్ కొన్నాళ్ళు క్వారీ లో పని చేయగా అతని భార్య కూడా రోజు కూలీ గా పని చేసి వచ్చిన డబ్బును ఎంతో జాగ్రత్తగా వాడుకుంటూ మిగిలినవి షావుకారు దగ్గర జమ చేస్తూ వచ్చారు. అయితే వారు సంపాదించిన సొమ్ము కొండలా పెరిగిన అప్పుకి వడ్డీ కట్టడానికి కూడా సరిపోలేదు. చివరికి వారు తమ కొద్దిపాటి పొలాన్ని అమ్ముకోవాల్సి వచ్చింది. అంతకు ముందు చేతిలో డబ్బు లేకపోయినా తినడానికి తిండి గింజలు ఉండేవి. భూమి అమ్మడంతో అవి కూడా లేక వారి కడుపుల్లో ఆకలి కూడా అప్పులాగే పేరుకుపోయింది. చివరికి ఆ ఊరిలో బతకలేక పట్నానికి వెళితే ఏదో ఒక కూలి పని చేసుకు బతకొచ్చు అని ఊరిలో ఎవరికీ చెప్పకుండా రాత్రికి రాత్రి ఆ కుటుంబం దూరంగా ఉన్న మహానగరానికి వలస పోయింది. పుట్టిన ఊరిని వదిలి వెళ్తున్నామని బాధ, స్నేహితులను ఇక కలవలేమనే బెంగ, అప్పు తీర్చకుండా పారిపోతున్నామనే సిగ్గుతో అతని ముగ్గురు పిల్లలు, భార్య ఎంత మథన పడ్డారో అతను చెబుతున్నప్పుడు అతని కళ్ళల్లో సన్నని నీటి పొర.

నేను చేసింది తప్పే అయినా పిల్లలను బతికించుకునేందుకు ఇంకో దారి దొరకలేదమ్మా అని అతను అన్నారు నాతో. పోనీలే అన్నా మీరు ఇంకా జీవితంతో పోరాడుతున్నారు, చాలా మంది రైతులు కుటుంబాలను వదిలేసి ఆత్మహత్యలు చేసుకుని వారిని ఇంకా అగాథంలోకి నెడుతున్నారు అని నేననగానే అవునమ్మా మా ప్రాంతంలో ఎంతో మంది నాలాంటి రైతులు వ్యవసాయం గిట్టుబాటు కాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు అన్నారు గోపాల్. విదర్భలో మాత్రమే కాదు దేశంలోని ప్రతి ప్రాంతంలోనూ రైతు ఆత్మహత్యలు నానాటికీ పెరిగిపోతున్నాయి. పెరిగిపోతున్న పెట్టుబడి ఖర్చులు, ఉత్పాదకత లోపిస్తున్న భూములు, సహకరించని వాతావరణం, దూరమైపోతున్న మార్కెట్ లు చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కాకుండా చేయడమే కాదు, వారిని, వారి కుటుంబాలను అప్పుల ఊబిలోకి, దుర్భర దారిద్ర్యం లోకి నెట్టి వేస్తున్నాయి.

ఇప్పుడు దేశమంతటా ఎన్నికల సీజన్ నడుస్తుంది. ఈ సీజన్లో అన్ని పార్టీలకు తప్పని సరిగా గుర్తువచ్చే అంశం రైతు సమస్యలు. ప్రతి పార్టీ మానిఫెస్టోలో తప్పని సరిగా ఉండే హామీ రుణ మాఫీలు. ఈ రుణ మాఫీల చరిత్రని ఒక్క సారి గమనిస్తే 1990 లో తొలిసారిగా అప్పటి ప్రభుత్వం 10000 కోట్ల రూపాయిల మేర రుణ మాఫీని ప్రకటించింది. తర్వాత 2009 సార్వత్రిక ఎన్నికలకు ముందు 2008 లో మరొకసారి 52000 కోట్ల రూపాయిల రుణ మాఫీ చేయడం జరిగింది. 2014 లో ఆంధ్రప్రదేశ్ లో 40000 కోట్ల రూపాయిల మేర, తెలంగాణాలో 20000 కోట్ల రూపాయిల మేర రుణ మాఫీ ప్రకటించారు. 2017 లో ఉత్తర ప్రదేశ్ లో 36000 కోట్ల రూపాయిలు తర్వాత మహారాష్ట్రలో 35000 కోట్ల రూపాయిలు రుణ మాఫీ ప్రకటించడం జరిగింది. ఇటీవల జరిగిన ఎన్నికలలో భాగంగా ఛత్తీస్ గఢ్, మధ్య ప్రదేశ్, రాజస్థాన్ లు కూడా దాదాపు 70000 కోట్ల రూపాయిల రుణ మాఫీని ప్రకటించడం జరిగింది.

అయితే ఇన్ని లక్షల కోట్ల రూపాయిల రుణాలు మాఫీ చేయడం వల్ల వ్యవసాయరంగానికి, సామాన్య రైతుకి ఒరుగుతుందేమిటి? వీటి వలన వ్యవసాయం లాభదాయకంగా మారిందా? రైతు కుటుంబాలు ఆర్థికంగా బలపడ్డాయా? రైతుల ఆత్మహత్యలు తగ్గాయా? నిజానికి రుణ మాఫీ వల్ల వీటిలో ఎటువంటి మార్పు రాలేదు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో అంచనాల ప్రకారం 1995 నుండి 2018 మధ్య కాలంలో దేశంలో ఐదు లక్షలకు పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇంతేకాక రుణ మాఫీ పథకం ఆయా రాష్ట్రాల ఖజానాపై అదనపు భారాన్ని మోపుతూ రాష్ట్రాల ఇతర ప్రయోజనాలను దెబ్బతీస్తుంది.

రుణ మాఫీ పథకాలు పరిగణించని మరో ప్రధాన అంశం సంస్థాగత రుణ సదుపాయం. దేశంలో అత్యధిక శాతం చిన్న, సన్న కారు రైతులకు బ్యాంకు రుణాలు ఇంకా పూర్తిగా అందుబాటులోకి రాకపోవడం, వచ్చినా అనేక ఇతర కారణాల వల్ల రైతులు ఇంకా రుణాల కోసం స్థానిక వడ్డీవ్యాపారుల మీదే ఆధారపడటం అందరికీ తెలిసిన విషయమే. గతంలో నాబార్డ్ (నేషనల్ బ్యాంకు ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్మెంట్) నిర్వహించిన ఆల్ ఇండియా రూరల్ ఫైనాన్సియల్ ఇంక్లూజన్ సర్వేలో దాదాపు ముప్పై శాతం పైగా వ్యవసాయదారులు తమ వ్యవసాయ రుణాల కోసం ఇప్పటికి వడ్డీ వ్యాపారులపైనే ఆధారపడుతున్నట్లు, మరొక తొమ్మిది శాతం మంది అటు వడ్డీ వ్యాపారులనుండి, ఇటు బ్యాంకు ల నుండి కూడా రుణాలు తీసుకుంటున్నట్లు తెలుస్తున్నది. మరోవైపు కౌలు రైతులకు సంస్థాగత రుణ సౌకర్యాలు ఎలాగూ అందుబాటులో ఉండవు.


ఇక ఈ రుణ మాఫీ ల వల్ల అధికంగా లబ్ధి పొందేది ఎవరు అంటే సంస్థాగత రుణ సౌకర్యాన్ని అందుకోగలిగే అవకాశం ఉన్న ధనిక, మధ్య తరగతి రైతులే తప్ప చిన్న రైతులు కాదు. చిన్న రైతులు వడ్డీ వ్యాపారులపై ఆధార పడేందుకు కేవలం బ్యాంకు రుణాలు అందుబాటులో లేక పోవడమే కారణం కాదు. గ్రామీణ ప్రాంతాలలోని పేద కుటుంబాలు స్థానిక వడ్డీ వ్యాపారులపై అనేక అవసరాలకు ఆధార పడుతుంటాయి. కేవలం వ్యవసాయ పెట్టుబడికి కాదు, ఇంట్లో ఏ అవసరం వచ్చినా, అనారోగ్యం వచ్చినా కాస్త వడ్డీ ఎక్కువ అయినా ఏ షూరిటీ లు లేకుండా అప్పులు ఇవ్వడమే కాదు చాలా సందర్భాలలో వీరే దళారులుగా మారి వారు నిర్ణయించిన ధరకు పంటను కళ్లం లోనే కొనుగోలు చేయడం కూడా జరుగుతుంటుంది. తనకు పండిన కొద్దిపాటి పంటను నిల్వ చేయడానికి కానీ, మద్దతు ధర వచ్చేంత వరకు వేచి ఉండేందుకు కానీ, మార్కెట్ వరకు తీసుకువెళ్లి అమ్ముకునే శక్తికానీ లేని చిన్న రైతుకు నిజానికి వడ్డీ వ్యాపారులు చేసేది పెద్ద సహాయంగా కనిపిస్తుంది తప్ప వారి దోపిడీ కనిపించదు. రైతుకు, దళారులకు ఉండే ఈ సంబంధాన్ని అర్థం చేసుకోకుండా ఎన్ని సదుపాయాలు కల్పించినప్పటికీ రైతులు సంస్థాగత రుణాల కంటే ఈ అధిక వడ్డీ రుణాలకే మొగ్గు చూపుతారనేది వాస్తవం. ఈ నేపథ్యంలో రుణ మాఫీ లాంటి పథకాల వల్ల వీరికి ఒరిగేదేమి లేదని స్పష్టంగా తెలుస్తుంది.

మరోవైపు రుణ మాఫీ పథకాల అమలు తర్వాత ఆయా రాష్ట్రాలలో బ్యాంకుల రుణాల రికవరీ శాతం విపరీతంగా తగ్గినట్లు, నాన్‌పెర్ఫార్మింగ్ అసెట్స్ బాగా పెరిగినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఏదో ఒకనాటికి మాఫీ చేస్తారులే అనే ధీమాతో చాలా మంది రైతులు తమ రుణాలను తిరిగి చెల్లించకుండా ఉండడంతో బ్యాంకింగ్ వ్యవస్థ దారుణంగా దెబ్బ తిన్నది. 2008 లో రుణ మాఫీ ల పై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక లో ఎంతో మంది అర్హత లేని రైతులు ఈ పథకం ద్వారా లబ్ది పొందినట్లు, సరైన తనిఖీలు లేకుండానే ఎంతో మందికి రుణ మాఫీ జరిగినట్లు తెలిసింది. రుణ మాఫీ పథకం బ్యాంకింగ్ వ్యవస్థను, రుణాల చెల్లింపులు, వసూళ్లకు సంబంధిన క్రమశిక్షణను దారుణంగా దెబ్బతీసిందనడంలో ఎటువంటి సందేహం లేదు.

దీనిని దృష్టిలో ఉంచుకునే రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ రఘురాం రాజన్ ఇటీవల ఎలక్షన్ కమిషన్ ను కలిసి రాజకీయ పార్టీలు రుణ మాఫీలను ఎలక్షన్ మానిఫెస్టోలో చేర్చకుండా చూడవలసిందిగా కోరినట్లు తెలుస్తున్నది. ఇంతేకాక ఇతర ఆర్థిక వేత్తలతో కలిసి ఆయన రూపొందించిన ఎకనామిక్ స్ట్రాటజీ ఫర్ ఇండియా వ్యవసాయ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అనేక ప్రత్యామ్నాయ సూచనలు చేయడం జరిగింది. దేశంలో నెలకొని ఉన్న వ్యవసాయ సంక్షోభాన్ని ఏ కొంచం చిత్తశుద్ధితో గమనించినా సమస్యలు ఎవరికైనా అర్థం అవుతాయి. చిన్నవైపోతున్న కమతాలు, సారం కోల్పోతున్న భూములు, నానాటికీ పెరిగిపోతున్న విత్తనాలు ఎరువులు వంటి ఇన్ పుట్ ఖర్చులు, అందుబాటులో లేని సంస్థాగత రుణ సౌకర్యాలు, వ్యవసాయ విస్తరణ సేవలు, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన లేకపోవడం, వ్యవసాయ ఉత్పత్తుల ను నిల్వ చేసుకునేందుకు గానీ, విలువ పెంపుకు గానీ తగిన సదుపాయాలు లేకపోవడం, మార్కెట్ లు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలెన్నో వ్యవసాయాన్ని నానాటికీ గిట్టుబాటు కాని వృత్తిగా మార్చేస్తున్నాయి.

ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం చూపకుండా రుణ మాఫీ చేయడం వల్ల రైతులకు ఒరిగేదేమి పెద్దగా ఉండదు అనేది వాస్తవం. మార్కెట్లను, సంస్థాగత రుణ సదుపాయాలను, ఇన్సూరెన్సు సదుపాయాలను, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని, విస్తరణ సేవలను ప్రతి రైతుకు అందుబాటులో తేవడం మాత్రమే వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించగలవు. రుణ మాఫీ అనేది రైతు సమస్యలకు తాత్కాలిక, పాక్షిక ఉపశమనమే తప్ప శాశ్వత పరిష్కారం ఎన్నటికీ కాదు. సమగ్రమైన, దీర్ఘకాలిక ప్రయోజనాలను కలిగించే పథకాలు మాత్రమే గోపాల్ వంటి రైతుల నిర్బంధ వలసలను, బలవన్మరణాలను ఆపగలవు తప్ప ఈ పాక్షిక పరిష్కారాలు వారికి ఎంత మాత్రం మేలు చేయలేవు.

ప్రజలను తక్కువ అంచనా వేస్తున్న కాంగ్రెస్



ఎస్. కిశోర్ కుమార్
9866399219

పేరులో గాంధీ.. చెయ్యి గుర్తు.. తరతరాలుగా పార్టీపై కుటుంబ పెత్తనం.. నెహ్రూ, ఇందిరమ్మ, రాజీవ్‌ల ఫొటోలు.. త్యాగాలు... ఇవే గత కొన్ని దశాబ్దాలుగా దేశంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న ప్రధాన ఆస్తులు, ప్రచారాస్త్రాలు. కాలం మారుతున్నప్పటికీ, ప్రతీ ఓటమి అనంతరం పార్టీలో అంతర్మథనాలు చోటు చేసుకుంటున్నప్పటికీ తన తీరులో ఏమాత్రం మార్పులేని కాంగ్రెస్ నైజం. ఫలితంగా గత ఐదు సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా పూర్వం ఎన్నడూ లేనంత ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ పార్టీలో యింకా వీటినే నమ్ముకుని నాయకులు ఉన్నారంటే ఆశ్చర్యం లేదు కానీ వీటి నుంచి దూరమవుతున్న కాంగ్రెస్ ఓటు బ్యాంకు మాత్రం గణనీయంగా ఉన్నదని స్పష్టంగా కనిపిస్తుంది. ఒకప్పుడు దేశవ్యాప్తంగా ఏకఛత్రాధిపత్యానికి కేరాఫ్ అడ్రస్ అయిన కాంగ్రెస్ పార్టీ నేడు బలంగా ఎదిగిన బిజెపి, ప్రాంతీయ పార్టీలతో ఎదురీదుతుంది. అందుకే కాంగ్రెస్ పార్టీ ఇంకా అరిగిపోయిన రికార్డులే ప్రదర్శిస్తామంటే స్వీకరించడానికి ప్రజలు సిద్ధంగా లేరనేది వాస్తవం.

దేశంలో భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఒక మతతత్వ పార్టీ అని, ఆ పార్టీకి వ్యతిరేకంగా లౌకిక పార్టీలన్నీ ఒక్కటి కావాలంటూ బిజెపి బద్ధ శత్రువైన కాంగ్రెస్ పార్టీ పిలుపునివ్వటం ఆనవాయితీ. బిజెపిని ఎదుర్కోవటానికి ఇదొక సులువైన మార్గం. ఇక బిజెపియేతర, కాంగ్రెస్‌యేతర పార్టీలు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నట్లయితే అక్కడ అధికార పార్టీకి అవినీతిని, కుటుంబపాలన తదితర సాకులను అంటగట్టి ప్రతిపక్ష పార్టీలను కూడగట్టి కూటమిని తయారు చేయటం కాంగ్రెస్ పార్టీ అత్యుత్సాహంగా చేస్తున్న పని. అధికారంలోకి రావటం కోసం, తన మనుగడ కాపాడుకోవటం కోసం, తన ఉనికి చాటుకోవటం కోసం సిద్ధాంత రహిత, అసంబద్ధ పొత్తులకు కాంగ్రెస్ పార్టీ పాల్పడుతుంది. అవకాశం దొరికితే బద్ధ శత్రువుతోనైనా జతకట్టడానికి నూట పాతిక సంవత్సరాల కాంగ్రెస్ దిగజారింది. దేశవ్యాప్తంగా ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చోటు చేసుకుంటున్న ఈ మార్పును ఎప్పటికప్పుడు గమనిస్తూ అవకాశం ఉన్న చోటల్లా ఒక బలమైన ప్రత్యామ్నాయం వైపు మొగ్గుచూపుతున్నారు. పర్యవసానంగా తమిళనాడులో గత 51 సంవత్సరాలుగా, పశ్చిమబెంగాల్‌లో గత 41 సంవత్సరాలుగా, ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో గత 29 సంవత్సరాలుగా, గుజరాత్, త్రిపుర రాష్ట్రాల్లో గత పాతిక సంవత్సరాలుగా, ఒడిశాలో గత 18 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ సంపూర్ణంగా అధికారానికి అందనంత దూరంగా ఉంటూ వస్తుంది. జార్ఖండ్ రాష్ట్రం ఏర్పడి 18 సంవత్సరాలు దాటినా కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు అక్కడ అధికారం చేపట్టలేకపోయింది. ఇక కేరళలో కాంగ్రెస్ పార్టీ ఒంటరి పోరుకు దూరమై అర్ధ శతాబ్దానికి చేరువైంది. అక్కడ సుమారు యాభై సంవత్సరాల క్రితం కాంగ్రెస్ పార్టీ భాగస్వామిగా ఏర్పడిన ఐక్య ప్రజాస్వామ్య కూటమి నేటికీ అక్కడి వామపక్ష ప్రజాస్వామ్య కూటమితో పోరాటం చేస్తూ అడపాదడపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలుగుతుంది. ఇవి కాకుండా దేశంలో మిగిలిన అనేక రాష్ట్రాలలో ఇటు ఒంటరిగా ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యాన్నీ అటు ఒంటరిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే శక్తినీ పూర్తిగా కోల్పోయిన పరిస్థితి, దుస్థితి కాంగ్రెస్ పార్టీకి ఏర్పడింది. మే 2018లో కర్నాటకలో శాసనసభకు జరిగిన ఎన్నికల అనంతరం అతి పెద్ద పార్టీగా అవతరించిన బిజెపిని అధికారంలోకి రాకుండా చేయడం కోసం కాంగ్రెస్ పార్టీ తన స్వశక్తిని తాకట్టు పెట్టి తన కన్నా తక్కువ సీట్లను పొందిన జనతాదళ్ (ఎస్)ను అధికార పీఠంపై కూర్చోబెట్టి విజయగర్వాన్ని చాటుకుంది. ప్రస్తుత తరుణంలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న మానసిక స్థితికి ఇది ఒక ఉదాహరణ అనుకోవచ్చు. అక్కడ కాంగ్రెస్ పార్టీకి ఇంతకుమించి మరో గత్యంతరం కనిపించలేదు. దేశ రాజకీయ పటంలో పెద్ద రాష్ట్రాలుగా గుర్తింపు ఉన్న ఉత్తరప్రదేశ్, బిహార్, తమిళనాడు, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లో నిరంతరం కేవలం తన ఉనికిని చాటుకోవటానికి ప్రతిసారీ అక్కడ బలంగా పాతుకుపోయిన ప్రాంతీయ పార్టీలలో ఏదో ఒకదానితో పొత్తు పెట్టుకోవటం మినహా కాంగ్రెస్ పార్టీకి మరో గత్యంతరం లేకపోయింది. ఇక ఆ రాష్ట్రాల్లో కనుచూపు మేరలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం అసంభవం. ఇక సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరమైన ఇతర రాష్ట్రాలలో సైతం ఆ లోటును బిజెపి లేదా బలమైన ప్రాంతీయ పార్టీలు వేగంగా భర్తీ చేస్తున్నాయి. అవి ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ రీఎంట్రీని మరింత కష్టతరం చేస్తున్నాయి. 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరమైంది. రాష్ట్ర విభజనతో నూతన ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యక్షంగా పూర్తి నష్టం జరిగింది. దీనికితోడు టిడిపికి పోటీగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మరో బలమైన ప్రాం తీయ పార్టీగా ఆవిర్భవించింది. ఇక అక్కడ కాంగ్రెస్ పార్టీకి అధికార పగ్గాలు అందనంత దూరమే. తెలంగాణ ఇచ్చిన పార్టీగా సెంటిమెంటుతో తెలంగాణ రాష్ట్రంలో పాగా వేద్దామనుకున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీకి కుదరలేదు. తెలంగాణలో ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోసం సుదీర్ఘకాల తమ పోరాటాన్ని తక్కువ అంచనా వేసుకోవటానికి సిద్ధంగా లేరు. అందుకే తాము చేసిన పోరాటానికి అలుపెరగని నాయకత్వం వహించిన టిఆర్ఎస్ పార్టీకే తమను ఏలుకోవటానికి వరుసగా రెండుసార్లు అవకాశం ఇచ్చారు తెలంగాణ ప్రజలు. కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకును అంచెలంచలుగా కొల్లగొట్టుకుంటూ దేశంలో విజయవంతంగా ఎదుగుతున్న ప్రధాన ప్రాంతీయ పార్టీలు తమిళనాడులో డిఎంకె, అన్నాడిఎంకె పార్టీలు, ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్వాదీ పార్టీలు, ఒడిషాలో బిజు జనతాదళ్, మహారాష్ట్రలో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ, బిహార్‌లో రాష్ట్రీయ జనతాదళ్, జనతాదళ్ (యునైటెడ్), పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, తెలంగాణలో తెలంగాణ రాష్ట్ర సమితి, ఢిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీ మొదలైనవి. ఇవి కాకుండా దేశంలో మరికొన్ని ప్రాంతీ య పార్టీలు కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకును కొల్లగొడుతూ అడపాదడపా తమ శక్తిని చాటుకుంటూ వస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ పతనం తీరును స్వయంగా గుర్తించి తనను తాను సంస్కరించుకునే లోపు మరికొన్ని ప్రాంతీయ పార్టీలు ఆ లోటును భర్తీ చేసుకుంటూ పుంజుకునే అవకాశం కూడా లేకపోలేదు.

సకుటుంబం

రోజురోజుకూ మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. మగాళ్ల రూపంలో వున్న కొన్ని మృగాలు మహిళలను పైశాచికంగా హింసిస్తున్నారు. అలాంటి వాళ్ల చేతుల్లో దేశ వ్యాప్తంగా లైంగిక హింసకు గురై, ప్రాణాలు కాపాడుకున్న 5,000 మంది మహిళల గళాన్ని ప్రపంచానికి తెలియజేయాలనే ప్రయత్నానికి ఓ స్వచ్ఛంద సంస్థ శ్రీకారం చుట్టింది. వాళ్లంతా అత్యాచార బాధితులు. అంతా కలిసి దేశవ్యాప్తంగా 200 జిల్లాల్లో ప్రయాణిస్తున్నారు. 65 రోజుల పాటు సాగే ఈ ప్రచార కార్యక్రమం ప్రధాన లక్ష్యం.. సాటి మహిళలకు తమ గాథల ద్వారా అవగాహన కల్పించడమే..

మగాళ్ల ఆలోచనను మార్చే
మహిళల డిగ్నిటీ మార్చ్





మన దేశంలో ఎక్కడో ఓ మూల ఎవరో ఒకరు అత్యాచారానికి గురవుతూనే ఉన్నారు. వాళ్లలో పసివాళ్ల నుంచి అరవైఏళ్లు దాటినవారూ ఉన్నారు. అలాంటివారి కష్టాలను కళ్లారా చూసిన ఓ స్వచ్ఛంద సంస్థ దేశవ్యాప్తంగా ఈ ప్రచారానికి శ్రీకారం చుట్టింది. అలాంటి దారుణాలు ఇతరుల జీవితాల్లో చోటు చేసుకోకుండా అవగాహన కల్పించడమే ఆ సంస్థ ఉద్దేశం. అలా 'డిగ్నిటీ మార్చ్' పేరుతో 'రాష్ట్రీయ గరిమ అభియాన్' అనే సంస్థ 2018 డిసెంబరు 20న ప్రారంభించిన ఈ ప్రచారం ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో కొనసాగుతోంది. పలువురు అత్యాచార బాధితులు ఈ యాత్రలో పాల్గొని తమ గళాన్ని ప్రజలకు వినిపిస్తున్నారు.

బాధితులకు భరోసా....

. దేశ వ్యాప్తంగా లైంగిక దాడులకు గురైన వారు లక్షలాది మంది వున్నారు. అయితే వారిలో 6 శాతం బాధితులు మాత్రమే న్యాయం కోసం పోరాటం చేస్తున్నారు. దేశంలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, గోవా, ముంబై, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్రలలో లైంగిక దాడులు అధికంగా జరుగుతున్నాయి. మా సంస్థ ద్వారా గడిచిన 10 సంవత్సరాలలో ఇప్పటికి 50 వేల మందిని ప్రత్యక్ష్యంగా కలిసి, వారి తరుపున న్యాయం కోసం పోరాడుతున్నాం. ఇప్పటి వరకు 24 రాష్ట్రాలలో మేము పర్యటించి అక్కడి బాధితులకు భరోసా కల్పిస్తూ ముందుకు సాగిపోతున్నాం'' అంటున్నారు రాష్ట్రీయ గరిమా అభియాన్ కన్వీనర్ ఆసీఫ్ షేక్.

చాలామంది ఇప్పటికీ తమపై అత్యాచారం జరిగిందని చెప్పుకోవడానికి భయపడుతుంటారు. కానీ డిగ్నిటీ మార్చ్ బృంద సభ్యులెవరూ అలా భయపడరు. తమకు ఎదురైన సమస్యల్ని ధైర్యంగా నలుగురి ముందుకు వచ్చి చెబుతారు. అలా చెప్పేవాళ్లలో ఈ బృంద సభ్యుల్లో కీలక భాగస్వామి ఉత్తర్‌ప్రదేశ్‌లోని లలిత్‌పూర్‌కి చెందిన కాశీబాయ్. ఆమె కూతురు అత్యాచార బాధితురాలు. స్కూల్‌కి వెళ్ళే తన కూతురిపై విద్యా బుద్ధులు చెప్పి విలువలు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడే అత్యాచారం చేశాడు.అంతేకాదు ఈ విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తానంటూ బాలికను బెదిరించాడు. ఆ అవమాన భారాన్ని తట్టుకోలేక బాలిక ఆత్మహత్యకు ప్రయత్నించడంతో ఈ విషయం బయటపడింది. కాశీబాయ్ పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళి కేసు నమోదు చేస్తే పోలీసులు నిందుతుడి పక్షాన నిలబడి నిర్లక్ష్యంగా వ్యవహరించి 10 లక్షలు ముట్టజెప్పే ప్రయత్నం చేశారు. కాశీబాయ్ దీనికి నిరాకరించడంతో పోలీసులు, నిందితులు ఒక్కటై కేసుని పక్కదారి పట్టించారు. అన్నింటినీ ఎదుర్కొని కాశీబాయ్ న్యాయ పోరాటానికి దిగింది. అయినా ఇప్పటి వరకు ఫలితం దక్కలేదు కనీసం కూతురి మెడికల్ రిపోర్ట్స్ కూడా బయటకు రానివ్వలేదు. కేసుకు సంబంధించి ఇంతవరకు కోర్టులో ఒక్క విచారణ కూడా జరగలేదు. ఈ గాథ విన్న ప్రతి ఒక్కరికీ కళ్లు చమర్చాయి.

ఇలాంటి మరొక అమ్మ గాధ ఉత్తర్ ప్రదేశ్‌లోని ఝాన్సీ జిల్లాకు చెందిన గీతది. ఆరవ తరగతి చదువుతున్న తన కూతురిపై తోటి విద్యార్థి అత్యాచారం చేశాడు. ఎన్ని సార్లు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగిన ఫలితం దక్కలేదు. పోలీసులు నామమాత్రపు ఫిర్యాదు తీసుకొని వదిలేశారు. ఈ క్రమంలో కూతురి కోసం ఆమె ఎన్నో అవమానాలు ఎదుర్కొంది. కానీ ఆత్మవిశ్వాసంతో అన్నీ భరించి, అలాంటి బాధితులకు సాయమందించే సంస్థలో సభ్యురాలైంది. ఇప్పుడీ ప్రచారంలో మహిళల్లో పోరాట స్ఫూర్తి నింపుతోంది గీత. చాలాసార్లు అత్యాచార నిందితులు చట్టం నుంచి తప్పించుకుంటారు. కొన్నిసార్లు కేసు తారుమారు కావచ్చు. దాంతో నిందితులకు ఎలాంటి శిక్షా పడదు. అలా నిందితులు తప్పించుకోవడం ఎంతవరకు సమంజసం అనే నినాదంతోనే డిగ్నిటీ మార్చ్ ప్రారంభమైంది. మొదట ముంబయిలో ప్రారంభమైన ఈ ప్రచారం చివరకు ఢిల్లీకి వెళ్లడంతో ముగియనుంది. ఆ మధ్యలో ఈ మహిళలంతా

24 రాష్ట్రాల్లో... 65 రోజులపాటు... 200 జిల్లాల్లో... 10వేల కిలోమీటర్లు పర్యటిస్తారు. ఈ మార్చ్‌లో భాగంగా బాధితులు తమకు ఎదురైన సంఘటనలు పంచుకుంటున్నారు. జాగ్రత్తలు వివరిస్తున్నారు. వీరికి ఆయా ప్రాంతాల్లోని స్వచ్ఛంద సంస్థలు, యూనివర్సిటీలు, మరికొన్ని సంస్థలు వసతి, భోజనం, ఇతర సదుపాయాల్ని సమకూరుస్తున్నాయి. ఐదు వేల మంది ఒకేసారి కాకుండా వారానికి నూట యాభై మంది చొప్పున ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే ముంబయి నుంచి బస్సుల్లో బయలుదేరిన వీళ్ల గోవా, కర్ణాటక, కేరళ, తమిళనాడు మీదుగా తెలుగు రాష్ట్రాలను చేరుకుని తమ గళాన్ని చాటుతున్నారు. గడిచిన పదేళ్లలో ఇప్పటికి 50 వేల మందిని ప్రత్యక్షంగా కలిసి వారి తరఫున న్యాయం కోసం పోరాటం చేస్తోంది ఈ డిగ్నిటీ సంస్థ. లైంగిక బాధితులు కలిసికట్టుగా తమకు జరిగిన అన్యాయాన్ని దేశ వ్యాప్తంగా పర్యటించి వివరిస్తూ, మహిళల్లో ఆలోచనాధోరణిని పెంపొందించడం అభినందనీయం.

ఫీచర్స్ డెస్క్

సభ్యసమాజం సిగ్గుపడాలి...



డిగ్నిటీ మార్చ్ అనేది అత్యాచారలకు, లైంగిక హింసకు వ్యతిరేకంగా 10000 మంది స్త్రీలు, పురుషులు కలిపి నడుపుతున్న ఒక యాత్ర. రేప్ కల్చర్‌కి మేము వ్యతిరేకం అందువల్ల భూమిక ద్వారా డిగ్నిటీ మార్చ్‌ని ప్రోత్సహిస్తున్నాం. అత్యాచారానికి గురైన వారికి ఎలాంటి న్యాయం దక్కకపోగా వాళ్ళనే అత్యాచారానికి బాధ్యులిగా భావించి గ్రామాల నుండి వెలివేయడం లాంటి సంఘటనలకు వ్యతిరేకంగా, మాకు న్యాయం కావాలంటూ ఇన్ని వేల మంది దేశమంతా తిరగడమనేది సభ్యసమాజం సిగ్గుపడాల్సిన విషయం. మన న్యాయ వ్యవస్థ వైఫల్యానికి వీరి యాత్ర నిదర్శనం. బాధితులందరూ బయటకు వచ్చి నాకూతురిపై అత్యాచారం జరిగింది నా మీద జరిగింది అని చెప్పుకుంటూ తిరగడమనేది చాలా దౌర్భాగ్యమైన విషయం.

కొండవీటి సత్యవతి, భూమిక ఎడిటర్

డిగ్నిటీతో మార్పుకి శ్రీకారం



మనుషుల ఆలోచనా దృక్పథంలో మార్పు రావడానికి ఈ డిగ్నిటీ మార్చ్ చాలా ఉపయోగపడుతుంది. నేరస్తుడు బాహాటంగా తిరగడం, బాధితులు నిశ్శబ్దంగా ముడుచుకుపోవడం అనేది మనం ఇనాళ్లు చూస్తున్న దృశ్యం. బాహాటంగా తమకు జరిగిన అన్యాయాన్ని బాధితులు తెలియజేయడం వల్ల సమాజంలో కొందరి ఆలోచనా పద్ధతయినా మారుతుంది. కూతురికి జరిగిన అన్యాయానికి ఒక తల్లి పడే ఆవేదన, వారి పట్ల పోలీసులు చూపిస్తున్న జులుం. తల్లి అండదండలు వున్నప్పటికీ మానసికంగా కృంగిపోయి ఆత్మహత్యకు పాల్పడ్డ కూతురు ఇలాంటి గాధలు వింటుంటే చాలా బాధగా వుంది. తప్పుని తప్పు అని గుర్తించని వ్యవస్థ ఉన్నంత వరకు ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి. అందువల్ల మనం మొత్తం వ్యవస్థ మారాలంటే బాధితులందరూ ఇలా సన్నిహితమై గళం విప్పి న్యాయం కోసం పోరాడాలి.

శిలాలోలిత, రచయిత్రి

వ్యవస్థకు పెద్ద సవాలు



స్త్రీలపై హింస భారతం, భాగవతం కాలం నుంచే జరుగుతుంది. ద్రౌపది కాలం నుంచి బాధితులే అవమానాలు, ఛీత్కారాలు ఎదుర్కొంటున్నారు. కానీ ఈ ఉద్యమంలో బాధితులు గళమెత్తి తమకు జరిగిన అన్యాయాన్ని బాహాటంగా తెలియజేస్తున్నారు. ఈ ఉద్యమంలో బాధితులు, సామాజిక కార్యకర్తలు కలిసికట్టుగా నడవడం వల్ల ఇది ఒక్కరి సమస్య కాదు అందరి సమస్యనే స్పృహ వస్తోంది. చాలా పెద్ద మార్పు దిశగా డిగ్నిటీ మార్చ్ అడుగులు వేస్తోంది. ఇది వ్యవస్థకి ఒక పెద్ద సవాలు. తప్పనిసరిగా ఇప్పుడు చట్టం, న్యాయం మహిళల వైపు మాట్లాడి తీరక తప్పదు. అటువంటి మార్పుకి ఈ యాత్ర నాంది పలుకుతోంది. ఇది ఒక ప్రవాహం. దీని గురించి మరిన్ని కథలు, కవిత్వ రూపంలో రావాలి. పాఠ్యాంశంలో ఉండాలి. మార్పులన్నింటీ ఇదొక పునాదిరాయి.

కొండేపూడి నిర్మల, రచయిత్రి

న్యాయంకోసం పోరాటం..




లైంగిక హింసకు గురైన మహిళలు, వారి కుటుంబ సభ్యులు డిగ్నిటీ మార్చ్‌లో పాల్గొన్నారు. దాడికి గురైన బాధితులు న్యాయం కోసం పోరాడుతున్న క్రమంలో వారు పోలీసులు, కోర్టుల చుట్టూ తిరుగుతూ మరింత వ్యధకు గురవుతున్నారు. ఒక బాధితురాలు పోలీస్ స్టేషన్‌ని ఆశ్రయించినప్పుడు ఎటువంటి సమాధానం వాళ్ళు పొందుతున్నారు. కోర్టులలో వారికి సంబంధించిన న్యాయం ఎలా నడుస్తుంది. దానికి తగ్గట్టుగా సుప్రీం కోర్టు 2013లో నిషేధించిన టూ ఫింగర్ టెస్ట్ ఎలా అమలవుతుంది. అంటే హాస్పిటల్ కావచ్చు, పోలీస్ స్టేషన్ కావచ్చు, కోర్టు కావచ్చు వారి పట్ల ఎంత అన్యాయంగా ప్రవర్తిస్తుందనే విషయాన్ని ఈ డిగ్నిటీ మార్చ్ ద్వారా బాధితులు తెలియజేస్తున్నారు. వాళ్ళు ప్రత్యేకంగా ఏం అడగడం లేదు ఉన్న చట్టాలను సక్రమంగా అమలుచేసి న్యాయం చేయమని కోరుతున్నారు.

దేవి, సామాజిక కార్యకర్త

మన రంగవల్లులు



సరస్వతి, న్యూ నాగోల్



21 చుక్కలు
1 వచ్చే వరకు

శారద, కీసరగుట్ట



డైరీ ఆవిష్కరించిన హోంమంత్రి

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ(పిఆర్‌టియు)డైరీని మంగళవారం రాష్ట్ర హోం మంత్రి మహమ్మద్ మహమూద్ అలీ ప్రారంభించారు. అనంతరం హోంమంత్రి మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకోసం మరింత శ్రమించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల్లో విద్యను అందించాలని సూచించారు. డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో కౌన్సిల్ చీఫ్ విప్ సుధాకర్‌రెడ్డి ఎంఎల్‌సి, మారెడ్డి అంజిరెడ్డి, ఎం చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక రైలు

మన తెలంగాణ / హైదరాబాద్ : సంక్రాంతి పర్వదినం నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే అధికారులు హైదరాబాద్ టు తిరుపతి ప్రత్యేక రైలును ఏర్పాటు చేశారు. 02764 నెంబర్ గల ప్రత్యేక రైలు ఈ నెల 12వ తేదీన హైదరాబాద్‌లో సాయంత్రం ఆరు గంటలకు బయలుదేరి తర్వాత రోజు ఉదయం ఏడు గంట లకు తిరుపతి చేరుకుంటుంది. 02763 నెంబర్ కలిగిన ఈ ట్రైన్ తిరుగు ప్రయాణంలో ఈ నెల 13న తిరుపతిలో ఐదు గంటలకు బయలుదేరి తర్వాత రోజు ఉదయం ఆరు గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఏసి టు, త్రి టయర్‌తో పాటు స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ బోగీలతో కాజీపేట, ఖమ్మం, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు. గూడూరు, రేణిగుంట స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తుంది.

టీచర్ ఎంఎల్‌సికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ

మాజీ ఎంఎల్‌సి బి.మోహన్‌రెడ్డి



మనతెలంగాణ/హైదరాబాద్ : కరీంనగర్ ఉపాధ్యాయ ఎంఎల్‌సికి నుంచి తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని మాజీ ఎంఎల్‌సి బి.మోహన్ రెడ్డి ప్రకటించారు. ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా తాను పోటీ చేస్తున్నానని స్పష్టం చేశారు. మంగళవారం హోటల్ సెంట్రల్ కోర్టులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల కోసం 32 ఏళ్లుగా పనిచేశానని తెలిపారు. ఐదు పిఆర్‌సిలకు నాయకత్వం వహించానని పేర్కొన్నారు. తనకున్న అనుభవంతో విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఉపాధ్యాయులు ఉన్నతిని పెంచడానికి కృషి చేస్తున్నారు. తనను మరోసారి గెలిపిస్తే ఏకీకృత సర్వీస్ రూల్స్, సిపిఎస్ రద్దు, పిఆర్‌సి అప్‌గ్రేడేషన్ తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఎయిడెడ్ విద్యాసంస్థల పునర్నిర్మాణం చేస్తున్నాని, ఎయిడెడ్ విద్యాసంస్థలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఎప్పుడు ధరలు పెరిగినా కరువుభత్యం పెరగాలని, మార్చిలోగా ఐఆర్ ప్రకటించాలని మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. కరీంనగర్ ఎంఎల్‌సి అభ్యర్థిగా బి.మోహన్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్నట్లు రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షులు లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రప్రసాద్, పిఆర్‌టియు మాజీ ప్రధాన కార్యదర్శి పి.వెంకటరెడ్డిలు ప్రకటించారు.

రెండో రోజు భారీగా నామినేషన్లు

తొలి విడతకు నేడు సాయంత్రం 5 వరకు గడువు

మన తెలంగాణ/హైదరాబాద్ : తొలి విడత పంచాయతీ ఎన్నికలకు రెండో రోజు భారీగా నామినేషన్లు దాఖలు అయ్యాయి. సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థిత్వానికి మొదటి రోజు, రెండోనాడు వేసిన వాటితో కలిపి మొత్తం 29,426 నామినేషన్లు వచ్చాయి. ఇందులో 4479 పంచాయతీలకు సర్పంచ్ పదవికి 8524 నామినేషన్లు రాగా, 39,822 వార్డులకు 20,902 నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం 4479 గ్రామ పంచాయతీలకు తొలిదశలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అన్ని 4449 పంచాయతీలకు రెండో రోజున సర్పంచ్‌కు 5413, వార్డు మెంబర్‌కు 16,946 నామినేషన్లు వచ్చాయి. ఇదిలా ఉండగా బుధవారం తొలివిడత పంచాయతీకి నామినేషన్లకు దాఖలునకు తుది గడువుగా ఉంది. అత్యధికంగా సిద్ధిపేటలో జిల్లాలో సర్పంచ్ అభ్యర్థిత్వానికి 661 నామినేషన్లు వేయగా అత్యల్పంగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 78 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక వార్డు సభ్యుల అభ్యర్థిత్వానికి సంగారెడ్డిలో 2366 నామినేషన్లు, వనపర్తి జిల్లాల్లో 171 నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల సంఘం తెలిపింది.

అలోక్ వర్మకు మళ్లీ సిబిఐ డైరెక్టర్ పదవి

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. కేంద్రం ఆయనను బలవంతంగా సెలవుపై పంపడాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది.ఆయనను అలా బలవంతంగా సెలవుపై పంపడం కుదరదని, వెంటనే బాధ్యతలు అప్పగించాలని స్పష్టం చేసింది. ఈ అంశంపై ప్రధాన మంత్రి, ప్రతిపక్ష నాయకుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన అత్యున్నత స్థాయి కమిటీ వారం రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది. అప్పటిలోగా అలోక్ వర్మ ఎలాంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకోరాదని కూడా న్యాయస్థానం స్పష్టం చేసింది.అలాగే సిబిఐ తాత్కాలిక డైరెక్టర్‌గా ఎం నాగేశ్వర రావును నియమిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సైతం న్యాయస్థానం పక్కన పెట్టింది. . ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ ఈ తీర్పును రాశారు. అయితే గొగోయ్ ఈ రోజు కోర్టుకు రానందున ఆయన తరఫున న్యాయమూర్తులు ఎస్‌కె కౌల్, కెఎం జోసెఫ్‌లు తీర్పును ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం తనను బలవంతంగా పెలలవుపై పంపడాన్ని సవాలు చేస్తూ అలోక్‌నాథ్ దాఖలుచేసుకున్న పిటిషన్‌పై కోర్టు ఈ తీర్పు వెలువరించింది. అలోక్‌వర్మ రెండేళ్ల పదవీకాలం ఈ నెల 31తో ముగియనుంది.అలోక్ వర్మ, సిబిఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానాలు ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకోవడం, వారి మధ్య వివాదాలు రచ్చకు దారితీయడంలో కేంద్ర ప్రభుత్వం గత ఏడాది అక్టోబర్ 23న వారిద్దరినీ దీర్ఘకాలిక సెలవుపై పంపిస్తూ, నాగేశ్వర రావును తాత్కాలిక డైరెక్టర్‌గా నియమించిన విషయం తెలిసిందే. అయితే దీనిపై అలోక్‌వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇప్పుడు సుప్రీం తీర్పుతో అప్పుడు ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులు రద్దయినట్లయింది.

అయోధ్యపై రాజ్యాంగ ధర్మాసనం

(మొదటిపేజీ తరువాయి)

నలుగురు న్యాయమూర్తుల్లో ఎస్ఎ బోబ్డే, ఎన్‌వి రమణ, యుయు లలిత్, డివై చంద్రచూడ్‌లు ఉన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని వివాదాస్పద రామజన్మ భూమి– బాబ్రీమసీదు వివివాదాస్పద ప్రాంతం గురించి దాఖలయిన ఈ కేసు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఈ ప్రాంతంలోని 2.77 ఎకరాల భూమిని సున్నీ వక్ఫ్ బోర్డు, నిర్మోహి అఖారా, రామ్ లల్లాలకు మూడు భాగాలుగా పంచుతూ 2010లో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలయిన 14 పిటిషన్లను సుప్రీంకోర్టు విచారిస్తున్న విషయం తెలిసిందే. ఈ పిటిషన్లను విచారించడానికి ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తామని, జనవరి మొదటివారంలో ఆ బెంచ్ ముందుకు ఇది విచారణకు వస్తుందని సుప్రీంకోర్టు ఇంతకు ముందు ప్రకటించిన విషయం తెలిసిందే.







లోక్‌సభ జై

(మొదటిపేజీ తరువాయి)

తొలుత చర్చను ప్రారంభిస్తూ ,బిల్లులోని పలు లోపాలను ఎత్తి చూపుతూ, దాన్నిసంయుక్త పార్లమెంటరీ(జెపిసి)కి పంపించాలని డిమాండ్ చేశారు. తాను బిల్లుకు వ్యతిరేకం కాదని ఆయన అంటూనే సరయిన హోంవర్క్ చేయకుండా బిల్లును తీసుకు వచ్చినట్లు కనిపిస్తోందని అధికారపక్షాన్ని ఉద్దేశించి అన్నారు. లబ్ధిదారుల ఆదాయపరిమితిని ప్రభుత్వం రూ.8 లక్షలుగా నిర్ణయించడం వల్ల అగ్రవర్ణాల్లో సంపన్నులు కూడా రిజర్వేషన్ల ప్రయోజనాలు పొందుతారన్నారు. అయితే చర్చలో జోక్యం చేసుకున్న ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రతిపక్షాల విమర్శలను తిప్పి కొట్టారు. కోటాలు 50 శాతానికి మించితే కోర్టులు కొట్టివేస్తాయని చాలామంది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, అయితే అది కుల అధారిత రిజర్వేషన్లకు మాత్రమేనని ఆర్థిక సంబంధిత రిజర్వేషన్ల విషయంలో కాదని ఆయన అన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేయడం కోసమే ఈ బిల్లును తీసుకు వచ్చినట్లు చెప్పారు.

అంతేకాదు అన్ని పార్టీలు కూడా తమ మేనిఫెస్టోల్లో ఈ రిజర్వేషన్లను సమర్థించాయన్నారు. తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు సుదీప్ బందోపాధ్యాయ బిల్లును సమర్థించినప్పటికీ దేశంలో పెద్ద ఎత్తున ఉన్న నిరుద్యోగానికి ఇది ఎలా సమాధానమవుతుందో అర్థం కావడం లేదన్నారు. బిల్లుపై జరిగిన చర్చ ముగింపు సందర్భంగా మంత్రి థావర్ చంద్ మాట్లాడుతూ, రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 15కు క్లాజ్(6), ఆర్టికల్ 16కు క్లాజ్(6) చేరుస్తున్నామని ప్రకటించారు. రెండేళ్ల క్రితం తమ ప్రభుత్వమే క్రీమీ లేయర్ పరిమితిని రూ.6లక్షలనుంచి రూ.8 లక్షలకు పెంచిందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ సహా అన్ని పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపినప్పటికీ రాజ్యాంగ సవరణ బిల్లు అయినందున డివిజన్ ఓటింగ్ తప్పనిసరని స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటించారు. సభ్యులు ప్రతిపాదించిన సవరణలపై డివిజన్ వారీగా ఓటింగ్ నిర్వహించారు. రిజర్వేషన్ బిల్లుకు అనుకూలంగా 323 మంది సభ్యులు ఓటు వేయగా ముగ్గురు సభ్యులు మాత్రమే వ్యతిరేకంగా ఓటు వేశారు. బిల్లు ఆమోదం పొందిన తర్వాత లోక్‌సభ నిరవధికంగా వాయిదాపడింది. కాగా బుధవారం రాజ్యసభలో ఇదే బిల్లును ప్రవేశపెట్టనున్నారు. అయితే రాజ్యసభలో బిల్లుకు ప్రతిపక్షాలనుంచి వ్యతిరేకత ఎదురవుతుందా, లేక లోక్‌సభలో మాదిరిగానే మద్దతు ప్రకటిస్తారా అనేది వేచి చూడాల్సి ఉంది. అయితే బిల్లులో కొన్ని సవరణలకోసం ప్రతిపక్షాలు రాజ్యసభలో పట్టుబట్టవచ్చని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

అన్ని వర్గాలకు న్యాయం చేసేందుకే : జైట్లీ



అగ్రవర్ణాల పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రతిపక్షాలు వ్యక్తం చేస్తున్న అనుమానాలు అర్థం లేనివని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. బిల్లుపై లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా అరుణ్ జైట్లీ మాట్లాడుతూ, రాజ్యాంగ నిర్మాతల స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లేందుకు ఈ బిల్లు ద్వారా ప్రయత్నిస్తున్నామని చెప్పారు.' దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయడానికే మా ఈ ప్రయత్నం.ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను ముందుకు తీసుకు రావాలన్నదే బిల్లు ఉద్దేశం. ఈ బిల్లకు రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు. ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ అనే అంశాన్ని 15వ అధికరణ (5)వ క్లాజ్ సవరణ సమయంలోనే చేర్చడం జరిగింది. అదే ప్రకారం ఇప్పుడు ఆర్థికంగా వెనుకబడిన రిజర్వేషన్లు కల్పించడానికి ప్రయత్నిస్తున్నాం. మాజీ ప్రధాని పివి నరసింహారావు హయాంలో ప్రత్యేక చట్టం ఏదీ చేయలేదు. అందుకే కోర్టు కొట్టివేసింది. రిజర్వేషన్లు యాభై శాతం దాటితే కోర్టు కొట్టివేస్తుందని చాలా మంది అంటున్నారు. ఆ ఆందోళన నిజమే. అయితే ఆ పరిమితి కులాల ఆధారిత రిజర్వేషన్లకు మాత్రమే. ఈ బిల్లు జనరల్ కేటగిరీలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడానికి ఉద్దేశించినది' అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో సైతం ఈ మేరకు హామీ ఇచ్చిన విషయాన్ని జైట్లీ ప్రస్తావిస్తూ, ఈ బిల్లును సమర్థించడం ద్వారా ఆ పార్టీ తన మాట నిలబెట్టుకోవాలని అన్నారు. వాస్తవానికి అన్ని పార్టీలు దీన్ని సమర్థిస్తున్నాయన్నారు.

ఇదో రాజకీయ జిమ్మిక్కు : తృణమూల్

రిజర్వేషన్ల రాజ్యాంగ సవరణ బిల్లు రాజకీయ జిమ్మిక్కేమోనని అనుమానం కలుగుతోందని తృణమూల్ కాంగ్రెస్ ఎంపిలు అభిప్రాయపడ్డారు. ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు ఎందుకు ఇంత ప్రాధాన్యత ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇది వాగ్దానాలకు సంబంధించిన బిల్లే తప్ప అమలుకు సంబంధించిన బిల్లు కాదని ఆ పార్టీ ఎంపి సుదీప్ బందోపాధ్యాయ అన్నారు.

బిల్లు ఉద్దేశం మంచిదే : శివసేన

బిల్లును తీసుకొస్తున్న ఉద్దేశం మంచిదేనని, అన్ని రాష్ట్రాల్లోను రిజర్వేషన్ల కోసం ఆందోళనలు చేస్తున్నారని బిజెపి మిత్రపక్షమైన శివసేన ఎంపిలు పేర్కొన్నారు. అర్హత ఉండి రిజర్వేషన్లు కోల్పోయిన వారికి అవకాశాలు కల్పించాలని సూచించారు.

ఇంత తొందరెందుకు : అన్నాడిఎంకె

ఇబిసి రిజర్వేషన్ల బిల్లును ఇంత హడావుడిగా తీసుకు రావలసిన అవసరం ఏమొచ్చిందని అన్నాడిఎంకె ఎంపి తంబిదురై ప్రశ్నించారు. సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయకపోవడం వల్లనే ఇంకా పేదరికం ఉందని,70 ఏళ్ల స్వతంత్ర భారత్‌లో ఇంకా కులవివక్ష ఉందని అన్నారు.

పాశ్వాన్ మూడు డిమాండ్లు



చర్చలో కేంద్ర మంత్రి, లోక్‌జనశక్తి పార్టీ అధ్యక్షుడు రాంవిలాస్ పాశ్వాన్ మాట్లాడుతూ జనరల్ కేటగిరీ రిజర్వేషన్లపై మూడు డిమాండ్లను సభ ముందుంచారు.60 శాతం రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, అలా చేస్తే కోర్టులో సవాలుచేయడానికి వీలుండదన్నారు.అదే విధంగా 60 శాతం రిజర్వేషన్లను ప్రైవేటు రంగంలోను, ఇండియన్ జ్యుడీషిల్ సర్వీసులోను అమలు చేయాలని సూచించారు. బిల్లుకు తమ పార్టీ మద్దతును ప్రకటించారు.

తొందరపాటు చర్య : కెవి థామస్



అగ్రవర్ణాల పేదల రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం తొందరపాటుగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ ఎంపి కెవి థామస్ అన్నారు. ఈ తరహా నిర్ణయాలు అనేక సమస్యలకు దారితీస్తాయని ఆయన అభిప్రాపడ్డారు. మాజీ ప్రధాని పివి నరసింహారావు హయాంలో ఆర్థిక వెనుకబాటు ఆధారంగా రిజర్వేషన్లు తెచ్చారని, అయితే ఆ రిజర్వేషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసిందని థామస్ గుర్తు చేశారు. ఎన్‌డిఎ సర్కార్‌కు ఇంక మూడు నెలల సమయం మాత్రమే ఉందని, తొందరపాటుతో తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఏమనాలో అర్థం కావడం లేదన్నారు. తప్పులను కప్పిపుచ్చుకోవడానికే తప్పులమీద తప్పులు చేస్తోందని విమర్శించారు. అన్‌ఎయిడెడ్ విద్యాసంస్థల్లో రిజర్వేషన్లను ఎలా అమలు చేస్తారో చెప్పాలని ఆయన నిలదీశారు.

మరింత చర్చ అవసరం : సుప్రియ

రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణ బిల్లుపై మరింత చర్చ జరగాల్సిన అవసరం ఉందని ఎన్‌సిపి ఎంపి సుప్రియా సూలే అభిప్రాయపడ్డారు. విపక్షాలు అక్కసుతో ఉన్నాయని ఆరోపించడం సరికాదన్నారు. ఈ తక్కువ సమయంలోనే సభ్యులు మాట్లాడుతూ ఉంటే ఇద్దరు మంత్రులు అడ్డుతగులుతున్నారన్నారు.మరో నాలుగు రోజులు పార్లమెంటును పొడిగించినా చర్చించడానికి ప్రతిపక్షాలుసిద్ధంగా ఉన్నాయన్నారు.



క్యూనెట్ కేటుగాళ్లు అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

చేతిలో మోసపోయిన వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు విచారణ ప్రారంభించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ వివరాలు వెల్లడించారు. 1998లో హంకాంగ్‌లో ఏర్పాటు చేసిన గోల్డ్ క్వెస్ట్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్, క్వెస్ట్ నెట్ ఎంటర్‌ప్రైసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మల్టీలెవల్ మార్కెటింగ్ కంపెనీలు క్యూఐ పేరుతో గత ఆరేళ్ల నుంచి ఇండియాలో వ్యాపారం నిర్వహిస్తున్నాయి. క్యూఐ గ్రూప్‌ను విజయ్ ఈశ్వరన్, జోసెఫ్ బిస్మార్క్ ఏర్పాటు చేశారు. ఛీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ ట్రేవర్ కునా, సిఈఓలు మైకేల్ ఫెరారియా, మల్కాం దేశాయ్ వ్యాపార వ్యవహారాలు నడిపిస్తున్నారు. ఇండియా, ఫిలిప్పిన్స్, కంబోడియా, నేపాల్, ఇండోనేషియా, టర్కి, సౌదీ అరేబియా, రష్యా దేశాల్లో మల్టీలెవల్ మార్కెటింగ్ చేస్తున్నారు. హంగ్‌కాంగ్‌లో ఏర్పాటు చేసినా అక్కడ ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించకుండా మిగతా దేశాల్లో కమీషన్లు, ప్రైజ్‌మనీ, విదేశీ టూర్ల పేరు చెబుతూ చైన్ సిస్టమ్ ద్వారా నిర్వహిస్తున్నారు. దీనికి అనుబంధంగా దిలీప్‌రాజ్, ఎండి ఇంతియాజ్ డైరెక్టర్లుగా విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను బెంగళూరు కేంద్రంగా ఏర్పాటు చేశారు. క్యూ నెట్ పేరుతో మల్టీలెవల్ మార్కెటింగ్ చేస్తు అమాయకులను మోసం చేస్తున్నారు. భారీగా లాభాలు వస్తాయని నిరుద్యోగులు, గృహిణులకు ఆశ చూపి చేర్పిస్తున్నారు. ముందు క్యూ నెట్ పేరు చెప్పకుండా చేర్చుకుంటున్నారు. లాభాలు రావడంలేదని అడిగితే మరో ఇద్దరిని సభ్యులుగా చేర్పిస్తే వస్తాయని చెబుతారు. చివరికి క్యూనెట్ పేరు చెప్పడంతో మోసపోయామని బాధితులు గ్రహిస్తున్నారు. అప్పటికే తమకు తెలిసిన వారిని చేర్పించడంతో లోలోపలే కుమిలిపోతున్నారు. కేసులు పెట్టాలంటే తమ బంధువులపైనే పెట్టాల్సి రావడంతో ఎవరూ ముందుకు రావడంలేదు. కొత్తగా చేరిన వారికి యూజర్ నేమ్, పాస్ వర్డ్ జనరేట్ చేస్తారు, కాని పాస్ వర్డ్ చేరిన వారికి ఇవ్వరు.

రూ.1000కోట్ల మోసం...

క్యూనెట్ సంస్థ సుమారు వెయ్యి కోట్ల రూపాయల వసూలు చేసి మోసం చేసింది. ముంబైలో ఎకంగా క్యూనెట్ బాధితుల సంఘం ఏర్పాటు చేసి న్యాయస్థానంలో పోరాడుతున్నారు. నిందితుల్లో ముగ్గురు బ్యాంక్ ఉద్యోగులు కూడా ఉన్నారు. వారి సహకారంతో డబ్బులు లేని వారికి బ్యాంకు నుంచి రుణం ఇప్పించి పెట్టుబడి పెట్టిస్తున్నారు.

ఇలా చేస్తున్నారు...

తీపి కబుర్లు చెప్పి నిరుద్యోగులను ఆకర్షిస్తున్నారు. ముఖేశ్ అంబానీ అంతటివాడివి అవుతావని చెప్పి మత్తులో ఉంచి పెట్టుబడి పెట్టిస్తున్నారు. వారే కాకుండా వారి చుట్టాలు, స్నేహితులకు ఫోన్లు చేయించి పెట్టుబడి పెట్టిస్తున్నారు. ఎవరికి ఏది కావాలంటే అది ఇస్తున్నారు. కాస్ట్ ఆప్టిమైజేషన్ బిజినెస్, హెల్త్ అండ్ వెల్‌నెస్ ప్రొడక్ట్స్, వాచెస్, జూవలరీ, పర్సనల్ వస్తువులు, సౌందర్య ఉత్పత్తులు, విహార యాత్రలు, ఎడ్యుకేషన్ ప్యాకేజీల పేరుతో అమాయకులకు వలవేస్తున్నారు. ఏదైనా ఎంపిక చేసుకుని చేరాలి. చేరిన నెలలో మోటివేషన్ క్లాసులు, బుక్స్ ఇవ్వడం, శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. కొత్తగా చేరిన వారికి కొన్ని వస్తువులు ఇస్తారు, దీంతో ప్రమోటర్‌కు కమీషన్ వస్తుంది. ఇలా ప్రతి ఒక్కరూ ఇద్దరిని చేర్పిస్తూ పోవాలి, సభ్యులు చేరిన కొద్ది పైస్థాయిలో ఉన్న వారికి కమీషన్ వస్తుంది. బెంగళూరులోని క్యూనెట్ కార్యాలయాన్ని, గోడౌన్‌ను సీజ్ చేశారు. క్వెస్ట్ నెట్ ఎంటర్‌ప్రైసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌పై 2008లో తమిళనాడు, పాండిచేరి, ముంబై, బెంగళూరు, వరంగల్ జిల్లా గీసుకొండలో కేసులు నమోదయ్యాయి. కేసును సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం డిసిపి ఎస్ఎం విజయ్ కుమార్, మాధాపూర్ డిసిపి వెంకటేశ్వరరావు, అడిషనల్ డిసిపి ప్రవీణ్, సిబ్బంది దర్యాప్తు చేశారు.

సీతారామ విజయం

(మొదటిపేజీ తరువాయి)

ఒక అధికారిక పర్యటన నిమిత్తం హైదరాబాద్ వచ్చినప్పుడు స్వయంగా ముఖ్యమంత్రి ప్రగతి భవన్‌కు పిలిపించుకుని చర్చించారు. రాష్ట్ర అభివృద్ధిలో సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యతను వివరించడంతో పాటు అవసరమైన పర్యావరణ, అటవీ అనుమతులు సత్వరం మంజూరు కావాల్సిన అవసరాన్ని వివరించారు. సిఎం కెసిఆర్ ఢిల్లీ పర్యటన సందర్భంగా ప్రధానితో భేటీ అయినప్పుడు కూడా ఇలాంటి అంశాలపై చర్చించారు. ఈ నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టుకు సోమవారం పర్యావరణ అనుమతులు మంజూరు కావడం విశేషం.

దాదాపు ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది

సాగునీటి అవసరాలతో పాటు పారిశ్రామిక, త్రాగునీటి అవసరాలను ఉద్దేశించి రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు ద్వారా సుమారు 2.72 లక్షల హెక్టార్ల (6.74 లక్షల ఎకరాలు)కు గోదావరి నది నుంచి సాగునీరు అందుతుందని, ఇందులో 1.33 లక్షల హెక్టార్లు (3.29 లక్షల ఎకరాలు) కొత్త ఆయకట్టేనని కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ డైరెక్టర్ (ఎక్స్‌పర్ట్ అప్రెయిజల్ కమిటీ సభ్య కార్యదర్శి కూడా) డాక్టర్ ఎస్.కెర్కెట్టా ఆ అనుమతుల్లో పేర్కొన్నారు. మరో 1.39 లక్షల హెక్టార్ల (3.45 లక్షల ఎకరాలు) మేర భూమి స్థిరీకరణలోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కారణంగా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలోని సుమారు 180 గ్రామాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని, ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో ఈ జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ కూడా పూర్తయిందని పేర్కొన్నారు. కొత్త ఆయకట్టును సృష్టించడమే కాకుండా పలు సంప్రదాయ చెరువులకు నీటిని సరఫరా చేయగలుగుతుందని, గ్రామాల్లో ఇప్పటికే సాగులో ఉన్న కొన్ని పథకాలకు సహాయపడుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు సుమారు 8,476 హెక్టార్ల (సుమారు 21 వేల ఎకరాల) భూమి షవసరమవుతుందని, ప్రాజెక్టు అంచనా వ్యయం సుమారు రూ. 13,384 కోట్లు ఉంటుందని పేర్కొన్న కెర్కెట్టా 1531 హెక్టార్ల (3781 ఎకరాల) అటవీ భూమిని వినియోగించుకోవాల్సి వస్తోందని, మిగిలిన భూమిని ప్రైవేటు వ్యక్తుల నుంచి, ప్రభుత్వ శాఖల నుంచి సమకూర్చుకోవాల్సి ఉంటుందని వివరించారు. ఈ ప్రాజెక్టు కారణంగా 157 గ్రామాల్లోని 9696 కుటుంబాలు ముంపు ప్రభావానికి గురవుతాయని పేర్కొన్నారు. మూడేళ్ళలో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తికానుందని తెలిపారు. గోదావరి నది నుంచి దుమ్ముగూడెం హెడ్ రెగ్యులరేటర్ ద్వారా నీటిని తీసుకునే ఈ ప్రాజెక్టు ద్వారా మూడు టిఎంసిల మేర నీటిని త్రాగునీటి అవసరాలకు కూడా వినియోగించుకోవచ్చునని, దాదాపు 58 లక్షల మందికి ఈ సౌకర్యం లభిస్తుందని వివరించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నాలుగు పంపు హౌజ్‌లు, తొమ్మిది కి.మీ. మేర పైప్‌లైన్ (పంపింగ్ మెయిన్ అవసరాల కోసం) కొన్ని చోట్ల టన్నెల్‌ల నిర్మాణం జరుగుతుందని, ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని సాంకేతిక, అటవీ, పర్యావరణ, ఆర్థిక అంశాలను రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన డాక్యుమెంట్ల ద్వారా అధ్యయనం చేశామని, అప్రెయిజల్ కమిటీ కూడా అనేక అంశాల్లో సందేహాలను లేవనెత్తిందని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన అధికారులు ఇచ్చిన వివరణలతో కమిటీ సంతృప్తి చెందిందని, ఆ కమిటీ సిఫారసుల మేరకే ఇప్పుడు పర్యావరణ అనుమతులను మంజూరు చేస్తున్నట్లు డాక్టర్ కెర్కెట్టా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఐదేళ్ళలో మరోసారి అధ్యయనం జరుగుతుందని, ప్రజలపై ఏ మేరకు ప్రభావం చూపించిందని, పర్యావరణ ప్రభావం ఏ తీరులో ఉంది, జల జీవరాశికి కలుగుతున్న ఇబ్బంది తదితరాలకు అనుగుణంగా సమీక్ష జరుపుతుందని పేర్కొన్నారు.

ఇఎన్‌టి+కు ఏర్పాట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఆటంకం ఏర్పడే అవకాశమూ ఉంది. ఈ రెండు కారణాలతోనే కొత్త రిక్రూట్‌మెంట్ జరపాలని భావిస్తున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం కంటి వెలుగు కోసం పీహెచ్‌సీల్లో పనిచేసే మొత్తం 1400 మంది శాశ్వత, కాంట్రాక్టు డాక్టర్లను భాగస్వామ్యం చేస్తున్నారు. వారికి తోడు మరో వెయ్యి మంది కంటి వైద్య నిపుణులు ఉంటున్నారు. అలాగే పీహెచ్‌సీల్లో పనిచేసే ఇతర సిబ్బంది సేవలను ఉపయోగించుకుంటున్నారు. వారికి తోడుగా 30 వేల మంది ఆశ కార్యకర్తలు, ఏడు వేల మంది ఏఎన్‌ఎంలు కంటి వెలుగు కార్యక్రమంలో సేవలు అందిస్తున్నారు. కాబట్టి అదే స్థాయిలో ఈఎన్‌టీ, దంత వైద్యులను అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. అయితే ప్రైవేటు ఆసుపత్రుల భాగస్వామ్యం ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఈఎన్‌టీ వైద్యులు 45 మంది, ప్రభుత్వ దంత వైద్యులు 194 మంది మాత్రమే ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు రంగంలో ఈఎన్‌టీ డాక్టర్లు 555 మంది, ప్రైవేటు దంత వైద్యులు 2,986 మంది ఉన్నారు. వచ్చే నెల నుంచే పరీక్షలకు ఏర్పాట్లు చేస్తుండటంతో తాత్కాలిక ప్రాతిపదిక మీద భర్తీ ప్రక్రియ చేపట్టే ఆలోచనలో అధికారులు ఉన్నారు.

రెండు విడతలుగా పైలెట్ ప్రాజెక్టు

ఈఎన్‌టీ, దంత పరీక్షలపై ఇప్పటికే వైద్య ఆరోగ్యశాఖ పలు జిల్లాలో పైలెట్ ప్రాజెక్టులు చేపటింది. పైలెట్ ప్రాజక్ట్‌ను రెండు రీతుల్లో చేపడుతున్నారు. ఇందులో ఏ టీం రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో రెండు రోజుల్లో మొదటి విడత పూర్తిచేసింది. బీ టీం రెండో విడతలో హైదరాబాద్, రంగారెడ్డి, భువనగిరి, జనగాం జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద శిబిరాలు నిర్వహిస్తోంది. ఆయ జిల్లాల నుంచి వచ్చిన అనుభవాలను ఆధారం చేసుకొని కార్యాచరణ ప్రణాళిక రచిస్తారు. క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులు, ఆటు పోట్లపై సాంకేతిక సలహా కమిటీ ఇచ్చే నివేదికను ఆదారం చేసుకొని ఈ కొత్త కార్యక్రమం ప్రారంభం కానుంది. కంటి వెలుగు కార్యక్రమం ఆరు నెలల్లోపే పూర్తి చేయగలిగితే, ఈఎన్‌టీ పరీక్షలు పూర్తి చేయడానికి ఏడాది పడుతుందని అధికారులు చెపుతున్నారు.

వైద్య ఆరోగ్యశాఖ సేకరించిన ఈఎన్‌టీ, దంత వైద్యులు, ఆసుపత్రుల వివరాలు

1) ఈఎన్‌టీ ఆసుపత్రులు	
డీఎంఈ పరిధిలోని ఆసుపత్రులు	7
వైద్య విధాన పరిషత్ కింద ఆసుపత్రులు	45
ఆరోగ్యశ్రీలో నమోదైన ఆసుపత్రులు	73
మొత్తం	125
ప్రభుత్వ ఈఎన్‌టీ వైద్యులు	45
ప్రైవేటు ఈఎన్‌టీ వైద్యులు	555
మొత్తం	600
2) డెంటల్ ఆసుపత్రులు	
డీఎంఈ పరిధిలోని ఆసుపత్రులు	8
వైద్య విధాన పరిషత్ కింద ఆసుపత్రులు	90
ఆరోగ్యశ్రీలో నమోదైన ఆసుపత్రులు	67
మొత్తం	165
ప్రభుత్వ దంత వైద్యులు	194
ప్రైవేటు దంత వైద్యులు	2,986
మొత్తం	3,180

'మద్దతు' విధానంలో మార్పు రావాల్సిందే

- వ్యాపార సరళిలో వ్యవసాయం
- రైతు ఆదాయం రెట్టింపుపై కేంద్రానికి అందిన కీలక సిఫార్సులు
- పంట రుణాలు సులువుగా అందాలన్న డిఎఫ్‌టి కమిటీ
- ఉత్పాదకత పెంపు.. వ్యవసాయ యాంత్రీకరణ దృష్టి



మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రస్తుత మద్దతు ధరల విధానాన్ని ఆధునీకరించాల్సిందేనని రైతు ఆదాయ రెట్టింపుపై ఏర్పాటైన కమిటీ (డిఎఫ్‌ఐ) స్పష్టం చేసింది. గత నాలుగున్నర దశాబ్దాలుగా దేశంలో కేవలం వరి, గోధుమలకు మద్దతు ధరపైనే దృష్టిసారించారు. దీనివల్ల ఇతర ఆహార ధాన్యాల సాగు, ఆదాయంలో అనేక తేడా లు కనిపించాయని పేర్కొంది. వాటి ధరలు తగ్గడంతో రైతులు ఆదాయం కోల్పోయారని ఇకనైనా మార్పు తీసుకురావాలని తెలిపింది. ఐదేళ్లలో రైతు ఆదాయం రెట్టింపుపై ఏర్పాటైన కమిటీ తాజాగా తన పూర్తిస్థాయి సమగ్ర నివేదికను కేంద్రానికి సమర్పించింది. దీంట్లో పలు కీలక సిఫార్సులు చేసింది. వ్యవసాయ యాంత్రీకరణతో ఉత్పాదకతలో ఉన్న భారీ తేడాను అధిగమించవచ్చునంది. అధిక ఉత్పత్తినిచ్చే వంగడాలను తయారు చేయడం వల్ల కూడా ఉత్పాదకత పెరుగుతుందని, దీనివల్ల రైతులకు అధికాదాయం సమకూరుతుందని పేర్కొంది. దీనివల్ల ఆహారభద్రతకు భంగం కలగకుండా చూసుకోవచ్చునని తెలిపింది. వ్యవసాయ రంగాన్ని వ్యాపార ధృక్పథంతో చూడాలని, అప్పుడే రైతుకు మెరుగైన ఆదాయం సమకూరుతుందని సిఫార్సు చేసింది. రైతు ఆదాయం రెట్టింపు కావాలంటే కేవలం వివిధ రకాల సంక్షేమ కార్యక్రమాలతోనే సరిపోదని, వ్యవసాయాన్ని వ్యాపారం వైపు బదలాయించాల్సిన అవసరముందని విశ్లేషించింది. వినియోగదారుడి అవసరాలే కేంద్రంగా వ్యవసాయం చేస్తే పెద్ద ఎత్తున లాభాలు గడించవచ్చని పేర్కొంది. అలాగే వ్యవసాయరంగాన్ని ఆధునికత వైపు పరుగులు పెట్టించాలని పేర్కొంది. దేశంలో 85 శాతం మంది రైతులు సన్నచిన్నకారు రైతులేనని, వారి చేతుల్లో అత్యంత తక్కువ విస్తీర్ణం కలిగిన కమతాలు ఉన్నాయని పేర్కొంది. అటువంటి వారికి సాగు ఖర్చు తగ్గించేలా వ్యవసాయ యాంత్రీకరణ కల్పించాలని వివరించింది. పంట రుణాలు సకాలంలో ఇస్తే రైతుల పెట్టుబడికి ఇబ్బందులుండవని తెలిపింది.

ప్రధాన సిఫార్సులు ఇవే..

- సూక్ష్మ సేద్యంతో ఉత్పాదకతను పెంచుకోవచ్చు. అలాగే సాగునీటి వసతులు కల్పిస్తే ఉత్పాదకత పెరుగుతుంది.
- వ్యవసాయ పరిశోధనలపై పెట్టుబడులు పెట్టడం వల్ల మంచి ఫలితాలు వస్తాయి. అందువల్ల పరిశోధన, విస్తరణ రంగాలపై దృష్టిసారించాలి.
- ప్రస్తుత ధరల విధానాన్ని ఆధునీకరించాలి. గత నాలుగున్నర దశాబ్దాలుగా దేశంలో కేవలం వరి, గోధుమలకు మద్దతు ధరపైనే దృష్టిసారించారు. దీనివల్ల ఇతర ఆహార ధాన్యాల సాగు, ఆదాయంలో అనేక తేడాలు కనిపించాయి. వాటి ధరలు తగ్గడంతో రైతులు ఆదాయం కోల్పోయారు.
- మార్కెట్లో ధరల తీరుపై రైతుకు ఎప్పటికప్పుడు అందించేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని కల్పించాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందుబాటులో ఉంచితే వారి ఆదాయం కూడా పెరుగుతుంది.
- అత్యంత కీలకమైన రుణ సదుపాయం రైతుకు అందాలి. అప్పుడే పంటల సాగు, విత్తనాలు, ఎరువుల వంటి వాటికి ఇబ్బంది ఉండదు. ఈ విషయంపై కేంద్రం ప్రత్యేక శ్రద్ధ చూపుతుంది.
- గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి. రోడ్లు, విద్యుత్ సరఫరా, రవాణా సదుపాయలు కల్పించాలి. పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించాలంటే ఇవన్నీ అవసరం. ఫలితంగా వారు అధికాదాయం పొందుతారు. అలాగే మార్కెట్లోనూ మౌలిక సదుపాయాలు కల్పించాలి. దీనివల్ల పంటల నాణ్యత పెరుగుతుంది. ప్రధానంగా నిల్వ, ట్రేడ్ రంగాల్లో అనేక మార్పులు తీసుకురావాలి.

వ్యవసాయేతర కార్మికుడి ఆదాయమే ఎక్కువ

2011–12 నాటి లెక్కల ప్రకారం చూస్తే సాగు చేసే రైతు ఆదాయం ఏడాదికి రూ. 78,264 ఉంటే, వ్యవసాయ కూలీ ఆదాయం రూ. 32,311 ఉండగా, వ్యవసాయేతర కార్మికుడి ఆదాయం రూ. 2.46 లక్షలుగా ఉండటం గమనార్హం. మొదటినుంచీ రైతు పరిస్థితి ఇలాగే ఉంది. దీంతో రైతులు అప్పులపాలవుతున్నాడు. ఆత్మహత్యలే శరణ్యమంటున్నాడు.



కర్నూలు జిల్లాలో ఎయిర్ పోర్టు ప్రారంభం

మనతెలంగాణ/అలంపూరు : అలంపూరు నియోజక వర్గంలోని ప్రజలకు విమాన ప్రయాణం చేయటానికి వీలుగా సమీంలో ఎయిర్‌పోర్టు ప్రారంభం కావడంతో నియోజ వర్గ ప్రజలు ఆనందం వెలిబుచ్చుతున్నారు. అలంపూరుకు సమీపంలోని కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు సమీపంలో ఎయిర్ పోర్టును ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడు మంగళవారం ప్రారంభించారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం కేఈ కృష్ణ మూర్తి, ఎమ్మెల్యేలు ఎస్. వీ. సుబ్బారెడ్డి, జనార్ధనరెడ్డి, జిల్లాలోని అన్ని నియోజక వర్గాల ఎమ్మెల్యేలు, కర్నూలు ప్రముఖ ప్రారిశ్రామిక వెత్త టీ. జీ భరత్‌లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. గ్రీన్ ఫీల్డు కంపెనీ ఎయిర్ పోర్టు నిర్మించారు. పోర్టు ప్రారంభం అనంతరం సోలార్ పార్కును ప్రారంభించి జ్యాతికి అంకితం చేశారు. ఈ పార్కు దక్షణ ఆసియాలోనే మూడవ అతిపెద్ద సోలార్ పార్కు. ఈ ఎయిర్ పోర్ట్ అలంపూరుకు సుమారు 40 కిలోమీటర్ల దూరంలో వుంది. గతంలో హైదరాబాదులోని శంషాబాదుకు నుంచి విమానాల్లో ప్రయాణించ వలసి వచ్చేది.

65కు చేరిన కొండగట్టు ప్రమాద మృతులు



మనతెలంగాణ/కొడిమ్యాల : సెప్టెంబర్ 11న జరిగిన కొండగట్టు బస్సు ప్రమాద ఘటనలో మృతుల సంఖ్య 65కు చేరింది బస్సు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి 117 రోజులుగా నరకయాతన అనుభవిస్తున్న సురకంటి వనితి మంగళవారం తెల్లవారు జామున మృతి చెందింది. దీంతో వనిత తల్లి గారి ఊరు మోతె, అత్తగారు ఊరైన డబ్బుతిమ్మయిపల్లెలో విషాద చాయలు నెలకొన్నాయి. బస్సు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై కొంత కాలం హైదరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందింది ఆమె కోమాలో ఉండడంతో వైద్యులు చికిత్స చేయలేమంటూ చేతులు ఎత్తివేయడంతో బంధువులు తల్లి గారి ఊరైన మోతెకు తీసుకొచ్చారు. అప్పటి నుండి నరకయాతన అనుభవిస్తున్న వనిత మంగళవారం మృతి చెందింది. వనతి మృతి వార్త తెలుసుకున్న జగిత్యాల ఎంఎల్‌ఏ డాక్టర్ సంజయ్‌కుమార్, మాజీ ఎంఎల్‌ఏ జీవన్‌రెడ్డి మోతెకు చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. వనిత మృతదేహాన్ని డబ్బుతిమ్మయ్యపల్లికి తీసుకురాగా చొప్పదండి ఎంఎల్‌ఏ రవిశంకర్ చేరుకొని వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

యువకుడి దారుణ హత్య

నర్సింగాపూర్‌లో కలకలం



మనతెలంగాణ / చందుర్తి : యువకుడిని దారుణంగా హత్య చేసి వ్యవసాయ బావిలో పడేసిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మెరుపుల హరీష్(23) అనే యువకున్ని గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం గ్రామ శివారులోని పోచమ్మ గుట్ట ప్రాంతంలో హత్య చేసి వ్యవసాయ బావిలో పడేసారు. మధ్యాహ్న సమయంలో ఇంటి నుండి తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్లిన హరీష్, సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో తల్లి లచ్చవ్వ హరీష్‌కు ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ అని రావడంతో అనుమానం వచ్చి పొలం వద్దకు వచ్చి చూడగా రక్తపు మరకలు కనిపించడంతో గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించారు. రక్తపు మరకల గుర్తుల ఆధారాలతో హత్య చేసి బావిలో పడేసినట్లు గుర్తించి చందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న డిఎస్పీ వెంకటరమణ, సీఐ విజయ్‌కుమార్, స్థానిక ఎస్‌ఐ నీలం రవి సంఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. ఈ హత్య భూతగాదాల వల్లనే జరిగి ఉండవచ్చని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులకు పోలీసు భరోసా

మన తెలంగాణ/హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని ప్రైవేట్ హాస్పిటల్స్‌లపై దాడులు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని సెంట్రల్ జోన్ డిసిపి విశ్వప్రసాద్ తెలిపారు. నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రుల యజమాన్యాలు, వైద్యులు, సిబ్బందితో సెంట్రల్ జోన్ డిసిపి, నారాయణ గూడ సిఐ రమేష్, బేగంపేట్ సిఐ సుబ్బయ్యలు మంగళవారం హైదర్‌గూడాలోని ఇఎఫ్ గార్డెన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ ఇటీవల గ్లోబల్ హాస్పిటల్‌పై దాడి జరిగిన నేపథ్యంలో నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలకు, వైద్యులకు, సెక్యూరిటీ సిబ్బంది భరోసా కల్పించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులలో దాడులు జరుగకుండా పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ఆసుపత్రి వర్గాలు సకాలంలో సమాచారం అందిస్తే వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుంటారన్నారు. డయల్ 100 ద్వారా సంప్రదించినా హుటాహుటిన పోలీసులు ఘటనాస్థలికి వచ్చి శాంతి భద్రతలు పరిరక్షిస్తారని డిసిపి వివరించారు.

తహసీల్దార్ల పాత్ర కీలకం

మనతెలంగాణ/హైదరాబాద్ : రెవెన్యూ విభాగంలో తహసీల్దార్ల పాత్ర కీలకమని స్పెషల్ సిఎస్ (రెవెన్యూ) సిసిఎల్‌ఏ రాజేశ్వర్ తివారీ పేర్కొన్నారు. మంగళవారం రెవెన్యూ ఉద్యోగుల డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలోచ సంక్షేమ పథకాల అమలులోనూ, ప్రజలకు సేవలను అందించడంలోనూ తహసీల్దార్లు ప్రధాన భూమిక పోషిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పని చేసే ఉద్యోగులకు, సిబ్బందికీ, ఉన్నత స్థాయి అధికారులకు వారధి వలే తహసీల్దార్లు ఉండాలని ఆయన సూచించారు. మరింత బాధ్యతతో పనిచేసి డిపార్ట్‌మెంట్‌కు మంచిపేరు తీసుకురావాలని వారితో ఆయన పేర్కొన్నారు. ఈ డైరీ ఆవిష్కరణలో తహసీల్దార్ల అసోసియేషన్ (టిజిటిఏ) వ్యవస్థాపక అధ్యక్షుడు లచ్చిరెడ్డి, అధ్యక్షుడు గౌతమ్‌కుమార్‌లతో పాటు వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.




ఇస్టా సమావేశాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఉన్నతాధికారులతో సిఎస్ జోషి సమీక్ష



మన తెలంగాణ/హైదరాబాద్ : అంతర్జాతీయ విత్తన పరీక్ష సంఘం (ఇస్టా) సమావేశాలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కె.జోషి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని హెచ్‌సిసిలో ఈ ఏడాది జూన్ 26వ తేదీ నుంచి జూలై 3వ తేదీ వరకు జరగనున్న 32వ ఇస్టా కాంగ్రెస్ సమావేశాలపై సచివాలయంలో మంగళవారం సిఎస్ జోషి సమీక్ష నిర్వహించారు. దాదాపు నాలుగు వందల మంది విదేశీ ప్రతినిధులు ఇస్టా సదస్సుల్లో పాల్గొంటారన్నారు. వీరికి అవసరమైన వసతి, భద్రత, రవాణా సదుపాయాలను కల్పించాలన్నారు. విత్తన ప్రదర్శనలో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి 200 విత్తన కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. కొత్త ఉత్పత్తులు, సీడ్ ప్రాసెసింగ్, ప్యాకింగ్ ఎక్విప్‌మెంట్స్, సీడ్ ట్రీట్‌మెంట్, నూతన టెక్నాలజీపై సమావేశాల్లో చర్చిస్తారన్నారు. విత్తన ఉత్పత్తి, నాణ్యతపై ఈ సింపోజియం ఉంటుందన్నారు. సింపోజియంలో అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి 50 మంది చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ నుంచి పాల్గొంటారన్నారు. ఫుడ్, అగ్రికల్చర్ అర్గనైజేషన్ (ఎఫ్‌ఎఒ) సహకారంతో ఈ సమావేశాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇందులో మొదటి రోజు 26వ తేదీన ప్రారంభోత్సవ కార్యక్రమం, ఆ తర్వాత 26 నుంచి 28వ తేదీ వరకు సీడ్ సింపోజియం, ఇంటర్నేషనల్ సీడ్ ఎగ్జిబిషన్, జూన్ 29వ తేదీ నుంచి జూలై 3 వరకు ఐఎస్‌టిఎ వార్షిక సమావేశాలు జరుగుతాయని వివరించారు. ఈ సందర్భంగా భారతీయ, తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఇస్టా కాంగ్రెస్‌కు తగిన ప్రచారాన్ని నిర్వహించాలన్నారు. విదేశీ ప్రతినిధులు తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాలను సందర్శించే ప్యాకేజీ వివరాలను ముందుగానే వివరించాలన్నారు. ఈ సమావేశంలో ఇస్టా జనరల్ డాక్టర్ అండ్రిస్ వైసి, ఇష్ట స్విజ్జర్లాండ్ ఒల్గా స్టేఫీ, ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ పీటర్ కార్‌బెర్రీ, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారధి, అదనపు డిజి జితేందర్, వ్యవసాయ శాఖ కమిషనర్ రాహుల్ బొజ్జా, విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ కేశవులు పాల్గొన్నారు.



వంద కోట్ల రామ నామాలు

రామరాజు కృషిని అభినందించిన హోంమంత్రి

మన తెలంగాణ/గజ్వేల్ రూరల్ : రామకోటి రామరాజు కృషి, పట్టుదల అమోఘమైనదని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. వంద కోట్ల లిఖిత రామనామాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం శ్రీ రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరామకోటి రామరాజు హోంమంత్రిని హైద్రాబాద్‌లోని తన నివాసంలో కలిసి శ్రీరామకోటి పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పుస్తకం గురించి వివరించిన ఆయన రాష్ట్రం ఏర్పాటుకు ముందు తెలంగాణ ఏర్పడడం కోసం గజ్వేల్‌లోని స్థానిక రామాలయంలో 25సార్లు సీతారాముల కళ్యాణం, 35సార్లు శ్రీరామకోటి మహా యజ్ఞాలు నిర్వహించినట్లు అలాగే గత 15 సంవత్సరాల నుంచి వేలాది మంది భక్తులచే వంద కోట్ల రామనామాలు లిఖించడం పూర్తి చేయించినట్లు వివరించారు. ఆనంతరం హోంమంత్రి మాట్లాడుతూ లోక కళ్యాణార్థం కళ్యాణాలు, శ్రీ రామకోటి మహాయజ్ఞం వంటి అద్భుంత కార్యక్రమాలు నిర్వహిస్తున్న రామరాజు ధన్యుడు అన్నారు. ఆధ్యాత్మికం పట్ల భక్తిభావంతో ప్రతి వ్యక్తికి ఆధ్యాత్మి మార్గాన్ని చూపిస్తున్న రామ రాజును మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు.

నగర ఖ్యాతి ఇనుమడించేలా పతంగుల పండుగ

మన తెలంగాణ / హైదరాబాద్ : అంతర్జాతీయంగా హైదరాబాద్ నగర ఖ్యాతి ఇనుమడించేలా పతంగుల పండుగను నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కె. జోషి అధికారులను ఆదేశించారు. నగరంలో జరుగుతున్న నాలుగవ అంతర్జాతీయ పతంగుల (స్వీట్ ఫెస్టివల్) పండుగ 2019ను ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు పేరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ పతంగుల పండుగ, మిఠాయి వేడుకల నిర్వహణపై సచివాలయంలో సిఎస్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ హైదరాబాద్ నగర బ్రాండ్ ఇమేజ్ పెరిగే విధంగా పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి రోజు మూడు లక్షల మంది సందర్శకులు ఫెస్టివల్ నిర్వహణను చూసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. బ్యారికేడింగ్, పరిశుభ్రత, ట్రాఫిక్, అగ్నిమాపక వ్యవస్థ, బందోబస్తు, మంచి నీటి సరఫరా, వైద్య సేవలను అందుబాటు లో ఉంచాలన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా లేఅవుట్‌ను రూపొందించుకొని పనులు చేపట్టాలన్నారు. జిహెచ్‌ఎంసి ద్వారా స్వచ్ఛ సర్వేక్షణపై ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా టూరిజంశాఖ కార్యదర్శి బి.వెంకటేశం మాట్లాడుతూ వచ్చే ఏడాది కైట్ ఫెస్టివల్ నాటికి హైదరాబాద్‌లో అతిపెద్ద పండుగలా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. 20 దేశాల నుంచి 50 మంది పతంగులను ఎగురవేసే పాల్గొంటారని తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళలు వెయ్యి రకాల మిఠాయిలను ప్రదర్శిస్తారని తెలిపారు. వీరంతా సాంప్రదాయ దుస్తులతో పాల్గొంటారన్నారు. ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాలను దాదాపు పది లక్షల మంది సందర్శిస్తారని తెలిపారు. సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్, పర్యాటకశాఖ కమిషనర్ దినకర్‌బాబు, ఫైర్ సర్వీసెస్ డిజి గోపి కృష్ణ, సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పిసిసి సమూల ప్రక్షాళన

- త్వరలోనే కొత్త కమిటీ రూపురేఖలు
- రాష్ట్రంలో కాంగ్రెస్‌కు జవసత్వాలు తీసుకువచ్చే యత్నం

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మళ్ళీ పూర్తి స్థాయిలో జవసత్వాలు తీసుకొచ్చే ప్రక్రియ మొదలైంది. ఇందులో భాగంగా ప్రస్తుతమున్న పిసిసిని పూర్తిగా ప్రక్షాళన చేయాలని ఏఐసిసి నిర్ణయించింది. ఇందులో భాగంగా త్వరలోనే పిసిసికి కొత్త రూపురేఖలను తీసుకరానుంది. రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఘోరపరాజయం పాలు కావడం, నేతల్లో అంతర్గత విభేదాలు తారస్థాయిలో కొనసాగుతుండడంతో కాంగ్రెస్ అధిష్టానం ఈ దిశగా అడుగులు వేస్తోంది. ముఖ్యంగా త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీని క్షేత్ర స్థాయి నుంచి మొదలుకుని రాష్ట్ర స్థాయి వరకు అన్ని కమిటీలను బలోపేతం చేయాలని తలపెట్టింది. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే వారికి పలు కమిటీల్లో కీలక బాధ్యతలను అప్పగించనున్నారు. అలాగే పదవులు తీసుకుని గాంధీభవన్ ముఖం చూడని నేతలు, ప్రజల్లో ఆదరణ లేని నాయకుల పోస్టులను ఊడగొట్టనుంది. అలాగే పార్టీ క్రమశిక్షణను ఉల్లఘించే వారిపై మరింత కఠినంగా వ్యవహరించనున్నట్లు పార్టీ నేతలకు ఇప్పటికే ఏఐసిసి అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తగు సంకేతాలను కూడా పంపారు. ఈ నేపథ్యంలో రానున్న పార్లమెంట్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ నూతన ఉత్సాహంతో సిద్ధమవుతోంది. కాగా పార్లమెంట్ ఎన్నికల కోసం ప్రత్యేకంగా ఐదు కమిటీలను కొత్తగా ఏర్పాటు చేస్తోంది. అలాగే మరో రోజుల వ్యవధిలో రాష్ట్రంలో కొత్తగా పిసిసి కమిటీని ఏర్పాటు చేయనున్నారు. పిసిసి స్థాయిలో ఐదు కమిటీలను ఈ నెల 15వ తేదీలోగా ఏర్పాట చేయాలని ఏఐసిసి నుంచి ఇప్పటికే రాష్ట్ర పిసిసికి స్పష్టమైన ఆదేశాలు అందాయి. ఇందులో కోఆర్డినేషన్ కమిటి, ప్రదేశ్ ఎన్నికల కమిటి, ప్రచార కమిటి, పబ్లిసిటి కమిటి, మీడియా కోఆర్డినేషన్ కమిటీలను వేయాల్సి ఉంటుంది. అలాగే సంస్థాగతంగా పిసిసి, డిసిసి, సిటి కమిటీలు, బ్లాక్, వార్డు కమిటీలను కూడా ఈ నెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని పార్టీ జాతీయ అధిష్టానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. బూత్ కమిటీలను ఈ నెల 30లోగా, ఫిబ్రవరి నెలఖారులోగా కొత్తగా నియామకమైన బూత్, బ్లాక్, అసెంబ్లీ స్థాయి కమిటీలకు శిక్షణ పూర్తి చేయాలని ఏఐసిసి ఆదేశించింది. కొత్తగా బూత్‌లెవల్ నుంచి పిసిసి లెవల్ కమిటీల నియామకానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని పూర్తి వివరాలను ఫార్మెట్ రూపంలో వచ్చే నెల 5వ తేదీలోగా ఏఐసిసి ఆర్గనైజింగ్ కార్యదర్శికి సమర్పించాలని ఆదేశించింది. అలాగే ఎన్నికల సంఘం సవరించిన ఓటర్ల జాబితా విషయంలో పార్టీ లోతుగా పరిశీలించాలని, మార్పులు, చేర్పులు చేసేందుకు బూత్‌లెవల్ ఏజెంట్లను నియమించాలని సూచించారు.

ఈ నెల 25వ తేదీలోగా జాబితాను ఎన్నికల సంఘానికి సమర్పించాలని ఆదేశించింది. పార్లమెంట్ ఎన్నికలు తరుముకొస్తున్న నేపథ్యంలో పిసిసి కమిటీలలో ఉన్న కార్యనిర్వాహక అధ్యక్షులకు, ఉపాధ్యక్షులకు, ప్రధాన కార్యదర్శులకు, కార్యదర్శులకు ప్రత్యేకంగా పని విభజన చేసి బాధ్యతలు అప్పగించాలని సూచించింది. ప్రతి పిసిసి కమిటీలో ఐదుగురితో ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ ఎన్నికలకు సంబంధించి డిసిసిలతో, ఏఐసిసిలతో పనుల బాధ్యతలను నిర్వహించేలా చూడాలని కూడా ఏఐసిసి ఆదేశించింది. ఇక పార్లమెంట్ అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ప్రదేశ్ ఎన్నికల కమిటీ సమావేశాలు, డిసిసిల నుంచి సిఫారసులు తదితర కార్యక్రమాలను చేపట్టాలని సూచించింది. ఈ నెల 15న పిసిసి స్థాయిలో ముఖ్యనాయకులతో సమావేశాలను ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణను అమలు చేయాలని ఆదేశించింది. శక్తియాప్‌కు సంబంధించి అత్యంత ప్రాధాన్యత కోఆర్డినేటర్ల నియామకాన్ని ఈ నెల 30వ తేదీలోగా పూర్తి చేసి ఎన్నికలకు సిద్ధం కావాలని ఏఐసిసి సూచించింది. సంస్థాగత కమిటీలకు సంబంధించిన పనులను పూర్తి చేయడం, లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ప్రణాళికను సిద్ధం చేయడం, పిసిసి అధ్యక్షుడికి సంబంధించిన పనులలో కమిటీలు సంపూర్ణ మద్దతు ఇవ్వడం, ప్రచార ప్రణాళికలను, మ్యానిఫెస్టో అంశాలకు సంబంధించిన సలహాలు, సూచనలు కూడా అనుబంధ విభాగాలు, కమిటీలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇందులో ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యానికి తావులేకుండా పకడ్బందిగా చేపట్టాలని ఆదేశించింది.

10 శాతం రిజర్వేషన్లను సమర్థించిన కాంగ్రెస్

ఈబిసిలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ స్వాగతించింది. ఇందుకు సంపూర్ణ మద్దతు తెలిపింది. రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా ఈబిసిలకు రిజర్వేషన్లు కల్పించడానికి కాంగ్రెస్ పూర్తిగా సహకరిస్తుందని పేర్కొన్నది. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పిసిసి ఉపాధ్యక్షుడు మల్లురవి మాట్లాడుతూ, ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలను కేంద్రం తీసుకుంటే.. అందుకు తప్పకుండా కాంగ్రెస్ స్వాగతిస్తుందన్నారు. ఎన్నికలప్పుడే పార్టీ పరంగా రాజకీయాలు చేస్తామే తప్ప ప్రజలకు ఉపయోగపడే ఏ అంశాన్ని గుడ్డిగా తాము వ్యతిరేకించమన్నారు. మొన్నటి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తుందని అంతా భావించార్నారు. కానీ ఫలితాలు అందుకు విరుద్దంగా వచ్చాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బు, మద్యంను విపరీతంగా ఓటర్లకు టిఆర్‌ఎస్‌కు పంపిణీ చేసిందన్నారు. ఎన్నికల కమిషన్ కూడా దీనిని నివారించలేకపోయిందని విమర్శించారు. పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్ కెసిఆర్‌తో కుమ్మక్కుఅయ్యాడని సర్వే సత్యనారాయణ ఆరోపణలు చేయడం తగదన్నారు. ఇలాంటి వ్యాఖ్యలను కాంగ్రెస్ ఖండిస్తుందన్నారు. పంచాయతీ ఎన్నికల సమయంలో ఇలాంటి చర్యలు సరైనది కాదని వ్యాఖ్యానించారు. సీనియర్ నాయకుడిగా సర్వేకు పార్టీలో సముచిత స్థానం ఎప్పుడు ఉండేదన్నారు. ఉత్తమ్, కుంతియాలు పార్టీకి రాజీనామా చేసిన డిమాండ్ చేసిన సర్వేనే దానికి సమాధానం చెప్పాలని మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

రిజర్వేషన్లకు అనుకూలమే.. అయితే ప్రధానిలో నిజాయితీ కనిపించడం లేదు

అగ్రవర్ణాల పేదలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తునామని ఏపి పిసిసి చీఫ్ రఘువీరారెడ్డి అన్నారు. ఇందిరాభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. అయితే నాలుగేళ్ళు రిజర్వేషన్ల గురించి పట్టించుకోని ప్రధాని నరేంద్రమోడీ, రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే హడావిడిగా నిర్ణయం తీసుకున్నట్లుగా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. మోడీ నిజాయితితో తీసుకున్న నిర్ణయం తీసుకున్నట్లుగా కనిపించడం లేదన్నారు.

రూ.67కోట్లతో అలిపిరిలో అతిథి భవనం



మనతెలంగాణ/తిరుమల ప్రతినిధి: టిటిడి ధర్మకర్తల మండలి సమావేశం మంగళవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగింది. ధర్మకర్తల మండలి అధ్యక్షులు పుట్టా సుధాకర్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాలు మీడియా సమావేశంలో టిటిడి కార్యనిర్వహణాధికారి అనిల్ కుమార్ సింఘాల్ కలిసి వెల్లడించారు. తిరుపతిలోని అలిపిరి వద్ద భక్తులకు వసతి కల్పించేందుకు మొదటి బ్లాకులో 384 గదులను రూ.67.29 కోట్లతో నిర్మించేందుకు టెండర్లు ఖరారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు మరింత పటిష్టంగా నిఘా, భద్రతను కల్పించేందుకు 2వ దశలో 1,050 సిసి కెమెరాలు ఏర్పాటుకు రూ.15.79 కోట్ల నిధులు మంజూరు. తిరుమలలో భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనం కాంప్లెక్స్ నుండి ఆళ్వార్ ట్యాంక్ రెస్ట్‌హౌస్ గేటు వరకు రూ.17.21 కోట్లతో క్యూలైన్ నిర్మించేందుకు టెండర్లు ఖరారు. తిరుమలలో స్మార్ట్ డేటా సెంటర్ ఏర్పాటుకు రూ.2.63 కోట్లు మంజూరు. తిరుపతిలో నూతనంగా ఏర్పాటుచేస్తున్న డేటా సెంటర్‌కు సంబంధించిన హార్డ్‌వేర్ ఏర్పాటుకు రూ.1.97 కోట్లు మంజూరు. అమరావతిలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయాన్ని నిర్మించే ప్రక్రియలో భాగంగా మహారాజగోపురం, ఆర్జితసేవామండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథమండపం, శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయం, పుష్కరిణి నిర్మించేందుకు రూ.27.29 కోట్లతో టెండర్లు ఖరారుచేశారు. స్వర్గీయ వేదాంతం దేశికాచార్యులు స్థానంలో టిటిడి అర్చకులు ఎ.అనంతశయన దీక్షితులను రెండేళ్ల కాలపరిమితికి గాను ఆగమసలహాదారుగా నియమించేందుకు ఆమోదం. తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి సముదాయంలో ఒకరోజుకు నాన్ ఎసి గది రూ.600, ఎసి గది రూ.1200, ఎసి డార్మిటరీ ఒక వ్యక్తికి రూ.100 అద్దె, నాన్ ఎసి డార్మిటరీ ఉచితంగా కేటాయించేందుకు ఆమోదం. పలమనేరులోని గోశాలలో దేశవాళి గోవుల సంరక్షణ కోసం, ''గోపర్యాటకాన్ని'' అభివృద్ధి చేసేందుకు, పాడిరైతులకు శిక్షణ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు, ఇతర అభివృద్ధి పనుల కోసం రూ.40.77 కోట్లు మంజూరుకు ఆమోదం. అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయం వద్ద కల్యాణమండపాన్ని రూ.2.27 కోట్లతో నిర్మించేందుకు టెండర్లు ఖరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో శ్రీ వేంకటేశ్వర దివ్యక్షేత్రాల నిర్మాణానికి టెండర్లు ఆమోదం. విజయనగరం జిల్లా పార్వతీపురంలో రూ.2.90 కోట్లు. శ్రీకాకుళం జిల్లా సీతంపేటలో రూ.2.86 కోట్లు. తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో రూ.2.99 కోట్లు.

31న అమరావతిలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి భూకర్షణ

టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్ మీడియాతో మాట్లాడుతూ ఈనెల 31న అమరావతిలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి ఆగమోక్తంగా భూకర్షణ చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విచ్చేస్తారని వెల్లడించారు. టిటిడి తిరుమలలో నిర్వహించే అఖండ హరినామ సంకీర్తనకు వచ్చే భజన బృందాలకు ఆర్డినరీ బస్ చార్జీలు చెల్లించనున్నట్టు తెలిపారు. తిరుమలలో దుకాణాలు, హాకర్ల లైసెన్సుల సమస్యలపై టిటిడి ఛైర్మన్ అధ్యక్షతన సబ్ కమిటీ ఏర్పాటుచేశామని, ఇందులో బోర్డు సభ్యులు చల్లా రామచంద్రారెడ్డి, రుద్రరాజు పద్మరాజు, సివిఎస్‌ఒ గోపీనాథ్‌జెట్టి, ఎస్టేట్ ఆఫీసర్ విజయసారథి సభ్యులుగా ఉంటారని వివరించారు. ఈ కమిటీ రానున్న 10 రోజుల్లో నివేదిక సమర్పిస్తుందని, కమిటీ సిఫార్సులను అమలుచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్ సింగ్, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ డా.ఎం.పద్మ, ధర్మకర్తల మండలి సభ్యులు సుధా నారాయణమూర్తి, సప్న, బోండా ఉమామహేశ్వరరావు, రుద్రరాజు పద్మరాజు, చల్లా రామచంద్రారెడ్డి, డొక్కా జగన్నాథం, మేడా రామకృష్ణారెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు ఎన్.శ్రీకృష్ణ, అశోక్‌రెడ్డి, తిరుమల జెఇఒ కె.ఎస్.శ్రీనివాసరాజు, తిరుపతి జెఇఒ పోల భాస్కర్, సివిఎస్‌ఒ గోపీనాథ్‌జెట్టి పాల్గొన్నారు.

రైలు ఢీకొని తల్లీతనయుడి మృతి



మనతెలంగాణ/ నవీపేట: మానసిక వికలాంగుడైన కొడుకును కాపాడుకునే యత్నంలో రైలు ఢీకొని తల్లి కూడా ప్రాణాలు కోల్పోయిన సంఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట మండలంలో చోటు చేసుకుంది. రైల్వే ఎస్‌ఐ ప్రణయ్‌కుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం ఫకీరాబాద్ గ్రామానికి చెందిన వడ్డె గంగామణి (50) మానసిక వికలాంగుడైన కుమారుడు గంగాప్రసాద్ (10)తో కలిసి వెళ్తుండగా ఫకీరాబాద్ రైల్వేగేటు పడడంతో కాసేపు ఆగారు. కానీ ఆకస్మాత్తుగా గంగాప్రసాద్ రైల్వే గేటు కింది నుండి దూరి వెళ్లిపోయాడు. ఇంతలో ముంబై నుండి సికింద్రాబాద్ వెళ్తున్న దేవగిరి ఎక్స్‌ప్రెస్ దూసుకొచ్చింది. దీన్ని గమనించిన తల్లి గంగామణి కుమారుడిని కాపాడుకోవడానికి పరుగుతీసింది. ఇంతలో రైలు వచ్చి ఇద్దరినీ ఢీకొనగా తల్లీ కుమారులు చనిపోయినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. గంగామణి, గంగాప్రసాద్‌ల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ ప్రణయ్‌కుమార్ తెలిపారు.

తిరుమలలో అభివృద్ధి పనులపై జెఇఒ సమీక్ష



మనతెలంగాణ/తిరుమల ప్రతినిధి: తిరుమలలో భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు వివిధ విభాగాల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై టిటిడి తిరుమల జెఇఒ కె.ఎస్.శ్రీనివాసరాజు మంగళవారం అన్నమయ్య భవనంలో సమీక్ష నిర్వహించారు. ఇందులో సివిల్, ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్ పనులపై సమీక్ష చేపట్టారు. ఎస్వి మ్యూజియంలో దశలవారీగా హాళ్ల అభివృద్ధి, కౌనుగోళ్లు, పరకామణి తదితర విభాగాలపై చర్చించారు. అదేవిధంగా, ఫిబ్రవరి 12న జరుగనున్న రథసప్తమి పర్వదినం ఏర్పాట్లపై ఒక నెల ముందుగా సమీక్ష నిర్వహించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రథసప్తమినాడు మాడ వీధుల్లోని గ్యాలరీల్లో వేచి ఉండే భక్తులకు ఉదయం నుండి సాయంత్రం వరకు సేవలు అందించేందుకు గ్యాలరీల వారీగా శ్రీవారి సేవకులకు విధుల కేటాయించాలని టిటిడి పిఆర్వో డా.టి.రవిని ఆదేశించారు. ఈ పర్వదినానికి విధులు కేటాయించే ఉద్యోగుల జాబితాను రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. శ్రీవారి సేవకుల సాయంతో భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు అందించేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టాలని అన్నప్రసాదం, ఆరోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. మాడ వీధుల్లో భక్తులకు వైద్యసేవలు అందించేందుకు తగినంత మంది వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని సిఎంఒ డా. నాగేశ్వరరావుకు సూచించారు. ఈ సమావేశంలో టిటిడి ఎస్‌ఇ2 రామచంద్రారెడ్డి, విఎస్వో మనోహర్, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ హరింద్రనాథ్, ట్రాన్స్‌పోర్టు జిఎం శేషారెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీతారామకు చిక్కు తొలిగెన్

- పర్యావరణ అనుమతులతో ఊపందుకోనున్న పనులు
- స్వయంగా పర్యవేక్షిస్తున్న సిఎం కెసిఆర్
- వచ్చే ఖరీఫ్ నాటికల్లా గోదావరి నీళ్ళ పరవళ్ళు





మన తెలంగాణ/ఖమ్మం ప్రతినిధి : మూడు జిల్లాల వరదాయిని సీతారామ ప్రాజెక్టుకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతి లభించడంతో ఈ ప్రాజెక్టు పనులు మరింత వేగవంతం కానున్నాయి. గత నవంబర్ 27న ఈ ప్రాజెక్టుకు పర్యావరణ, అటవీ శాఖ అనుమతి కావాలని రాష్ట్ర ప్రభుత్వ ఎక్స్‌పర్ట్ అప్రోజల్ కమిటీ ముందు రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి వచ్చిన విషయం తెలిసిందే. ఆ తరువాత ఇటీవల ఢిల్లీకి వెళ్లిన ముఖ్యమంత్రి కెసిఆర్ సీతారామ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి రావాల్సిన అన్ని శాఖల అనుమతులపై భారత ప్రధాని నరేంద్రమోడీకి విన్నవించారు. కెసిఆర్ నిర్వహించిన దౌత్యంతో ఈ అనుమతి లభించింది. ఈమేరకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ రాష్ట్ర ఇరిగేషన్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్‌కు లేఖ కూడా రాసింది. ఒక పక్క కేంద్రం అనుమతులు ఇవ్వడం, మరోపక్క రాష్ట్రముఖ్యమంత్రే స్వయంగా ఈ ప్రాజెక్టు పనులను మానిటరింగ్ చేస్తుండటంతో ఈ పనులు యుద్ధప్రాతిపాదికన కొనసాగనున్నాయి. ఈప్రాజెక్టు పనుల పురోగతిపై ఇటీవల ముఖ్యమంత్రి కెసిఆర్ ఉన్నతాధికారులతో సమీక్షించారు. మరోసారి కూడా సమీక్ష చేయాలని నిర్ణయించారు. అంతేగాక రిటైర్డ్ ఇంజనీర్ల బృందం రెండు రోజుల క్రితం జిల్లాలో పర్యటించి ముఖ్యమంత్రికి నివేదికను కూడాసమర్పించారు. అతి త్వరలో సిఎం కెసిఆర్ ఈప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించేందుకు స్వయంగా ఖమ్మం జిల్లాకు రానున్నారు. ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశంలో ఈ ప్రాజెక్టుకు భారీగా నిధులను కేటాయించే అవకాశం ఉంది. ఇదే జరిగితే వచ్చే ఖరీఫ్ నాటికి సీతారామాప్రాజెక్టు కాలువలో గోదావరి నీటిని పారే అవకాశం లేకపోలేదు.

ఉమ్మడి జిల్లా వరదాయిని

ఉమ్మడి జిల్లా వరదాయినిగా పిలుచుకునే సీతారామ ప్రాజెక్టుకు 2016 ఫిబ్రవరి 18న మండలం రోళ్లపాడు వద్ద ముఖ్యమంత్రి కెసిఆర్‌చే శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టు పూర్తయ్యితే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబుబ్‌బాద్ జిల్లా లో కరువు అనేది ఉండదు. ఏటా మూడు పంటలకు సాగునీరు అందించే విధంగా డిజైన్ చేశారు. కాంగ్రెస్ హయాంలో చేపట్టిన రాజీవ్ సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టుకు తెలంగాణ ప్రభుత్వం చ్చిన తరువాత రీడిజైన్ చేసి సీతారామ ప్రాజెక్టుగా నామకరణం చేశారు. తొలుత రూ.7926.147 కోట్ల వ్యయంతో అంచనాలు రూపొందించగా మళ్ళీ దానిని రూ. 13057.98 కోట్లకు పెంచి ఈ ఏడాది ఆగస్టు 2న రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెం 72 జారీ చేసింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన రూ.11వేల కోట్ల నిధుల సేకరణ కూడా పూర్తయ్యింది. ఈ ప్రాజెక్టు పూర్తయ్యితే గోదావరి నదిలోని70.40 టిఎంసిల జలాలు మూడు జిల్లాలో బిరబిరా పరవళ్ళు తొక్కనున్నాయి. ఇప్పుడున్న 3లక్షల45వేల 534 ఎకరాల భూమిని స్థిరీకరించడంతోపాటు కొత్తగా 3లక్షల 28వేల 853 ఎకరాలు సాగులోకి వస్తుంది. మొత్తం 6,74,387 ఎకరాల భూమి సేద్యం అవుతుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉభయ గోదావరి జిల్లా మాదిరిగా పచ్చదనం కప్పుకోనుంది.

సీతారామ ప్రాజెక్టు పూర్తి అయితే సాగయ్యే ఆయకట్టు (ఎకరాల్లో)

జిల్లా	కొత్త ఆయకట్టు	స్థిరీకరణ	మొత్తం ఎకరాలు
ఖమ్మం	162083	296925	459008
కొత్తగూడెం	157574	42935	200509
మహబుబాబాద్	9196	5674	14870
మొత్తం	328853	345534	674387

ప్రాజెక్టు డిజైన్

అశ్వాపురం మండలం పాములపాడు గ్రామం వద్ద గోదావరి అనకట్ట నుంచి గ్రావిటీ ద్వారా గోదావరి నీటిని రెండు జిల్లాలకు తరలిస్తూ ప్రధాన రిజర్వాయర్ తోపాటు చెరువులు, కుంటలు నింపే విధంగా ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు. గ్రావిటీ ద్వారా 243.20 కి.మీ దూరంలో కాలువలను తవ్వనున్నారు. మొత్తం నాలుగు పంపు హౌస్‌లను నిర్మించనున్నారు. ఖరీఫ్‌తోపాటు రబీ పంటలకు సాగునీటిని అందించే విధంగా రూపొందించారు. అంతేగాక మైదానప్రాంతంలో నాగార్జునసాగర్ ఆయకట్టు కింద ప్రస్తుతం సాగు అవుతున్న 2.5 లక్షల ఎకరాలను కూడా ఈప్రాజెక్టు కింద స్థిరీకరించారు. కృష్ణా నదిలో నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు లేని సమయంలో గోదావరి నీటిని సాగర్ కాలువల ద్వారా రైతులకు అందించనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే జిల్లాలో మొత్తం పది లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది.

8ప్యాకేజీలతో పనులు

ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులను 8ప్యాకేజీలుగా విభజించి రూ 6.232 కోట్ల అంచనా వ్యయంతో సిద్ధం చేశారు. మొత్తం 8 ప్యాకేజీలతో నిర్మించాలని తలపెట్టారు. ఇప్పటి వరకు 7 ప్యాకేజీల అగ్రిమెంట్ అయ్యి పనులు కొనసాగుతున్నాయి. 8వ ప్యాకేజి పనులకు త్వరలో అగ్రిమెంట్ జరగనుంది. డిస్టిబ్యూషన్ సంబంధించిన కాలువల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ప్రాజెక్టుకు సంబంధించి మొత్తం 114.5 కి.మీ వరకు సర్వే నిర్వహించారు. ప్రాజెక్టు కోసం ఇప్పటి వరకు ఫేజ్ 1లో4.169 ఎకరాల భూ సేకరణ చేయాలని నిర్ణయించగా 1.800 ఎకరాల భూమిని సేకరించి రూ.159.4 కోట్ల నిధులను నిర్వాసితులకు చెల్లించారు.

మరింత ముమ్మరంగా పనులు

ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం అవసరమైన కాలువల తవ్వకం 3.783 ఎకరాల అటవీ భూమి నుంచి పోతుంది. దీంతో కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఈ ఏడాది ఫిబ్రవరిలో తొలి దశకు అనుమతి ఇచ్చారు. రెండో దశ అనుమతి కోసం ఈ ఏడాది సెప్టెంబర్ 24న రూ.2416కోట్ల నిధులను చెల్లించారు. సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువ 13.15 కి.మీ మేర కిన్నరసాని వన్యప్రాణి అటవీ శాఖ పరిధిలో పోతుంది. కోర్‌జోన్ పరిధిలో కాకుండా 680 ఎకరాల అటవీ భూమి 413 ఎకరాల పట్టాభూమి మీదుగా కాలువలను తవ్వాల్సి ఉంది. మొత్తంగా 1.094.55 ఎకరాలకు కేంద్ర అటవీ, వన్యప్రాణి శాఖ అనుమతి మంగళవారమే లభించింది. కిన్నరసాని అభయారణ్యంలో 444 హెక్టార్ల వన్యప్రాణి విభాగం ఉంది. దీనికి కేంద్రం అనుమతి కోసం దరఖాస్తు చేయగా ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక ఫేజ్ 1 పనులు ఎలాంటి అడ్డంకులు లేకుండా ముందుకు సాగనున్నాయి కోర్ జోన్, బఫర్ జోన్ అనుమతులకు అదేశాలు జారీ కావడంతో ఈ ప్రాజెక్టు పనులు మరింత ముమ్మరం కానున్నాయి.

వైద్యుడి నిర్ణయాలు కీలకం

జాతీయ సదస్సు వెల్లడి

మన తెలంగాణ/ హైదరాబాద్: అత్యవసర సమయాల్లో ప్రాణాపాయంలో ఉన్న రోగిపట్ల వైద్య నిపుణులు వేగంగా తీసుకొనే నిర్ణయం కీలకమైందని, దీని ద్వారా రోగిని ప్రాణాపాయం నుంచి కాపాడొచ్చని ఎమెర్జింగ్ ఎవిడెన్స్ ఇన్ క్రిటిక్ల్ కేర్ మెడిసిన్ ఆఫ్ ది ఇయర్ 2018 జాతీయ సదస్సు అభిప్రాయ పడింది. ఇండియన్ సొసైటీ ఆఫ్ క్రిటికల్ కేర్ మెడిసిన్ సహకారంతో హైదరాబాద్‌లోని సిటిజన్స్ స్పెషాలిటీ హాస్పిటల్ రెండురోజుల జాతీయ సదస్సుకు ఆతిథ్యం ఇచ్చింది. అత్యవసర విభాగంలో వైద్య సేవలందించే డాక్టర్లకు ఆధునిక చికిత్స విధానాలపై ఉండాల్సిన అవగాహన, అనారోగ్యంతో ఉన్న పేషెంట్స్‌కు చికిత్సను అందించేపుడు డాక్టరు నైపుణ్యం ప్రాధాన్యతను సదస్సు చర్చించింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా కాళోజి నారాయణ రావు యూనివర్సిటీ ఆరోగ్య యూనివర్శిటీ వైస్ చాన్సర్ డా.బి.కరుణాకర్ రెడ్డి, గౌరవ అతిథులుగా సిటిజన్స్ హాస్పిటల్ చీఫ్ జనరల్, లాపరోస్కోపిక్ బేరియాట్రిక్ సర్జన్ డా.సురేష్ చంద్ర హరి హాజరయ్యారు. ఈ సదస్సులో క్రిటికల్ కేర్‌లో వచ్చిన అత్యాధునిక విధానాలు, అత్యాప్స్ వైద్య విధానాల ఆధారిత మార్గదర్శకాలు, కేసు స్టడీస్ సంకలనాలతో కూడుకున్న 'రిఫ్లెక్ట్ 2018' అనే పేరుతో పుస్తకాన్ని ఆవిష్కరించారు. సదస్సులో దేశంలోని ప్రముఖ వైద్య నిపుణులు పేషెంట్స్ చికిత్సకు ఉపయోగపడే అధునాతన చికిత్స విధానాలు అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా పేషెంటుకు మెరుగైన చికిత్స అందించే వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయం కారణంగా మెదడు గాయపడడం, అధిక రక్త స్రావం ఎక్కువగా ఉంటాయి. ఇలాంటి పరిస్థితులలో వీరికి ఇవ్వాల్సిన రక్త వృద్ధి, మెదడుని సంరక్షించుకునే చికిత్స విధానాలను నిపుణులు వివరించారు.

రద్దీ మాల్స్‌లో ప్రత్యేక డ్రాప్ బాక్సులు

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతీ వయోజనుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ తెలిపారు. సచివాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు తీసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ప్రథమంగా చేయాల్సిన ఓటరు నమోదు కార్యక్రమం కీలకమైందన్నారు. రాష్ట్రంలో 32,573 పోలింగ్ స్టేషన్లలో 13 కేంద్రాలను తొలగించి, అదనంగా 2043 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుకు ఇసి ఆమోదం తెలపడంతో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 34,603కు చేరిందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల తొలగింపునకు సంబంధించిన అంశాలపై చర్చించినట్లు చెప్పారు. తొలగింపునకు గురైన వారుంటే మళ్లీ నమోదు చేసుకోవాలని సూచించారు. గతంలో సుమారుగా 30 లక్షల ఓట్లు తొలగించామని, ఎన్నికల నియమ నిబంధనల మేరకు చేసినట్లు చెప్పారు. అయితే వారంతా నిజమైన ఓటర్లుగా ఉనట్లయితే ఇపుడు జరుగుతున్న ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయాలని సూచించారు. రాజకీయ పార్టీల భేటీలో హైదరాబాద్‌లో నమోదు దరఖాస్తులకు సంబంధించి మాల్స్‌లో ప్రత్యేక డ్రాప్స్ బాక్సులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బూత్ లెవెల్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అన్ని వార్డులలో ఇంటర్నెట్‌తో కూడిన కంప్యూటర్ సౌకర్యంతో ఓటు సదుపాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



మనతెలంగాణ/తిరుమల ప్రతినిధి: శ్రీ వేంకటేశ్వర ప్రాణదానం ట్రస్టుకు మంగళవారం రూ.10 లక్షల 11 వేలు విరాళంగా అందింది. సింగపూర్‌లో స్థిరపడిన దేవకి తిరుపతికి చెందిన సురేష్, హుస్సేన్ కలిసి ఈ మేరకు విరాళం డిడిని టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు పుట్టా సుధాకర్ యాదవ్‌కు అందజేశారు. తిరుమలలోని టిఎస్‌ఆర్ విశ్రాంతి గృహంలో ఈ కార్యక్రమం జరిగింది.



తిరుపతి నుండి నెల్లూరు కు రైలులో వెళ్ళిన భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, రేణిగుంటలో ప్రొటోకాల్ ఏర్పాట్లు సరిగ్గా చెయ్యలేదని కామన్ సెన్స్ ఉందా మీకు? అని రైల్వే సిబ్బందిపై ఉపరాష్ట్రపతి సీరియస్ అయ్యారు. **మనతెలంగాణ/తిరుమల ప్రతినిధి**

అశ్రునయనాలతో కన్నీటి వీడ్కోలు

- స్వగ్రామానికి చేరుకున్న మృతదేహాలు
- తండోపతండాలుగా తరలివచ్చిన జనం
- కన్నీంటి పర్యంతమైన గ్రామాలు
- మృతదేహాల రాక కోసం 48 గంటలుగా నిరీక్షించిన కుటుంబ సభ్యులు, బంధువులు





మన తెలంగాణ/మెదక్/నర్సాపూర్ : అయ్యప్పదర్శనం కోసం వెళ్లి తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన 11మంది అయ్యప్ప భక్తుల మృతదేహాలు మంగళవారం స్వగ్రామాలకు చేరుకున్నాయి. గత 48గంటలుగా మృతదేహాల కోసం నిరీక్షించిన కుటుంబీకులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్థులు అధికార యంత్రాంగం మృతదేహాలు రావడంతో ఆ గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. తమిళనాడు ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరిక మేరకు అంబులెన్సుల ద్వారా మృతదేహాలను స్వగ్రామాలకు చేర్చారు. సోమవారం సాయంత్రం తమిళనాడు నుంచి బయలుదేరిన మృతదేహాలు మంగళవారం సాయంత్రం 5:30 గంటలకు నర్సాపూర్ టౌన్‌కు చేరుకున్నాయి. మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి, జడ్‌పి చైర్‌పర్సన్ రాజమణి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కలెక్టర్ ధర్మారెడ్డి, జాయింట్ కలెక్టర్ నగేష్, టిఆర్‌ఎస్ జిల్లా ప్రెసిడెంట్ మురళిధర్‌యాదవ్‌లు అంబులెన్స్‌లకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పట్టణ వాసులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో నర్సాపూర్ అంతా కిక్కిరిసిపోయింది. మృతదేహాలు తీసుకువచ్చిన అంబులెన్సులు నర్సాపూర్ నుంచి మండల పరిధిలోని చిన్నచింత కుంట, రెడ్డిపల్లి, మంతూర్, ఖాజీపేట గ్రామాల్లోని వారి వారి ఇళ్ల వద్దకు చేరుకున్నాయి. మంగళవారం ఉదయం నుంచే తమవారి కడసారి చూపు కోసం కళ్లలో ఒత్తులేసుకొని ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు అంబులెన్సుల నుంచి మృతదేహాలను కిందికి దించగానే బోరున విలపించారు. అయ్యప్ప మాల దారణతో, భక్తితో పూజలు చేసి, తమ ఆరాధ్య దైవమైన శబరిగరీశుడి దర్శనానికి వెళ్తున్నామని ఎంతో ఆనందంగా వెల్లిన తమ వారు విగత జీవులుగా ఇళ్లకు చేరడం చూసి తల్లిదండ్రులు, భార్యా, పిల్లలు, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు గుండెలు బాదుకుంటు ఏడుస్తుంటే అందరి కళ్లు చెమర్చాయి. అనంతరం అన్ని గ్రామాల్లో అంత్యక్రియలు పూర్తి చేశారు.

బాధిత కుటుంబాలను ఓదార్చిన సునీతారెడ్డి

తమిళనాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మృతదేహాలు మంగళవారం నర్సాపూర్ మండలంలోని ఆయా గ్రామాలకు చేరుకోగా మాజీమంత్రి సునీతాలక్ష్మారెడ్డి మృతదేహాల ఇండ్ల వద్దకు వెళ్లి బాధిత కుటుంబాలను ఓదార్చి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకుంటుంది

ఎంపి,ఎమ్మెల్యేలు నివాళులు

సోమవారం తమిళనాడు రాష్ట్రం పుదుకొట్టై నుంచి వస్తున్న అయ్యప్ప భక్తుల శవాలు మంగళవారం సాయంత్రం నర్సాపూర్‌కు చేరుకున్న అనంతరం మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కలెక్టర్ ధర్మారెడ్డిలు అంబులెన్సులకు పూలమాలలు వేశారు. అనంతరం ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతు బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విదాల ఆదుకుంటుందని, అంత్యక్రియల అనంతరం సీఎంతో చర్చించి ఎక్స్‌గ్రేషియా మంజూరుకు కృషిచేస్తామని చెప్పారు. మృతుల పిల్లల ఎడ్యుకేషన్ విషయంలో ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

అవకాశం అందిపుచ్చుకోండి

కలెక్టర్ రజత్‌కుమార్ సైనీ





మన తెలంగాణ / భద్రాచలం : విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే మెరికల్లా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని భద్రాద్రికొత్తగూడెం జిల్లా కలెక్టర్ రజత్‌కుమార్ సైనీ అన్నారు. మంగళవారం భద్రాచలం ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి మొట్టమొదటి గిరిజన క్రీడల ప్రారంభ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడల ప్రారంభోత్సవానికి విచ్చేసిన కలెక్టర్‌కు ఐటిడిఏ పిఓ పమేలా సత్పథి ఘనంగా స్వాగతం పలికారు. గిరిజన కొమ్ము డ్యాన్సులు, విద్యార్థుల బ్యాండ్‌లతో కలెక్టర్‌ను సభా ప్రాంగణానికి తీసుకెళ్లారు. అనంతరం జాతీయ, క్రీడాపతాకాలను ఆవిష్కరించి బెలూన్‌లను ఎగురవేశారు. ఆర్చరీ, వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మండల, జిల్లాస్థాయిలు అధిగమించి రాష్ట్రస్థాయికి ఎంపికావడమే చాలా గొప్ప విషయమని అన్నారు. క్రీడలలో గెలుపోటములు సహజమని, క్రీడల్లో పాల్గొని ప్రతిభ చాటామా లేదా అన్న స్ఫూర్తిని తీసుకోవాలేగాని ఓటమి చెందితే కుంగి పోవద్దని అన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో ఆత్మస్థైర్యంతో పాటు దాగి ఉన్న ప్రతిభను కూడా వెలికి తీయవచ్చని పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాలలో మాదిరిగా ఉత్తీర్ణత సాధిచడం, సాధించక పోవడం అనేది క్రీడలలో ఉండదని, అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని చక్కని క్రీడాకారులుగా ఎదగాలని అన్నారు. అందరిలో నాయకత్వ లక్షణాలు ఉన్నాయి కనుకనే ఈ స్థాయిలో పాల్గొనే అవకాశం వచ్చిందని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు అదనంగా క్రీడలు ఆడటం వల్ల ఒక గుర్తింపు వస్తుందని, మానసినక ఉల్లాసం , ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. పాటశాలల స్థాయి నుండి విద్యార్థులను పోత్సహించి రాష్ట్రస్థాయి క్రీడలలో పాల్గొనే అవకాశాన్ని కల్పించినందుకు వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. రాష్ట్రస్థాయి గిరిజన క్రీడలకు చక్కటి ఏర్పాట్లు చేసినందుకు పివో, డిడిలను ప్రత్యేకంగా అభినందించారు.

పలు పాఠశాలల క్రీడాకారులను ఈ రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారు. 31 జిల్లాల నుండి 6 జోన్లుగా విభజించి ఒక్కో జోన్‌కు సుమారు 236 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలురు 696 మంది, బాలికలు 720 మంది మొత్తం 1416 మంది ఈ పోటీలలో పాల్గొంటారు. ఇతర జిల్లాల నుండి 150 మంది పిడి, పిఇటిలు, ఉమ్మడి జిల్లాల నుండి 75 మంది పిడి, పిఇటిలు, మొత్తం 225 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. క్రీడలలో పాల్గొనే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలని అధికారులు భావిస్తున్నారు. క్రీడాకారులకు అందించే మెనూ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. క్రీడా మైదానంలో ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉచితంగా స్నాక్స్ అందించారు. ఈ ఫుడ్‌కోర్టును పిఓ రిబ్బను కత్తిరించి ప్రారంభించారు.

ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారిణి పమేలా సత్పథి మాట్లాడుతూ గిరిజన క్రీడోత్సవాలు మొట్టమొదటిగా భద్రాచలంలో నిర్వహించేందుకు అవకాశం కల్పించిన గిరిజన సంక్షేమ ప్రిన్సిపల్ సెక్రటరీ బెన్‌హర్ మహేష్‌దత్ ఎక్కాను, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ క్రిస్టినా జెడ్ చోంగ్తూలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. గిరిజన విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ననైపుణ్యాలను వెలికితీసి జాతీయ, అంర్జాతీయ క్రీడాకారులుగా తయారవడానికి ఇదొక చక్కని వేదికని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అత్యుత్తమ క్రీడాకారులను తయారు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ డిడి రాంమూర్తి, జిల్లా క్రీడల అధికారి పుట్టా శంకరయ్య, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భర్త ఇంటిముందు ధర్నా



మనతెలంగాణ/ కొత్తగూడెం : సుజాతనగర్ గ్రామానికి చెందిన అబ్దుల్ అలీంఫారూకి ఇంటిముందు ఆయన మొదటి భార్య సబియా, ఆమె బంధువులు మంగళవారం ఆందోళనకు దిగారు. త్రిపుల్ తలాక్ చెప్పి మరో మహిళను వివాహం చేసుకున్న నిత్య పెళ్లికొడుకు ఫారూకిని వెంటనే అరెస్ట్ చేయాలని, అత్తమామల వేధింపులు అరికట్టాలని ప్లకార్డులు ప్రదర్శించారు. సుజాతనగర్‌కు చెందిన అలీం కుమారుడు అబ్దుల్‌అలీంఫారూకీ ఖమ్మం కు చెందిన యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఫారూకి హైద్రాబాదులో ప్రవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. భార్యాభర్తలు అక్కడే ఉంటున్నాడు. ఫారూకి తల్లికి ఆరోగ్యం బాగలేకపోవడంతో హైద్రాబాదు వెళ్లారు. అత్తమామలు తమ ఇంటికి వచ్చి ఉండటం ఇష్టంలేదని ఫారూకి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీనితో తరచు భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గొడవల నేపథ్యంలో ఫారూకి పెనుబల్లి సమీపంలోని రామచంద్రాపురం కు చెందిన మరో యువతిని 25 మార్చి2018లో వివాహం చేసుకున్నాడు. ఆమె వేరు కాపురం పెట్టిన విషయం తెలుసుకుని మొదటి భార్య సబియా అక్కడికెళ్లి గొడవ చేయడంతో రెండవ భార్యకు విడాకులు ఇచ్చాడు. మొదటి భార్యతోనే ఉంటున్నాడు. అయితే వీరిమధ్య సఖ్యత లేకపోవటంతో మళ్లీ గొడవలు కొనసాగుతున్నాయి. ఖమ్మంలో మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టేందుకు ప్రయత్నించారు. కానీ అక్కడి పోలీసులు కౌన్సిలింగ్ మాత్రమే చేస్తామని కేసుపెట్టే విషయం కొలిక్కిరాలేదు. అత్తమామలతో మాట్లాడేందుకు సబియా ఆమె బంధువులు మంగళవారం సుజాతనగర్ వచ్చారు. అత్తమామలు హైద్రాబాదు వెళ్లి ఉండటంతో వారి ఇంటిముందుకు ప్లకార్డులతో ప్రదర్శన చేసి ధర్నా చేశారు.

ఎక్కడున్నాడో... ఏమయ్యాడో ...?



మన తెలంగాణ/లక్ష్మణచాంద: బతుకుదెరువు కోసం దేశంకాని దేశం వెళ్లి అక్కడ ఏడాదిగా ఆచూకి లేకపోవటంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని వద్యాల్ తండా గ్రామానికి చెందిన సనావత్ మను (32) మూడేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం సౌదీ దేశానికి వెళ్లారు. అక్కడ ఓ కంపెనీలో పని చేశాడు. వేతనం తక్కువగా ఉండటంతో ఆ కంపెనీలో పని మానివేసి బయట (కల్లివెల్లి) పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మను తరచూ ఇంటికి ఫోన్ ద్వారా క్షేమ సమాచారాలు తెలుసుకునేవాడు. అయితే గత కొంత కాలంగా బనావత్ మను తమకు ఫోన్ చేయడం లేదని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సౌదీలో ఉన్న గ్రామానికి చెందిన వారి ద్వారా ఆయన ఆచూకీ తెలుసుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఆయన క్షేమ సమాచారం తెలియకపోడంతో మాను ఎక్కడ ఉన్నాడో ఏమయ్యాడో అని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

సంక్రాంతికి ప్రత్యేక సర్వీసులు

- ఇప్పటికే ప్రారంభమైన రైళ్లు
- నేటి నుంచి ఆర్‌టిసి బస్సుల నిర్వహణ
- ఇరు రాష్ట్రాల్లో 7,800 బస్సులు, 147 రైళ్ల ఏర్పాటు
- గతంలో కంటే సంఖ్యను పెంచిన రైల్వే, ఆర్‌టిసి అధికారులు
- ప్రయాణికుల సురక్షిత ప్రయాణమే లక్ష్యం
- రవాణా సేవలకు ప్రైవేటు సంస్థలు సైతం సన్నాహాలు





మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో మరో రెండు రోజుల్లో సంక్రాంతి సెలవులు ప్రారంభం కానున్నాయి. దీంతో హైదరాబాద్‌తోపాటు పలు నగరాలు, పట్టణాల నుంచి ప్రజలు సొంత గ్రామాలకు వెళ్లేందుకు సన్నద్ధమయ్యారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు ఈ నెల 11వ తేదీ నుంచి సంక్రాంతి సెలవులు ప్రారంభం కానుండడంతో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థలతోపాటు దక్షిణ మధ్య రైల్వే సైతం ప్రత్యేక సర్వీసుల ఏర్పాటు చేశాయి. ఇప్పటికే ప్రత్యేక రైళ్ల నిర్వహణకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శ్రీకారం చుట్టగా బుధవారం నుంచి ఆర్‌టిసి అధికారులు సైతం ప్రత్యేక బస్సుల నిర్వహించ నున్నాయి. దీనికి సంబంధించిన వివరాలను ఇటు రైల్వేతోపాటు అటు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆర్‌టిసి అధికారులు వెల్లడించారు. ప్రత్యేక సర్వీసులకు ప్రత్యేక ధరలను కూడా నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. సాధారణ సర్వీసులకు తోడుగా పలు ప్రత్యేక సర్వీసుల నిర్వహణను చేపట్టిన రవాణా సంస్థల అధికారులు ప్రత్యేక సర్వీసుల పేరుతో సాధారణ సర్వీసులకు సైతం అదనపు వడ్డనకు సిద్ధమయ్యాయి. ప్రత్యేక సర్వీసులను 24 గంటలపాటు ప్రయాణికులకు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 5,252 బస్సులను ఏర్పాటు చేసిన అధికారులు 3,400 బస్సులను నగరంలోని మహాత్మాగాంధీ బస్ స్టేషన్ నుంచే నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తిగా టిఎస్‌ఆర్‌టిసికి చెందిన ఈ సర్వీసులను తెలంగాణలోని వివిధ జిల్లాలతోపాటు గ్రామాలకు 3,673, తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు 1,579 బస్సులను ఏర్పాటు చేశారు. దీంతోపాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో 2500 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. మొత్తంగా రెండు తెలుగు రాష్ట్రాలు 7,800 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. కుటుంబ సమేతంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితంగా ప్రయాణికులు తమ సొంత గ్రామాలు, పట్టణాలు, నగరాలు వెళ్లేందుకు ఈ ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వివరించారు. కేవలం ఇరు రాష్ట్రాలకే పరిమితం కాకుండా ఈ ప్రత్యేక సర్వీసులు ఇతర రాష్ట్రాలకు సైతం చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 14వ తేదీ వరకు జంటనగరాల నుండి 7,800 స్పెషల్ బస్సులను ప్రయాణికుల కోసం సిద్ధం చేశారు. ప్రత్యేక బస్సుల నిర్వహణను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు మహానగరంలోని వివిధ ప్రధాన కూడళ్ల ద్వారా ఈ ప్రత్యేక సర్వీసులను నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు ఎలాంటి ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా 24 గంటలు అందుబాటులో ఉండేలా పలువురు అధికారులను సైతం నియమించామన్నారు. ప్రత్యేక సర్వీసులు మహాత్మాగాంధీ బస్ స్టేషన్‌తోపాటు జూబ్లీ బస్ స్టేషన్, పాత సిబిఎస్, కాచిగూడ, ఎల్‌బినగర్, ఆరాంఘర్, ఇసిఐఎల్ చౌరస్తా, జీడిమెట్ల, తార్నాక, ఉప్పల్ చౌరస్తా, అమీర్‌పేట్, టెలిఫోన్ భవన్, లింగంపల్లి, మియాపూర్ చౌరస్తా, కెపిహెచ్‌బి తదితర ప్రాంతాల నుండి నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రోజుకు 400 బస్సులను టిఎస్‌ఆర్‌టిసి నిర్వహిస్తుంది. ఇందులో ఎసి బస్సులు మినహా మిగిలిన అన్ని రకాల సర్వీసులున్నాయని అధికారులు తెలిపారు. దీంతో ఇప్పటికే 300 బస్సుల వరకు రిజర్వేషన్లు కూడా పూర్తయినట్లు అధికారులు వివరించారు.

147 ప్రత్యేక రైళ్లు

సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు ప్రత్యేక రైళ్ల నిర్వహణకు దక్షిణ మధ్య రైల్వే చేపట్టింది. ప్రత్యేక రైళ్లతో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు పొడగింపు, మరిన్ని రైళ్లకు అదనపు బోగీల ఏర్పాటు, ప్రత్యేక స్టాఫ్‌లను కూడా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక రైళ్లకు ప్రత్యేక ఛార్జీలను కూడా వసూలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మరిన్ని రైళ్లను పెంచేందుకు కూడా దక్షిణ మధ్య రైల్వే సిద్ధమైంది. గత ఏడాది కేవలం 92 ప్రత్యేక రైళ్లను మాత్రమే ఏర్పాటు చేసిన అధికారులు ఈ సారి ఆ సంఖ్యను 147కు పెంచారు. 50 శాతానికి పైగా రైళ్లను సంఖ్యను పెంచిన ట్లు అధికారులు తెలిపారు. అనేక రైళ్లు ఇప్పటికే ప్రారంభమయ్యాయని తెలిపారు. వీటి సంఖ్య పెరగడంతో నిత్యం ఫెస్టివల్ ముగింపు వరకు ఈ సర్వీసుల నిర్వ హణ కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. రైల్వే, ఆర్‌టిసితో పాటు ప్రైవేటు రవాణా సంస్థలు కూడా పలు ప్రత్యేక ఏర్పాట్లును చేసినట్లు సమాచారం. సాధారణంగా ప్రతి ఏడాది ఆర్‌టిసితోపాటు రైల్వే ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వీసులు సరిపోక ప్రయాణికులు అనేక రకాల అవస్థలకు గురవుతున్నారు. కనీసం కాలు పెట్టేందుకు కూడా వీలు లేకుండా సర్వీసుల నిర్వహణ సాగుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సంస్థల ప్రత్యేక సర్వీసులను పరిగణలోకి తీసుకొని పలు ప్రైవేటు సంస్థలు సైతం ప్రయాణికులను తమ గమ్య స్థానాలకు చేర్చేందుకు సిద్ధమయ్యాయి.

ప్రాంతాల వారీగా బయలుదేరే బస్సుల వివరాలు....

ఎంజీబీఎస్ నుండి : మహబూబ్‌నగర్, తాండూరు, ఖమ్మం, తిరుపతి, బెంగుళూరు ప్రాంతాలకు

● జూబ్లీ బస్‌స్టేషన్ నుండి ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాలకు షెడ్యూల్డ్ బస్సులతో పాటు స్పెషల్ బస్సులు బయలుదేరతాయి

● గౌలిగూడ సిబిఎస్ నుండి కర్నూల్, అనంతపురం, గుత్తి, పుట్టపర్తి, ధర్మవరం, మదనపల్లి ప్రాంతాలకు

● కాచిగూడ బస్‌స్టేషన్ నుండి: నంద్యాల, ఆత్మకూర్, వెలుగోడు, నందికొట్కూర్, కోయిలకుంట్ల, ఆళ్లగడ్డ, మైదుకూరు, బనగానపల్లి, అవుకు, బద్వేల్, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, పులివెందుల, కడప, రాజంపేట, రాయచోటి, కోడూరు, చిత్తూరు వెళ్లే షెడ్యూల్డ్, స్పెషల్ బస్సులు

ఉప్పల్ చౌరస్తా బస్‌స్టేషన్ల నుండి: యాదగిరిగుట్ట, హన్మకొండ, జనగాం, పరకాల, నర్సంపేట్, మహబూబాబాద్, వరంగల్ వెళ్లే షెడ్యూల్డ్, స్పెషల్ బస్సులు దిల్‌సుఖ్‌నగర్ నుండి: మిర్యాలగూడ, నల్గొండ, కోదాడ, సూర్యాపేట వెళ్లే షెడ్యూల్డ్, స్పెషల్ బస్సులు నడపనున్నారు.

బిహెచ్‌ఇఎస్, ఇసిఐఎల్ చౌరస్తా. చందానగర్, మియాపూర్ బస్టాండ్ల నుండి విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాలకు షెడ్యూల్డ్, స్పెషల్ బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం


- మరొకరికి తీవ్ర గాయాలు
- వెంకట్రావుపేటలో విషాదం





మనతెలంగాణ/మేడిపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మేడిపెల్లి మండలం వెంకట్రావుపేట శివారులో మంగళవారం జరిగిన సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన గనవేని పద్మ (19), మహేందర్‌లు ద్విచక్ర వాహనంపై కాచారంలో జరిగే మల్లిఖార్జునస్వామి జాతరకు వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన పుదుత అనిల్ (19) అనే యువకుడు జాతరకు వెళ్ళి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. దాంతో తీవ్ర గాయాలపాలైన అనిల్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా తీవ్రగాయాలపాలైన పద్మ, మహేందర్‌లను చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించగా పద్మ చికిత్స పొందుతూ మృతి చెందింది. మహేందర్ తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో వెంకట్రావుపేటలో విషాదం నెలకొంది. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మేడిపెల్లి ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు. కాగా పద్మ మృతిని జీర్ణించుకోలేని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గనవేని మల్లయ్య– లక్ష్మీ దంపతులకు ముగ్గురు కూతుళ్ళు కాగా రెండవ కూతురు ఏడాది క్రితం ఆత్మహత్య చేసుకుంది. ఆ సంఘటన మరవక ముందే చిన్నకూతురు పద్మ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తుండగా గ్రామస్థులంతా కంటతడి పెట్టుకున్నారు.

దొరికిన ఏటిఎం దొంగలు



మన తెలంగాణ/మన్సూరాబాద్: గత ఆరు నెలల నుంచి రూ.47 లక్షల నగదు తక్కువగా వస్తుందని కరూర్ వైశ్యా బాంక్ అసిస్టెంట్ మేనేజర్ మర్యాద కృష్ణమూరి అనుమానం రేకెత్తింది. దీంతో కీసర పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు శాస్త్రీయకంగా పరిశోధన అనంతరం రైటర్ సేఫ్ గార్డు ఉద్యోగి, సాయిరాం సాయికిరణ్‌ను అదుపులోకి విచారించారు. మేడ్చల్ జిల్లా యాప్రాల్ కుమ్మరి బస్తీకు చెందిన సాయిరాం సాయికిరణ్ (26) రైటర్ సేఫ్ గార్డులో ఉద్యోగం చేస్తున్నాడు. అదే జిల్లాకు చెందిన యాప్రాల్ అమ్మగూడ బజార్‌కు చెందిన కుమ్మరి నర్సింగ్ రావు పూజ అలియాస్ పూజ (23) ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి మండలం నేరెడ్‌మెట్ వాజ్‌పేయినగర్‌కు చెందిన తాటికొండ నాగరాజు (28) మంగళి షాపు నిర్వహిస్తాడు. వీరంతా ముఠాగా ఏర్పడి ఎటిఎంలో నగదు లోడు చేసిన తర్వాత కీపెట్టి నగదు తీసేవారు. వీరి వద్ద నుంచి రూ.40,24,909 లక్షల నగదు, బెలీనో కారు, చెక్కు బుక్‌లు, పాస్ బుక్‌లు స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు తరిలించారు.


ధర పెంచితే అదనపు ప్రయోజనం

మ్యాక్స్ సంఘాల వినతికి టెక్స్‌టైల్ డైరెక్టర్ సానుకూలత



మన తెలంగాణ / సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పవర్‌లూం కార్మికులు, ఆసాములు, యజమానుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్లలో ప్రభుత్వ అవసరాలకు ఉపయోగపడే వస్త్రాన్ని తయారు చేయించి కార్మికులను ఆదుకుంటుంది. కార్మికులకు, యజమానులకు ఉపాధి కల్పిస్తూనే మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ చీరల పంపిణీ ద్వారా ఆడపడుచుల అభిమానాన్ని అందుకుంటూ రాజీవ్ విద్యామిషన్ పరిధిలో విద్యార్థుల యూనిఫారాలను కూడా అందిస్తూ అందరి మన్ననలను పొందుతుంది. అయితే గత సంవత్సరం సిరిసిల్ల నేతన్నల సంక్షేమం కోసం ప్రభుత్వం ఆరు కోట్ల మీటర్ల బతుకమ్మ చీరల వస్త్రాన్ని సిరిసిల్లలో తయారు చేయించింది. షర్టింగ్, సూటింగ్, ప్యాలీవోని క్లాత్‌ను 2.20 కోట్ల మీటర్ల వస్త్రాన్ని, ప్యాడ్ క్లాత్ కోసం సుమారు 50 లక్షల మీటర్ల వస్త్రాన్ని సిరిసిల్లలో తయారు చేయించారు. అయితే అప్పుడు ఉన్న పిసి యార్న్ ధర కంటే ప్రస్తుతం ఒక కిలో పిసి యార్న్‌కు సుమారుగా రూ.30 నుండి 40 వరకు పెరగడంతో వస్త్రోత్పత్తిదారులపై పెనుభారం పడనుంది. గతంలో తయారైన వస్త్రాల ధరకే ప్రభుత్వం ప్రస్తుత సంవత్సరం కూడా వస్త్రాలను తయారు చేయాలని అగ్రిమెంట్ చేయించుకుంది. దాంతో తమకు జరిగే నష్టాన్ని ముందుగానే అంచనా వేసి మ్యాక్స్ సంఘాల జిల్లా ప్రతినిధుల బృందం టెక్స్‌టైల్ డైరెక్టర్ శైలజారామయ్యార్‌ను సోమవారం కలిసి తమకు తగిన న్యాయం చేయాలని వినతిపత్రం అందించారు. గత సంవత్సరం ప్రభుత్వ ఆర్డర్ల వస్త్రాన్ని తయారు చేసే సమయంలో ఒక కిలో పిసి యార్న్ రేటు రూ.245 ఉండగా అది ప్రస్తుతం రూ.282కు పెరిగింది. దీనివల్ల ప్రతి మీటర్ గుడ్డపై అదనపు భారం పడడంతో గత సంవత్సరం మీటర్ గుడ్డ ఉత్పత్తి ఖర్చు సుమారుగా ఒక మీటర్‌కు రూ.36 కాగా అది ఈ సంవత్సరం రూ.40కు చేరడంతో కార్మికులకు, ఆసాములకు చివరికి యజమానులకు కూడా నష్టం కలుగుతుందని అభిప్రాయంతో ముందస్తుగానే అధికారులను అప్రమత్తం చేశారు. అధికారులు కూడా సానుకూలంగా పరిశీలించి న్యాయం చేయడానికి ముందుకు రావడం విశేషం. గత సంవత్సరం సుమారుగా రూ.280 కోట్ల విలువైన వస్త్రాన్ని సిరిసిల్ల నుండి ప్రభుత్వం కొనుగోలు చేసింది. ప్రభుత్వం ఏ కారణం చేతనైనా ఏ సాకు చూపైనా పెరిగిన పిసి యార్న్ రేటును పరిగణన లోనికి తీసుకోనట్లయితే సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులకు నష్టం జరిగి, ప్రభుత్వం ఆశించిన ప్రయోజనం నెరవేరకుండాపోయే ప్రమాదం ఉంది. అయితే సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులు మాత్రం ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందనే ఆశతో ఉన్నారు. సిరిసిల్ల నుండి శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న కల్వకుంట్ల తారకరామారావు సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారుల సంక్షేమమే లక్ష్యంగా అనేక ఆలోచనలు చేసి బహువిధ పథకాలను సిరిసిల్లలో అమలు చేస్తున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్న కెటిఆర్ సిరిసిల్ల ప్రాంత అభివృద్ధికి మరిన్ని మేలైన సేవలు అందిస్తారని నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారు. ఎన్నికల ప్రచార సమయంలో కూడా కెటిఆర్ సిరిసిల్ల ప్రాంత వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ఎంతో చేయూతనందిస్తామని చెప్పడం కాదు చేసి చూపిస్తామని స్పష్టమైన హామీలు ఇచ్చిన నేపథ్యంలో నేతన్నలు ధైర్యంగా ముందుకు సాగుతున్నారు. ప్రభుత్వ ఆర్డర్ల వస్త్రోత్పత్తికి ఉత్సాహంతో ముందుకు వస్తున్నారు. ప్రభుత్వం ప్రోత్సాహం కూడా అందుకు తగిన విధంగా ఉండడం కూడా కార్మికులు, ఆసాములు, యజమానులు కూడా ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్ల వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వపరమైన పూర్తి సహకారం అండదండలు సిరిసిల్ల ప్రాంత నేతన్నలకు లభించడం వల్ల ఇతర ప్రాంతాల వారు సిరిసిల్లను ఆదర్శంగా తీసుకుని సిరిసిల్ల అమలు చేస్తున్న పథకాలను రాష్ట్రమం తా అమలు చేయాలని కోరుతుండడం గమనార్హం.


ప్రభుత్వం సహకరిస్తుందనే విశ్వాసంతో ఉన్నాం



చిమ్మని ప్రకాశ్, పవర్‌లూం మ్యాక్స్ సంఘాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు

గత సంవత్సరంకంటే పిసి యార్న్ నూలు రేట్లు కిలోకు రూ.30 నుంచి 40 పెరిగిన నేపథ్యంలో సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులపై భారం అదనంగా పడనుంది. ప్రభుత్వం ఈ విషయమై తగిన సహాయం చేస్తుందని విశ్వాసంతో ఉన్నాం. ప్రభుత్వం కూడా పెరిగిన ధరలను గమనిస్తుంది. తప్పకుండా సిరిసిల్ల నేతన్నల కోరికను మన్నించి ఈ సంవత్సరం ప్రభుత్వ వస్త్రాల కొనుగోలు ధరను మీటర్‌కు కనీసం రూ.4 పెంచుతుందనే విశ్వాసంతో ఉన్నాం. ప్రభుత్వ అండదండల వల్లే సిరిసిల్ల ప్రజలు గత 5 సంవత్సరాలుగా సంతోషంగా ఉంటున్నారు. ప్రభుత్వ సహకారం ఇలాగే ఉంటుందని విశ్వసిస్తున్నాను.

పెరిగిన పిసి యార్న్ ధరను ప్రభుత్వం భరించాలి



భీమని రాంచంద్రం, జిల్లా పవర్‌లూం మ్యాక్స్ సంఘాల సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్

సిరిసిల్ల నేతన్నలు ప్రభుత్వ ఆర్డర్ల వల్ల గత కొన్ని సంవత్సరాలుగా మనోధైర్యంతో జీవిస్తున్నారు. ఆత్మహత్యలకు నెలవుగా చెప్పుకున్న సిరిసిల్ల సిరుల ఖిల్లాగా మారుతోంది. ఇందుకు ప్రభుత్వం అందించిన సహాయం, సహకారం ముఖ్య కారణం. గత సంవత్సరం కంటే పిసి యారన్ ధరలు పెరిగాయి. ఈ సంవత్సరం ప్రభుత్వం పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకుని వస్త్రం కొనుగోలు ధరలను పెంచుతుందనే నమ్ముతున్నాం. ఎమ్మెల్యే కెటిఆర్ సిరిసిల్ల ప్రజల పక్షపాతి అని నేతన్నల నమ్మకం వమ్ము కాదని భావిస్తున్నాను.


మన తెలంగాణ
10
హైదరాబాద్
బుధవారం
9 జనవరి, 2019
www.manatelangana.news

పల్స్



పక్షవాతానికి ప్రధాన శత్రువు హైబిపి

మన ఆహార పద్ధతులో, జీవన శైలి కారణంగానో మనుషులు రకరకాల వ్యాధుల బారినపడుతున్నారు. కొన్ని రకాల వ్యాధులు ఆరోగ్యవంతులైన వాళ్లను కూడా నిలువునా కుప్పకూలుస్తున్నాయి. దాంట్లో ముఖ్యమైనది..పక్షవాతం. దీనిని నిర్లక్ష్యం చేస్తే మంచానికే పరిమితం చేసేస్తుంది. పక్షవాతానికి సంబంధించిన లక్షణాలు కనిపించన వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్తే దీని వల్ల జరిగే నష్టాన్ని నివారించే ప్రత్యేక చికిత్స ఇప్పుడు అందుబాటులో ఉందని అంటున్నారు వైద్య నిపుణులు.



సాధారణంగా 50 ఏళ్లు పైబడిన వారిలో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వయసు పెరుగుతున్న కొద్దీ ఇలాంటి ఇబ్బందులు పెరుగుతాయి. పుట్టుకతో వచ్చే కొన్ని సమస్యల కారణంగానో, గుండెకు సంబంధించిన జబ్బుల వల్ల తక్కువ వయసులో కూడా ఈ స్ట్రోక్ రావచ్చు.

కారణాలు: పక్షవాతం రావడానికి గల కారణాలు రెండు రకాలుగా చెప్పవచ్చు. ఒకటి జన్యుపరమైనవి, వయసు పైబడటం, స్త్రీలతో పోల్చితే పురుషులల్లో ఎక్కువగా రావడం వంటివి. రెండవది అధిక రక్తపోటు, మధుమేహం,పొగ తాగడం, అధిక కొలెస్ట్రాల్, మద్యం సేవించడం వంటివి.

లక్షణాలు: మాట సరిగా రాకపోవడం, ఒక కాలు, చేతిలో శక్తి తక్కువ అయినట్లు అనిపించడం, నోరు వంకర పోవడం, నిలబడలేకపోవడం, చూపు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. శరీరంలో ఒకవైపు కాలు, చేయి పడిపోవడం సాధారణంగా చూస్తుంటాం.

నష్టం జరగకుండా: స్ట్రోక్‌కు సంబంధించిన లక్షణాలు కనిపించినపుడు వీలైనంత త్వరగా ఆసుపత్రికి తీసుకెళ్లాలి అప్పుడే మెదడుకు ఎక్కువ నష్టం జరగకుండా కాపాడటం సాధ్యమవుతుంది. కొంతమందిలో పక్షవాతం వస్తుంది అనడానికి కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. తర్వాత కొన్ని గంటల్లో ఆ లక్షణాలు కనిపించకుండా పోతాయి. దీన్ని ట్రాన్సియెంట్ ఇష్కెమిక్ అటాక్(టీఐఏ) అంటారు. చాలా మంది లక్షణాలు తగ్గిపోయాయి కదా అని ఆసుపత్రికి వెళ్లరు. కానీ అది ఆరోగ్యరీత్యా మంచిది కాదు. అప్పటికప్పుడు తగ్గినా తప్పకుండా ఆసుపత్రికి వెళ్లాలి. పక్షవాతం లక్షణాలు కనిపించిన వెంటనే మూడు గంటలలోపల ఆసుపత్రికి వెళితే ప్రత్యేకమైన చికిత్స అందించవచ్చు. మెదడుకు రక్తం సరఫరా తక్కువ కావడం వల్ల స్ట్రోక్ వచ్చినపుడు ఈ చికిత్సను అందిస్తే ఫలితం బాగుంటుంది.

ఎందుకు జరుగుతుందిలా?: స్ట్రోక్ వచ్చిన వారిలో 85 నుంచి 90 శాతం మందిలో మెదడుకు రక్తం సరఫరా తగ్గడం వల్ల సమస్య మొదలవుతుంది. రక్తం సరఫరా తగ్గడం వల్ల మెదడుకు ఆక్సిజన్ అందదు. ఫలితంగా కొన్ని అవయవాలు పనిచేయడం మానేస్తాయి. 10 నుంచి 15 శాతం మందిలో రక్తనాళం చిట్లి రక్తం బయటకు వచ్చినపుడు ఒత్తిడి పెరిగి మెదడులో హాని జరుగుతుంది.

చికిత్స: ఫిట్స్ ఉంటే దానికి సంబంధించిన మందులు ఇవ్వాలి. అధిక రక్తపోటును నెమ్మదిగా తగ్గించాలి. అదే సమయంలో మెదడులో ఒత్తిడిని తగ్గించడానికి మందులు ఇవ్వాలి. మెదడులో రక్తస్రావం లేదంటే రక్తం సరఫరా తగ్గడం వల్ల సమస్య మొదలైందని అర్థం. అటువంటప్పుడు యాంటీ ప్లేట్‌లెట్ డ్రగ్స్‌ను ఇవ్వాలి. ఇవి రక్తం గడ్డకట్టడకుండా చేస్తాయి. ఇవి ఒకసారి మొదలు పెడితే జీవితాంతం వాడాల్సి ఉంటుంది. చేయి, కాలు కదలడం లేదు అంటే ఫిజియోథెరపీ చేయించాలి. దీనివల్ల మంచి ఫలితం ఉంటుంది. కాలు కదల్లేని స్థితిలో ఉంటే కాలులో రక్తం గడ్డకట్టకుండా చూసే మందులు ఇవ్వాలి. అదే సమయంలో మరేఇతర ఇబ్బందులు రాకుండా చూసుకోవాలి. చికిత్స తర్వాత ఒకేసారి పూర్తిగా నయంకాదు. మొదటి పది రోజుల్లో కాలు, చేయి కొంచెంకొంచెంగా కదుపుతారు. తర్వాత నెల రోజుల్లో పరిస్థితి ఇంకాస్త మెరుగవుతుంది.

మెదడులో రక్తస్రావం అయితే..: రక్తనాళం చిట్లినట్లయితే మెదడులో ఒత్తిడిని తగ్గించడానికి మందులు ఇవ్వాలి. మెదడులో ఒత్తిడి బాగా ఎక్కువగా ఉంది అనుకుంటే సర్జరీ చేసి క్లాట్‌ని తీసివేయాల్సి ఉంటుంది.

క్యాల్షియం మాత్రలు...అనవసరం



వయసు పైబడిన వాళ్లని చూడగానే చాలా మంది క్యాల్షియం, విటమిన్ డి సప్లిమెంట్లు తీసుకోమంటూ సలహా ఇస్తుంటారు. ఇవి ఎముకల ఆరోగ్యాన్నీ, గట్టితనాన్ని కాపాడతాయని, ఎమకలు విరిగిపోకుండా చేస్తాయనేది వారి అభిప్రాయం. అయితే, ఈ మధ్య జరిగిన పరిశోధకుల అధ్యయనంలో ఈ సప్లిమెంట్ల వల్ల ఏ ప్రయోజనమూ లేదని తేలిపోయింది. కొంత మందికి సప్లిమెంట్లు, మరికొందరికి ప్రభావం లేని మందులు ఇచ్చి చూస్తే, మాత్రలు వేసుకున్న వారి ఎముకలు విరిగే ప్రమాదం ఏమీ తగ్గలేదని తేలిపోయింది. కాకపోతే, ఎముకల ఆరోగ్యానికి క్యాల్షియం, విటమిన్ డి తప్పని సరి అనేది ఎవరూ చెప్పలేని నిజం. అందువల్ల ఆ రెండింటిని ఆహార పానీయాల ద్వారా, సూర్యరశ్మి ద్వారా పొందాల్సిందే తప్ప మాత్రల ద్వారా కాదని ఆ అధ్యయనంలో స్పష్టమయ్యింది. ఆహార పానీయాల్లో ప్రత్యేకించి పాల ఉత్పత్తుల ద్వారా కలిగే ఈ ప్రయోజనం చాలా ఎక్కువ. ముఖ్యంగా పాలు, కూరగాయలు, పండ్లు, చిక్కుడు ధాన్యాల్లాంటివి ప్రకృతి సహజమైన క్యాల్షియానికి పెద్ద నిధుల్లాంటివి. ఇక విటమిన్ డి కోసమైతే, సూర్యరశ్మి పడే చోట గడపడాన్ని మించిన మార్గమే లేదని అధ్యయనకారులు చెప్పారు.



ఆహారపు అలవాట్ల కారణంగా కొన్ని సార్లు నోటి నుంచి దుర్వాసన వస్తుంటుంది..! దీంతో ఎవరికీ దగ్గరగా వెళ్లలేని ఇబ్బంది కలుగుతుందా? నోట్లో మూలమూలలో దాక్కున్న బ్యాక్టీరియా ఇందుకు కారణం కావచ్చు. ఈ ఇబ్బంది నుంచి బయటపడాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందే..

దుర్వాసనను అరికడదాం

ప్రతి రోజూ ఉదయం, రాత్రి రెండు పూటలా బ్రష్ చేసుకోవాలి.

* టంగ్ క్లీనర్ తప్పనిసరిగా వాడాలి. నాలుకపై పేరుకుపోయిన పాచి నుంచే బ్యాక్టీరియా తయారై నోటి దుర్వాసన కారణమవుతుంది.
* ఆహారం తీసుకున్న వెంటనే నోటిని శుభ్రం చేసుకోవాలి. పళ్ల మధ్యలో ఇరుక్కున్న ఆహార పదార్థాల్ని జాగ్రత్తగా తొలగించుకోవాలి.
* ఎక్కువ సేపు మాట్లాడకుండా ఉంటే నోరు డ్రైగా అయిపోయి దుర్వాసన వస్తుంటుంది. ఇలాంటప్పుడు తరచూ గుక్కెడు నీళ్లు తాగుతూ ఉండాలి. అప్పుడప్పుడు నీటిని పుక్కిలిస్తుండాలి.
* దంతస్రావం వల్ల కూడా నోటి దుర్వాసన వస్తుంది. దంతాలు ఇన్‌ఫెక్షన్లకు గురైతే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే దంత వైద్యుడ్ని సంప్రదించాలి. లేనిపక్షంలో బ్యాక్టీరియా గొంతులోకి, ఊపిరితిత్తుల్లోకి చేరే ప్రమాదం ఉంది.మద్యపానం, ధూమపానం దంతక్షయానికి కారణం అవుతాయి. చిగుళ్ల బలహీనపడటం వల్ల కూడా నోటి నుంచి దుర్వాసన వస్తుంటుంది. అందుకే ఈ అలవాట్లకు దూరంగా ఉండాలి. టీ, కాఫీలు అతిగా సేవించడం వల్ల కూడా ఈ ఇబ్బంది ఎదురవుతుంది. దంతాల పటుత్వంతోనే నోటి దుర్వాసనను అరికట్ట వచ్చు. పోషకాహారం తీసుకోవాలి. డైట్‌లో ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఆరునెలలకు ఒకసారి దంత వైద్యుడ్ని సంప్రదించడం మరచిపోవద్దు.

వృద్ధాప్యంలోనూ ఫిట్‌గా ఉండేలా..!

వయసు పై బడిన వాళ్లకి ఎలాంటి జబ్బులు లేకుండా.. ఇతరుల మీద ఆధారపడకుండా హాయిగా జీవించాలని అందరూ కోరుకుంటారు. కానీ దీనికి ముందు నుంచే సిద్ధం కావాలనే సంగతిని మాత్రం అంతగా పట్టించుకోరు. కానీ ఇదెంతో అవసరం. ఎక్కువగా ఆలోచిస్తూ తద్వారా కుంగుబాటులోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది.. దీంతో ఉన్నట్టుండి మరణానికి చేరువ చేసే గుండెజబ్బుల విషయంలో మరింత జాగ్రత్తలా ఉండాలి అని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. మధ్యవయసులో శారీరక సామర్థ్యం మెరుగ్గా ఉన్నవారికి వృద్ధాప్యంలో కుంగుబాటు, గుండెజబ్బు మరణాల ముప్పులు తగ్గుతున్నాయని చెబుతున్నాయి. సాధారణంగా వృద్ధుల్లో గుండెజబ్బులు, కుంగుబాటు ఎక్కువ. గుండె రక్తనాళాల సమస్యలు.. ముఖ్యంగా పక్షవాతం బాధితుల్లో కుంగుబాటు మరింత ఎక్కువగానూ కనబడుతుంటుంది. అంతేకాదు.. గుండెజబ్బు బాధితులకు డిప్రెషన్ మరింత ఎక్కువగా పరిణమిస్తుంది. ఇలా మధ్యవయసులో శారీరక సామర్థ్యం ద్వారా వచ్చే ప్రయోజనాలపై శాస్త్రవేత్తలు ఇటీవల ఒక అధ్యయనం చేశారు. సగటున 50 ఏళ్ల వయసువారిని ఎంచుకొని సుదీర్ఘ కాలం పరిశీలించారు. మధ్య వయసులో శారీరక సామర్థ్యం స్థిరంగా ఉన్నవారిలో గుండెజబ్బు, కుంగుబాటు గణనీయంగా తగ్గుతున్నట్టు తేలింది. ఒకవేళ కుంగుబాటు బారినపడ్డా కూడా గుండెజబ్బు మరణాలు తగ్గుముఖం పడటం విశేషం. ఇలాటి జబ్బుల విషయంలో జన్యువుల వంటి వాటిని మనం మార్చలేం గానీ శారీరక సామర్థ్యాన్ని పెంపొందించుకోవటమన్నది మన చేతుల్లోని పనే. కాబట్టి ఆలస్యం చేయకుండా వ్యాయామం, శారీరక శ్రమలపై దృష్టి సారించటం మంచిది.




కంటికి చేటు.. ఐలాషెస్



కళ్లు అందంగా, పెద్దగా కనిపించేందుకు మార్కెట్‌లో దొరికే నాసిరకం ఐలాషెస్ ఉపయోగిస్తుంటారు చాలామంది. దీంతో అందంగా కనిపించడమేమో గానీ, కంటికి కలిగే నష్టమే ఎక్కువ అంటున్నారు శాస్త్రవేత్తలు. సర్వేంద్రియానాంనయనం ప్రధానం అన్నారు పెద్దలు. అంత ముఖ్యమైన కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిందిపోయి... వాటికి విరుద్ధంగా ఏవేవో ఐలాషెస్ వినియోగించటంతో నష్టం కలుగుతుందని చెబుతున్నారు నిపుణులు. అదెలాగంటే... కనురెప్పల వెంట్రుకలు పొడవుగా ఉండడం వల్ల ఎక్కువగా గాలి, దుమ్ము కంటిలోకి చేరి కళ్లు పొడిబారిపోతాయి. మనుషుల నుంచి జిరాఫీల వరకు మొత్తం 22 క్షీరద జాతుల మీద పరిశోధన చేసిన తర్వాత ఈ విషయాన్ని వెల్లడైంది. కళ్లలో దుమ్ము పడకుండా ఉండేందుకు, కార్నియా మీద తేమ ఆవిరైపోకుండా కాపాడేందుకు కనురెప్పల మీద ఉన్న వెంట్రుకలే రక్షణగా నిలుస్తాయి. ఈ వెంట్రుకలు కంటి వెడల్పులో 1/3 వంతు ఉంటాయి. ఇంతకంటే పొడవుగా ఉన్నా, తక్కువ పొడవు ఉన్నా కంటి చుట్టూ గాలి ప్రసారం ఎక్కువగా జరుగుతుంది. దుమ్ము కణాలు కంట్లో పడతాయి. అలాగే కనురెప్పల వెంట్రుకలు ఉండాల్సినదానికంటే ఎక్కువ పొడవు ఉంటే కనురెప్పల వెంట్రుకలు సిలిండర్‌లా మారిపోయి గాలి, దుమ్ము కణాలు కళ్లలోకి నేరుగా వెళ్తాయి. దానివల్ల కంటిలో తేమ త్వరగా ఆవిరైపోతుంది. అందుకనే పొడవుగా అందంగా కనిపించే కనురెప్పల వెంట్రుకలు కంటి ఆరోగ్యానికి అంత మంచిది కాదు. చూసేందుకు అందంగా కనిపించే వీటివల్ల కంటి ఆరోగ్యం పాడవుతుందంటున్నారు పరిశోధకులు.

ఆముదంతో...



* ఆముదపు గింజల పొట్టు తీసివేసి మెత్తగా నూరాలి. అందులోంచి చెంచా ముద్దను ఒక గ్లాసు ఆవు పాలతో వేడిచేసి సేవిస్తే, నరాల నొప్పి, సయాటికా నొప్పి తగ్గిపోతాయి.
* ఒక చెంచా ఆముదాన్ని, 50 మి.లీ శొంఠి కషాయంతో కలిపి సేవించినా ఈ కీళ్లనొప్పులు, సయాటికా నొప్పి నుంచి బయటపడవచ్చు.
* 6 గ్రాముల ఆముదపు వేరు పొడిని రోజుకు రెండు సార్లు సేవిస్తే మెడనొప్పి, నడుము నొప్పి తగ్గుతాయి.
* ఓ నాలుగైదు ఆముదపు చిగుళ్లను ఒక వెల్లుల్లితో కలిపి నూరి ఆ ముద్దను రోజుకు రెండు సార్లు సేవిస్తే పచ్చకామెర్లు తగ్గుతాయి అయితే దీనికి తోడు ఉప్పులేకుండా ఉడికించిన మినుప కుడుమును కూడా ఆహారంగా తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.
* త్రిఫలా కషాయంలో కాస్తంత ఆముదం వేసి తాగుతూ ఉంటే అర్శమొలల వ్యాధి తగ్గుతుంది.

ఆరోగ్యానికి బిరియానీ ఆకు




బిరియానీ ఆకు వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి. అల్సర్లు, గ్యాస్ట్రిక్ సమస్య వంటి జీర్ణ సంబంధమైన వ్యాధులను దరి చేరనీయదు. మధుమేహం నియంత్రణలో ఉండానికి బిరియానీ ఆకు బాగా ఉపయోగపడుతుంది. మధుమేహుల్లో రక్తంలోని చక్కెర స్థాయి నియంత్రణకు, గుండె ఆరోగ్యానికి ఇది సహాయపడుతుంది. ప్రతిరోజూ రాత్రి కొద్దిగా బిరియానీ ఆకును నీళ్లలో కలుపుకొని తాగితే నిద్ర బాగా పడుతుంది. బిరియానీ ఆకు వేసి మరిగించిన నీళ్లు తాగడం వల్ల రాళ్లు ఏర్పడడం, ఇతర కిడ్నీ సంబంధ వ్యాధులు రావు. దీనిలో క్యాన్సర్ నిరోధక కారకాలు ఉన్నాయి. అందువల్ల దీన్ని తీసుకోవడం వల్ల శరీరంలో క్యాన్సర్ కారకాల ఉత్పత్తిని తగ్గించడానికి ఉపయోగపడుతుంది. ఇన్ని ఉపయోగాలు ఉన్నాయి కాబట్టి మసాలా దినుసులు ఎక్కువగా ఉండే బిర్యానీలో దీన్ని వాడుతుంటారు. తద్వారా మసాలా ఎక్కువవడం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలకు చెక్ చెప్పొచ్చట.



నుమాయిష్‌లో ఎల్‌ఐసి స్టాల్


ప్రారంభించిన ఎల్‌ఐసి రీజినల్ మేనేజర్ ఎం.జగన్నాథ్

మన తెలంగాణ/ హైదరాబాద్: ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ 2019(నుమాయిష్)లో ఎల్‌ఐసి స్టాల్‌ను ఏర్పాటు చేసింది. ఎల్‌ఐసి(లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్) రీజినల్ మేనేజర్(మార్కెటింగ్) ఎం.జగన్నాథ్ ఈ స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నుమాయిష్ హైదరాబాద్ సంస్కృతి, సంప్రదాయానికి కూడా ఒక ప్రదర్శన లాంటిందని అన్నారు. ఎగ్జిబిషన్ సమయంలో అధికారులు అంతా వచ్చి స్టాల్‌ను సందర్శించాలని, పనితీరును గమనించాలన్నారు. అలాగే సందర్శకులకు సేవలందించాలని, కుటుంబాల్లో ఎల్‌ఐసి, ఆరోగ్య బీమా పట్ల అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ డివిజనల్ మేనేజర్ ఉతుప్ జోసెఫ్, రీజినల్ మేనేజర్ ఎస్.లలిత, పలు బ్రాంచ్‌ల నుంచి ఉద్యోగులు, ఏజెంట్లు వచ్చారు.



స్టాక్ మార్కెట్

ఈ రోజు మార్కెట్ ముగింపు		మార్పు	%
సెన్సెక్స్	35,980.93	130.77	(0.36%)
నిఫ్టీ	10,802.15	30.35	(0.28%)



కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	69.84
యూరో	79.96
బ్రిటిష్ పౌండ్	89.20
ఆస్ట్రేలియన్ డాలర్	49.88
కెనెడియన్ డాలర్	52.60
సింగపూర్ డాలర్	51.13
స్విస్ ఫ్రాంక్	71.20
చైనీస్ యువాన్	10.10
మలేషియన్ రింగిట్	16.88
న్యూజిలాండ్ డాలర్	46.85
హాంకాంగ్ డాలర్	8.86
జపనీస్ యెన్	0.64
కువైట్ దినార్	228.93
సౌతాఫ్రికన్ రాండ్	4.98

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	30370	32481.28	0.23%
ముంబై	31280	33454.55	0%
ఢిల్లీ	31000	33155.08	0.49%
కోల్‌కతా	31450	33636.36	0.16%
కేరళ	29600	31657.75	0.51%
బెంగళూరు	29820	31893.05	0.47%
హైదరాబాద్	30370	32481.28	0.23%
గల్ఫ్	137.68	147.25	1.38%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 42637.00
ముంబై	₹ 42637.00
ఢిల్లీ	₹ 42637.00
కోల్‌కతా	₹ 42637.00
హైదరాబాద్	₹ 42637.00



డిజిటల్ పేమెంట్స్ ప్యానెల్ చైర్మన్‌గా నిలేకని



నియమించిన ఆర్‌బిఐ

న్యూఢిల్లీ: ఆధార్ కార్డు రూపకర్త, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నిలేకని మరోసారి కీలక ప్రభుత్వ సేవలకు సిద్ధమయ్యారు. భారత్‌లో డిజిటల్ పేమెంట్ల నిర్ణయాల కోసం ఉన్నతస్థాయి కమిటీ చైర్మన్‌గా నిలేకనీని ఆర్‌బిఐ నియమించింది. ఐదుగురు సభ్యులతో ఆర్‌బిఐ ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీకి నిలేకని నేతృత్వం వహిస్తారు. దేశంలో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం, ఆర్‌బిఐ పెద్ద ఎత్తున చర్యలు చేపడుతున్నాయి. నోట్ల రద్దు అనంతరం ప్రజల్లో నగదు వాడకం తగ్గించి, డిజిటల్ చెల్లింపులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. డిజిటల్ వాలెట్లు, మొబైల్ బ్యాంకింగ్ సహా పలు రకాలుగా డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం, ఆర్‌బిఐ చొరవ చూపుతోంది. ఈ కమిటీలో ఇతర సభ్యులుగా ఆర్‌బిఐ మాజీ డిప్యూటీ గవర్నర్ హెచ్ ఆర్ ఖాన్, విజయా బ్యాంక్ మాజీ సిఎండి కిషోర్ సన్సి, సమాచార సాంకేతిక, స్టీల్ మంత్రిత్వశాఖ మాజీ కార్యదర్శి అరుణ శర్మ, ఐఐఎం అహ్మదాబాద్ సిఐఐఇ ఇన్నోవేషన్ ఆఫీసర్ సంజయ్ జైన్‌లు ఉన్నారు. ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన నందన్ నిలేకని యుపిఎ ప్రభుత్వం హయాంలో ఆధార్ అమలును పర్యవేక్షించే యుఐడిఎఐకి చైర్మన్‌గా వ్యవహరించారు. ఆధార్‌ను ప్రారంభించిన తర్వాత అది ఎంతటి ప్రాధాన్యత పొందిందో తెలిసిందే.



ఐఎంఎఫ్‌లోకి గీతా గోపీనాథ్ ఎంట్రీ

తొలి మహిళా చీఫ్ ఎకనమిస్ట్‌గా బాధ్యతలు

వాషింగ్టన్ : అమెరికాలో స్థిరపడిన భారత్ సంతతికి చెందిన ఆర్థికవేత్త గీతా గోపీనాథ్(47) అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) సంస్థలో చీఫ్ ఎకనమిస్ట్‌గా నియమితులయ్యారు. అంతర్జాతీయ సంస్థ ఐఎంఎఫ్‌లో కీలక పదవి పొందిన తొలి మహిళ ఆమె.. భారత్‌లోని కర్ణాటకకు చెందిన గీతా గోపీనాథ్ హార్వర్డ్ యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఐఎంఎఫ్ పరిశోధన విభాగం డైరెక్టర్‌గా పనిచేసిన మౌరీ ఆప్స్టెఫెల్ డిసెంబరు 31 పదవీ విరమణ పొందారు. ఆయన పదవీ విరమణ తర్వాత గీతకు చీఫ్ ఎకనమిస్ట్‌గా పదవి దక్కింది. తనకు ఈ పదవి దక్కడం చాలా అరుదైన గౌరవంగా భావిస్తున్నానని గీతా గోపీనాథ్ ఆనందం వ్యక్తంచేశారు. ప్రస్తుతం ప్రపంచీకరణ నుంచి వెనక్కి తగ్గడం, సుంకాలు పెంపు పెద్ద సవాళ్లుగా మారాయని, బహుళజాతి సంస్థలకు ఇబ్బందులు పెరిగాయని గీత వెల్లడించారు. గీతా గోపీనాథ్ ఐఎంఎఫ్‌కు 11వ చీఫ్ ఎకనమిస్ట్‌గా వచ్చారు. కాగా గత ఏడాది అక్టోబరు 1న గీతా గోపీనాథ్‌ను ఐఎంఎఫ్ చీఫ్ ఎకనమిస్ట్‌గా నియమించనున్నట్టు ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టీన్ లగార్డే ప్రకటించారు. ఆమె ప్రపంచంలోని అత్యుత్తమ ఆర్థికవేత్తల్లో ఒకరని ప్రశంసించారు. ఆమె సేవలు ఎంతో ఉపయోగపడతాయని లగార్డె అన్నారు.

బైబ్యాక్‌ను పరిశీలించనున్న ఇన్ఫీ బోర్డు

బెంగళూరు : సాఫ్ట్‌వేర్ దిగ్గజం ఇన్ఫోసిస్ ఈనెల 11న బోర్డు సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్టు తెలుస్తోంది. మూలధన కేటాయింపు విధానంలో భాగంగా వాటాదారులకు షేర్ బైబ్యాక్, ప్రత్యేక డివిడెండ్‌ను బోర్డు సమావేశంలో పరిశీలించనున్నట్టు మంగళవారం ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో కంపెనీ పేర్కొంది. గతేడాది ఏప్రిల్‌లో మూలధన కేటాయింపు విధానాన్ని వాటాదారులు అంగీకరించగా, ఇన్ఫోసిస్ ఈ ప్లాన్‌లో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి రూ.10,400 కోట్లు వాటాదారులకు అందివ్వనుంది.

మరో ఉన్నతాధికారి గుడ్‌బై

ఇన్ఫోసిస్ నుంచి మరో సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైదొలిగారు. ఇన్ఫోసిస్ ఎనర్జీ, యుటిలిటీస్, రిసోర్సెస్ అండ్ సర్వీసెస్ యూనిట్ గ్లోబల్ హెడ్ సుదీప్ సింగ్ రాజీనామా చేశారు. రెండు దశాబ్దాలుగా కంపెనీలో పనిచేస్తున్న సుదీప్ తాజాగా తన బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. ఆయన రాజీనామాకు గల కారణాలను వెల్లడించలేదు. గతేడాది ఇన్ఫోసిస్ చాలా మంది కీలక ఉద్యోగులను కోల్పోయింది. సుదీప్ కంటే ముందు గతేడాది అక్టోబరులో ఇన్ఫీ కన్సల్టింగ్ గ్లోబల్ హెడ్ కెన్ టూంబ్స్ రాజీనామా చేశారు. అంతకు ముందు ఆగస్టులో కంపెనీలో కీలక ఎగ్జిక్యూటివ్ అయిన ఎండీ రంగనాథ్ కూడా సీఎఫ్‌వో పదవి నుంచి తప్పుకొన్నారు.



తీవ్ర హెచ్చుతగ్గులు.. ఆఖరికి లాభాలు

ముంబై: దేశీ స్టాక్‌మార్కెట్లు మంగళవారం అత్యంత ఒడిదుడుకులకు లోనయ్యాయి. అయినప్పటికీ ఆఖరికి లాభాలతో ముగిశాయి. మార్కెట్ ముగిసే సరికి సెన్సెక్స్ 131 పాయింట్లు పెరిగి 35,981 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 30 పాయింట్లు లాభపడి 10,802 వద్ద ముగిసింది. మిడ్‌సెషన్ నుంచీ కొనుగోళ్లు పెరగడంతో సెన్సెక్స్ ఇంట్రాడేలో సాంకేతికంగా కీలకమైన 36,000 పాయింట్ల మైలురాయిని మరోసారి అధిగమించింది. అమెరికా, చైనా మధ్య వాణిజ్య వివాద పరిష్కారం దిశగా చర్చలు ప్రారంభమైన నేపథ్యంలో యూరోపియన్ స్టాక్ మార్కెట్లు హుషారుగా ప్రారంభమయ్యాయి. దీంతో దేశీయంగా సెంటిమెంటు మెరుగుపడినట్లు నిపుణులు పేర్కొన్నారు. ఎన్ఎస్ఇలో పిఎస్‌యు బ్యాంక్స్ 3 శాతం పెరగ్గా, ఫార్మా 1.5 శాతం లాభపడింది. ప్రధానంగా సన్ ఫార్మా, ఐసిఐసిఐ, ఎస్‌బిఐ, టాటా మోటార్స్, యస్ బ్యాంక్, యాక్సిస్, ఐబి హౌసింగ్, గ్రాసిమ్, బజాజ్ ఆటో, జెఎస్‌డబ్ల్యు స్టీల్ 4 నుంచి 1 శాతం మధ్య పుంజుకున్నాయి. బిఎస్ఇ మిడ్ క్యాప్ 0.2 శాతం నీరసించగా, స్మాల్ క్యాప్ అదేస్థాయిలో బలపడింది. ట్రేడైన మొత్తం షేర్లలో 1,264 లాభపడగా, 1,369 నష్టాలతో ముగిశాయి. సోమవారం విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పిఐలు) రూ.736 కోట్లకుపైగా విలువైన స్టాక్స్ కొనుగోలు చేశారు. దేశీ ఫండ్స్(డిఐఐలు) రూ. 142 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి.

ఏడో ఎడిషన్ హైదరాబాద్ ప్రాపర్టీ షో-2019



ఫిబ్రవరి 15 నుంచి 17 వరకు • ప్రకటించిన క్రెడాయ్

మన తెలంగాణ/ హైదరాబాద్: ఏడో ఎడిషన్ హైదరాబాద్ ప్రాపర్టీ షో–2019ను నిర్వహిస్తున్నట్టు క్రెడాయ్ ప్రకటించింది. ఈమేరకు దేశంలో ప్రైవేటు రియల్ ఎస్టేట్ డెవలపర్స్‌తో కూడిన అపెక్స్ బాడీ క్రెడాయ్(కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) మంగళవారం వెల్లడించింది. జిహెచ్‌ఎంసి కమిషనర్ ఐఎఎస్ దానకిషోర్‌తో పాటుగా క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షులు ఎస్ రామ్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ పి రామకృష్ణా రెడ్డి, ట్రెజరర్ కె రాజేశ్వర్, క్రెడాయ్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు ఆదిత్యగౌర, జి ఆనంద్ రెడ్డి, డాక్టర్ ఎంఎస్ ఆనంద్‌రావు, మురళీకృష్ణా రెడ్డి, జాయింట్ సెక్రటరీలు వి రాజేశ్వర్ రెడ్డి, సిజి మురళీ మోహన్‌లతో కూడిన క్రెడాయ్ నాయకత్వ బృందం, తదితరులు కర్టెన్ రైజర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణలో తమ ఇంటి కలను నెరవేర్చుకోవడంతో పాటు అత్యంత వేగంగా వృద్ధిని సాధిస్తున్న హైదరాబాద్ నగరంలో పెట్టుబడి పెట్టాలనుకునే వారికి ఈ క్రెడాయ్ ప్రాపర్టీ షో 2019 ఎంతో ప్రధానమైన వేదిక కానుంది. వచ్చే నెల ఫిబ్రవరి 15 నుంచి 17 వరకు మూడు రోజులపాటు నిర్వహించే ప్రాపర్టీ షో హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరుగనుంది. ఓ షోతో నగరవ్యాప్తంగా డెవలపర్ సభ్యులు, మెటీరియల్ వెండార్లు, బిల్డింగ్ మెటీరియల్ మానుఫ్యాక్చరర్స్, కన్సల్టెంట్లు, ఫైనాన్స్ సంస్థలు ఓ వేదికపైకి రానున్నాయి. ఈ ప్రాపర్టీ షోను లక్ష మంది వరకు సందర్శిస్తారని అంచనా వేస్తున్నారు. డెవలపర్లు, ఫైనాన్స్ సంస్థలు, తయారీ రంగాల నుంచి 100కు పైగా ప్రతినిధులు ఈ షోలో పాల్గొనున్నారు. క్రెడాయ్ ప్రెసిడెంట్ ఎస్ రామ్‌రెడ్డి మాట్లాడుతూ, ఫిబ్రవరి 15 నుంచి 17 వరకు ఈ ప్రాపర్టీ షో ఉంటుందన్నారు. సిఎం కెసిఆర్ మళ్లీ అధికారం చేపట్టడంతో విధాన నిర్ణయాలు కొనసాగుతాయని అన్నారు.

ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీగా అమెజాన్



వాషింగ్టన్: అమెజాన్ సంస్థ మార్కెట్ విలువను పెంచుకోవడంతో ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా అవతరించింది. గత సోమవారం గ్లోబల్ మార్కెట్లు ముగిసే సమయానికి అమెజాన్ మార్కెట్ క్యాపిటలైజేషన్(మార్కెట్ విలువ) 796.8 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 56 లక్షల కోట్లు)కు చేరింది. దీంతో ప్రపంచంలోనే అత్యంత విలువ కలిగిన కంపెనీగా అమెజాన్ నిలిచింది. దీంతో మైక్రోసాఫ్ట్, ఇతర సంస్థలను అమెజాన్ వెనక్కి నెట్టింది. మైక్రోసాఫ్ట్ కన్నా అమెజాన్ మార్కెట్ విలువ 13.2 బిలియన్ డాలర్లు ఎక్కువగా ఉంది. జెఫ్ బెజోస్ నేతృత్వంలోని అమెజాన్ రిటైల్ రంగం, ఆన్‌లైన్ సేవలతో అగ్రపథంలో నిలిచింది.2013లో అమెజాన్ రెవిన్యూ 74.5 బిలియన్ డాలర్లు కాగా, 2018 చివరి నాటికి కంపెనీ ఆదాయం 177.6 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరం చివరినాటికి అది 232.2 బిలియన్ డాలర్లుగా ఉండొచ్చని అంచనా.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం%
సన్‌ఫార్మా	449.00	432.35	448.05	430.80	17.25	4.00
ఐసిఐసిఐ బ్యాంక్	381.80	366.60	380.15	367.70	12.45	3.39
ఎస్‌బిఐ	306.00	294.75	305.30	296.30	9.00	3.04
యస్ బ్యాంక్	193.20	185.00	192.35	187.15	5.20	2.78
టాటా మోటర్స్	180.50	176.10	179.95	175.35	4.60	2.62
ఇండియాబుల్స్	819.00	780.50	812.55	793.90	18.65	2.35
యాక్సిస్ బ్యాంక్	653.75	630.60	650.90	637.45	13.45	2.11
గ్రాసిమ్	839.45	811.30	836.60	820.65	15.95	1.94
భారతీ ఇన్‌ఫ్రాటెల్	300.40	290.00	297.95	293.75	4.20	1.43
జెఎస్‌డబ్ల్యూ స్టీల్	295.85	288.10	293.90	289.85	4.05	1.40

హైదరాబాద్ రియల్టీ ఎంతో ఆకర్షణీయం

- విక్రయాల్లో 9 శాతం వార్షిక వృద్ధి
- నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక



మన తెలంగాణ/ హైదరాబాద్: జిఎస్‌టి, రెరా చట్టంతో రియల్ ఎస్టేట్ మందగించిందని, అయితే క్రమంగా పుంజుకోనుందని నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక పేర్కొంది. ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్ భిన్నమైనదని, ఇక్కడ స్థిరత్వం ఉందని, వచ్చే ఆరు నెలల్లో చాలా లాంచ్‌లు ఉన్నాయని మీడియా సమావేశంలో సంస్థ ప్రతినిధి తెలిపారు. హైదరాబాద్ రియల్టీ ఎంతో ఆకర్షణీయంగా ఉందని, మెట్రో రైలుతో రియల్ ఎస్టేట్‌లో పురోగతి ఉందని, అయితే హైటెక్ సిటీ వరకు మెట్రో వస్తే మరింత ప్రభావం ఉంటుందని అన్నారు. సోమవారం నైట్ ఫ్రాంక్ ఇండియా దేశీయ రియల్ ఎస్టేట్ అర్ధవార్షిక నివేదిక 10వ ఎడిషన్ ఆవిష్కరణ సందర్భంగా ఈ విషయాలను వెల్లడించారు. 2018 జూలై నుంచి డిసెంబర్ వరకు ఎనిమిది నగరాల్లో గృహ, ఏడు నగరాల్లో కార్యాలయాలకు సంబంధించి మార్కెట్‌పై ఈ నివేదికలో సమగ్ర విశ్లేషణను అందించారు.

హైదరాబాద్‌లో నిలకడగా వృద్ధి

2017తో పోలిస్తే 2018 ద్వితీయార్థంలో హైదరాబాద్‌లో విక్రయాల ట్రెండ్ 15 శాతంతో సానుకూల వృద్ధిని సాధించింది. ఈ కాలంలో అమ్ముడుపోయిన మొత్తం యూనిట్లు 7,278గా ఉన్నాయి. 2018 పూర్తి సంవత్సరంలో 15,591 యూనిట్లు సేల్ కాగా, గతేడాదితో పోలిస్తే వార్షిక వృద్ధి 9 శాతంగా ఉంది. ఇతర మార్కెట్లతో పోలిస్తే హైదరాబాద్ మార్కెట్ దిగువ ముఖంగానే ఉన్నా, నిలకడగా వృద్ధిని సాధిస్తోంది. చాలా కాలం ఆలస్యం తర్వాత రెరా చట్టాన్ని తెలంగాణ రియల్ ఎస్టేట్‌లో అమలైంది. 2018 సెప్టెంబర్‌లో రెరా వచ్చిన తర్వాత కొత్త లాంచింగ్‌లు తగ్గిపోయాయి. పశ్చిమ హైదరాబాద్‌లో 84 శాతం లాంచ్‌లతో అతిపెద్ద మార్కెట్‌గా కొనసాగింది. నివాస రియల్టీ అమ్మకాలు 2017తో పోలిస్తే 2018లో 6 శాతం వృద్ధిని సాధించాయి. దేశవ్యాప్తంగా నివాస రియల్టీ అమ్మకాలు 242,328 యూనిట్లుగా అంచనా వేశారు. నివేదిక ప్రకారం 2018లో కొత్త నివాస యూనిట్ లాంచ్‌లు ముంబైలో(38,390 యూనిట్లు), పుణె(18,580 యూనిట్లు), బెంగళూరు (11,830 యూనిట్లు)గా ఉన్నాయి. ముంబై మార్కెట్ 220 శాతంతో అత్యధిక వార్షిక వృద్ధిని చూపగా, అదే సమయంలో పుణె 157 శాతంగా ఉంది. ముంబైలో ధరలు 7 శాతం క్షీణించగా, హైదరాబాద్‌లో 7 శాతం పెరిగాయి.

2018 సంవత్సరం బెస్ట్

నైట్ ఫ్రాంక్ ఇండియా దేశీయ రియల్ ఎస్టేట్ అర్ధవార్షిక నివేదికను 2018 జూలై నుంచి డిసెంబర్ వరకు అధ్యయనాలతో రూపొందించారు. ఎనిమిది నగరాల్లో గృహ, ఏడు నగరాల్లో కార్యాలయాలకు సంబంధించి మార్కెట్‌పై ఈ నివేదికలో సమగ్ర విశ్లేషణను అందించారు.

నేను సాధించలేనేమో అనుకున్న విషయాల్లో విజయం సాధించేశాను. మన జీవితాలకు మనమే రాజు అనుకున్నప్పుడు మనకు నచ్చింది చేసు-కుంటూ పోవాలి. ప్రతి సినిమా నాకు కూతురితో సమానం. కూతురి పెళ్లిని ఎంతో ఖర్చుపెట్టి ఘనంగా చేస్తారు. అలాంటప్పుడు సినిమాలకు ఎందుకు ఖర్చు చేయకూడదు.

-బాలీవుడ్ స్టార్ షారుఖ్ ఖాన్



'ఎఫ్2' ట్రైలర్ విడుదల కార్యక్రమంలో వెంకటేశ్, వరుణ్‌తేజ్, తమన్నా, మెహరీన్, దిల్‌రాజు, అనిల్ రావిపూడి తదితరులు

సంక్రాంతికి పర్‌ఫెక్ట్ ఫ్యామిలీ ఫన్ మూవీ

వెంకటేశ్, వరుణ్‌తేజ్ హీరోలుగా తమన్నా, మెహరీన్ హీరోయిన్లుగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు నిర్మిస్తున్న చిత్రం 'ఎఫ్2'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా ఈనెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో జరిగిన కార్యక్రమంలో ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ ''ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, మల్లీశ్వరి, నువ్వు నాకు నచ్చావ్ తర్వాత నేను చేసిన పూర్తి కామెడీ ఎంటర్‌టైనర్ ఇది. చాలా గ్యాప్ తర్వాత ఇలాంటి మూవీ చేశాను. నేను కామెడీతో మెప్పిస్తాని నమ్మి దిల్‌రాజు, అనిల్ నా వద్దకు రావడంతో 'ఎఫ్2' సినిమా చేశాను. వరుణ్ చక్కగా నటించాడు. ప్రేక్షకులు తప్పకుండా ఈ సినిమాను ఎంజాయ్ చేస్తారు. సంక్రాంతికి పర్‌ఫెక్ట్ ఫ్యామిలీ ఫన్ మూవీ ఇది''అని అన్నారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ ''ఇప్పటివరకు డిఫరెంట్ జోనర్‌లో సినిమాలు చేస్తూ వచ్చాను. ఈ క్రమంలో కామెడీ సినిమాలు కూడా చేయాలనుకున్నాను. నా కెరీర్‌లో ఎంత కామెడీ చేయాలనుకున్నానో దాన్ని అంతా అనిల్ ఒక సినిమాలో చేయించేశాడు. ఇలాంటి మంచి సినిమా చేయడం, ఇలాంటి మంచి పాత్ర చేయడం ఆనందంగా ఉంది. వెంకటేశ్ కామెడీ అంటే ఇరగదీస్తారు. ఆయనతో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను''అని తెలిపారు. దిల్‌రాజు మాట్లాడుతూ ''రాజా ది గ్రేట్ సినిమా తర్వాత ఏ సినిమా చేద్దామని అనుకున్నప్పుడు అనిల్ ఈ సినిమా ఐడియా చెప్పాడు. అప్పటి నుండి 15 నెలల పాటు ఈ జర్నీని ఎంజాయ్ చేస్తూ వచ్చాం. అనీల్‌తో ఇది నా మూడో సినిమా. ఇక సినిమాలో వెంకటేశ్, వరుణ్, తమన్నా, మెహరీన్ సహా ప్రతి క్యారెక్టర్‌లో ఎంటర్‌టైన్‌మెంట్ కనపడుతుంది. థియేటర్‌లో 2 గంటల 26 నిమిషాలు ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు''అని చెప్పారు. తమన్నా మాట్లాడుతూ ''ఇంత మంచి సినిమాలో నన్ను భాగం చేసినందుకు దిల్‌రాజుకు థాంక్స్. ఈ చిత్రంలో నిజజీవిత పరిస్థితుల ఆధారంగా కామెడీ ఉంటుంది. వెంకటేష్ చాలా సంవత్సరాలుగా నన్ను ఇన్‌స్పైర్ చేస్తున్నారు. ఆయన ఇంకా ఫ్రెష్‌గా, ముద్దుగా ఎలా కనపడుతున్నారో నాకు తెలియడం లేదు. వరుణ్‌కు నేను పెద్ద ఫ్యాన్‌ని. హనీ క్యారెక్టర్‌లో మెహరీన్‌ను తప్ప మరొకరిని ఊహించుకోలేను. తను పాత్రలో అంత బాగా ఒదిగిపోయింది'' అని పేర్కొన్నారు. మెహరీన్ మాట్లాడుతూ ''దర్శకుడు అనిల్ రావిపూడి నాలో నుండి మంచి నటనను రాబట్టుకున్నారు. వెంకటేశ్, వరుణ్, తమన్నాతో కలిసి స్క్రీన్‌షేర్ చేసుకోవడం ఆనందంగా ఉంది. ఈ సినిమా కోసం తెలుగులో తొలిసారి డబ్బింగ్ చెప్పాను. ఇందులో ఫన్ మాత్రమే ఉంటుంది. ఫ్రస్టేషన్ ఉండదు''అని అన్నారు.

అన్ని జోనర్లలో చేయాలనుకుంటున్నా



రామ్‌చరణ్

రామ్‌చరణ్ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'వినయ విధేయ రామ'. బ్లాక్ బస్టర్ హిట్ మూవీ'రంగస్థలం' తర్వాత చరణ్ నటించిన చిత్రమిది. డివివి ఎంటర్‌టైన్ మెంట్స్ బ్యానర్‌పై డి.వి.వి.దానయ్య నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతి పండుగ కానుకగా ఈనెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా రామ్‌చరణ్‌తో ఇంటర్వ్యూ విశేషాలు...

ప్రతి ఇంట్లో ఉండాలనుకునే..

ఈ సినిమాలో రామ్ పాత్రలో నటించాను. ప్రతి ఇంట్లో ఇలాంటి వాడు ఒకడు ఉండాలి అనుకునే పాత్ర నాది. రాముడి తరహాలో వినయంగా ఉంటూ అవసరమైతే విధ్వంసం కూడా సృష్టించే పాత్రలో నటించాను.

తొందరగా ప్రారంభించాం...

'రంగస్థలం' షూటింగ్ అయిపోయాక 25 రోజుల గ్యాప్ తర్వాత ఈ చిత్రం షూటింగ్ మొదలుపెట్టాను. దర్శకుడు బోయపాటికి ఉన్న కమిట్‌మెంట్స్, నా కమిట్‌మెంట్స్ వల్ల సినిమా షూటింగ్‌ను తొందరగా ప్రారంభించాం. అయితే నాకు ఇంకా సమయం ఉంటే బాగుండేది అనిపించింది. అయితే దర్శకుడికి ఉన్న క్లారిటీ వల్ల నాకు ఈ పాత్ర చేయడం పెద్ద కష్టమేమి అనిపించలేదు.

అన్ని జోనర్లలో చేయాలనుకుంటా...

ఒక నటుడిగా ఒక జోనర్‌కే పరిమితం కాకుండా అన్ని జోనర్లలో సినిమాలు చేయాలని కోరుకుంటాను.

నాన్న (చిరంజీవి) కూడా అన్ని జోనర్లలో సినిమాలు చేశారు. ఇక జోనర్ కంటే ఒక మంచి సినిమా చేయాలనుకున్నాను. అందుకే ఈ సినిమాను అంగీకరించాను.

ఇష్టంగా పనిచేస్తున్నా...

భారీ మల్టీస్టారర్ 'ఆర్‌ఆర్‌ఆర్'లో రాజమౌళి నా కోసం డీ గ్లామరైజ్డ్ పాత్రను సృష్టించారు. ఈ పాత్ర ప్రేక్షకులకు చాలా బాగా కనెక్ట్ అవుతుంది. ఎంతో ఇష్టంగా ఈ సినిమాకు పనిచేస్తున్నాను. ఈ సంవత్సరం మొత్తం ఈ సినిమాకే కేటాయించాను.

ఆనందంగా ఉంది...

ఎన్టీఆర్ నాకు మంచి స్నేహితుడు. ఎప్పటి నుండో మేమిద్దరం కలిసి సినిమా చేయాలనుకున్నాం. ఆ కోరిక ఈ చిత్రంతో నెరవేరుతోంది. ఇక 'ఆర్‌ఆర్‌ఆర్'లో మా ఇద్దరి కాంబినేషన్‌లో సీన్లు చాలా బాగా వస్తున్నాయి. ఎన్టీఆర్‌తో కలిసి పనిచేస్తుండడంతో ఆనందంగా ఉంది.

ఆ బ్యానర్ నాన్న కోసమే...

కొణిదెల ప్రొడక్షన్స్ బ్యానర్ కేవలం నాన్న సినిమాల కోసం మాత్రమే పెట్టాను. అందులో నేను హీరోగా కూడా సినిమాలు చేయను. నాకు చాలా మంచి నిర్మాతలు ఉన్నారు. ప్రస్తుతానికైతే ఇతర హీరోలతో సినిమాలను నిర్మించాలనే ఆలోచన లేదు.

ఆ రెండు చిత్రాలు మా బ్యానర్‌లోనే...

కొణిదెల ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నాన్నతో నిర్మిస్తున్న 'సైరా' చిత్రం షూటింగ్ రెండు నెలల్లో పూర్తవుతుంది. ఆతర్వాత పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలను పూర్తిచేసి దసరా సీజన్‌లో సినిమాను విడుదల చేయాలని అనుకుంటున్నాం. ఈ చిత్రం తర్వాత కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా, త్రివిక్రమ్ దర్శకత్వంలో మరో సినిమాను నాన్న చేస్తారు. ఈ రెండు చిత్రాలు మా బ్యానర్‌లోనే ఉంటాయి.



నాని

'చంటబ్బాయ్' తరహాలో..

క్రికెటర్ అవతారంలో 'జెర్సీ' సినిమా చేస్తున్నారు హీరో నాని. ఈ సినిమా టాకీపార్ట్ పూర్తయిపోయింది. మార్చిలో విడుదలకు సిద్ధమవుతోంది ఈ చిత్రం. ఇదిలాఉండగా విక్రమ్ కె.కుమార్ దర్శకత్వంలో నాని ఓ సినిమా ఓకే చేసిన సంగతి తెలిసిందే. ఈ సినిమా థ్రిల్లర్ జోనర్‌లో ఉంటుందని తెలిసింది. సినిమా సినిమాకు డిఫరెంట్ జోనర్ ఎంచుకుంటారు హీరో నాని. దర్శకుడు విక్రమ్ కుమార్‌ది కూడా ఇదే స్టయిల్. అందుకే ఇప్పుడు ఇద్దరు కలిసి ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ జోనర్‌ను ఎంచుకున్నట్టు తెలిసింది. ఒక విధంగా చెప్పాలంటే గతంలో మెగాస్టార్ చిరంజీవి చేసిన 'చంటబ్బాయ్' మాదిరిగా ఈ సినిమా ఉంటుందని తెలిసింది. ఈ సినిమా కథనాన్ని ఆసక్తికరంగా తయారుచేశాడు విక్రమ్ కుమార్. పైగా ఆయన సినిమాల్లో కామెడీ టచ్ కూడా బాగానే ఉంటుంది. ఇప్పుడు ఈ రెండూ కలిపి నానీతో థ్రిల్లర్ సినిమా చేస్తాడట విక్రమ్ కుమార్.

మెగాస్టార్ అల్లుడికి జోడీగా...


మెగాస్టార్ చిరంజీవి చిన్నల్లుడు కళ్యాణ్‌దేవ్ హీరోగా ఇప్పటికే ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. గత ఏడాది 'విజేత' సినిమాతో హీరోగా పరిచయమైనా ఆ సినిమా ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. దీంతో కాస్త గ్యాప్ తీసుకొని కళ్యాణ్‌దేవ్ ప్రస్తుతం పులివాసు దర్శకత్వంలో తన రెండో సినిమాలో నటించేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ సినిమా రిజ్వాన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కనుంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఈ సినిమాలో కళ్యాణ్‌దేవ్ సరసన బాలీవుడ్ బ్యూటీ రియా చక్రవర్తిని హీరోయిన్‌గా ఫైనల్ చేశారట. హిందీలో హాఫ్ గర్ల్ ఫ్రెండ్, బ్యాంక్ చోర్, జిలేబి చిత్రాల్లో నటించింది ఈ బ్యూటీ. తెలుగులో 'తూనీగా తూనీగా' అనే సినిమాలో కూడా నటించింది. ఇప్పుడు కళ్యాణ్ దేవ్ సినిమా ద్వారా తెలుగులో మరో సినిమాలో నటించబోతోంది.



రియా చక్రవర్తి

మళ్లీ మొదలు పెట్టారు

'బాహుబలి' విజయం తర్వాత రానా దగ్గుబాటి కొత్త సినిమాలకు సైన్ చేసే విషయంలో జోరు చూపిస్తున్నారు. ప్రస్తుతం మల్టిపుల్ ప్రాజెక్టుల మీద పని చేస్తూ బిజీబిజీగా ఉంటున్నారు. 'నేనే రాజు నేనే మంత్రి' తర్వాత ప్రభు సాల్మన్ దర్శకత్వంలో రానా 'హాథి మేరె సాథీ' అనే సినిమా చేస్తున్నారు. ఈ బహుభాషా చిత్రం షూటింగ్ ఎక్కువ భాగం పూర్తయింది. ఈ సినిమాలోని కీలకమైన ఎపిసోడ్లను థాయ్‌లాండ్‌లోని దట్టమైన అడవుల్లో చిత్రీకరించారు. కానీ ఈ సినిమా పూర్తి చేయకముందే ఎన్టీఆర్ బయోపిక్‌లో నారా చంద్రబాబు నాయుడి పాత్ర పోషించడానికి రానా గ్రీన్ సిగ్నల్ ఇచ్చి 'హాథి మేరె సాథీ' షూటింగ్‌కు గ్యాప్ ఇచ్చారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా షూటింగ్‌ను మళ్లీ మొదలు పెట్టారట. కేరళలో ఈ సినిమా కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించారని తెలిసింది. ఈ షెడ్యూల్‌లోనే సినిమా షూటింగ్‌ను అంతా పూర్తిచేస్తారని సమాచారం. ఒక ఏనుగుకు, రానా పాత్రకు మధ్య ఉండే అనుబంధం నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమాలో జోయా హుస్సేన్, పుల్కిత్ సామ్రాట్, విష్ణు విశాల్, కల్కి కొచ్లిన్‌లు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



రానా

పూజాకు లక్కీ ఆఫర్



పూజాహెగ్డే

అల్లుఅర్జున్ చిత్రం 'డీజే'లో గ్లామరస్‌గా కనిపించి యూత్‌ను అలరించిన ముద్దుగుమ్మ పూజాహెగ్డే. ఈ చిత్రం తర్వాత లక్కీబ్యూటీగా పేరు తెచ్చుకుంది ఈ భామ. ఆతర్వాత ఎన్టీఆర్‌తో 'అరవింద సమేత' చిత్రంతో పాటు బెల్లంకొండ శ్రీనివాస్‌తో 'కవచం' సినిమాలో నటించింది. ప్రస్తుతం పూజా హెగ్డే రెండు సినిమాల్లో నటిస్తోంది. అయితే ఒక పెద్ద సినిమాలో నటించే అవకాశం తనకు దక్కిందని చెప్పింది పూజాహెగ్డే. కానీ ఆ సినిమా వివరాలను మాత్రం వెల్లడించలేదు. దీంతో ఆమె అల్లుఅర్జున్‌త్రివిక్రమ్ మూవీకి ఓకే అయ్యిందనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ విషయంపై క్లారిటీ రావాల్సి ఉంది. తెలుగులో స్టార్ హీరోయిన్ల జాబితాలో ఉన్న పూజాహెగ్డే రాబోయే రోజుల్లో బాలీవుడ్‌కు పరిమితమయ్యేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఆమెకు వచ్చిన ఓ బిగ్ ఆఫర్‌తో బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా మారిపోవడం ఖాయమంటున్నారు. బాలీవుడ్ క్రేజీ డైరెక్టర్ రోహిత్ శెట్టి నుండి ఆమెకు ఈ ఆఫర్ వచ్చింది. కమర్షియల్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ అయిన రోహిత్ ఇటీవలే 'సింబా' సినిమాతో భారీ విజయాన్ని దక్కించుకున్నాడు. ఈ దర్శకుడు తన తదుపరి చిత్రాన్ని అక్షయ్‌కుమార్‌తో చేయబోతున్నాడు. ఈ చిత్రంలో అక్షయ్‌కు జోడీగా పూజా హెగ్డేను ఎంపిక చేసినట్లుగా తెలిసింది. ఈ సినిమా సూపర్ హిట్ అయితే పూజాహెగ్డే బాలీవుడ్‌లో బిజీ అవుతుందని అంటున్నారు.





మాధవరావు–I (క్రీ.శ.1761–73)

- గొప్ప పీష్వాలలో చివరివాడు.
- మాధవరావు –I కు సోదరుడు రఘునాథరావులకు ఆధిపత్యపోరు బయలుదేరింది.
- మాధవరావు –I కు మద్దతిచ్చిన సైనిక నాయకుడు – నానాఫడ్నావీస్‌జ

5. నారాయణరావు – I (క్రీ.శ.1773 ––74)
6. రఘోబా /రఘునాథరావు – I (క్రీ.శ.1774 – 75)
7. మాధవరావు – II (క్రీ.శ.1775 – 95)
8. బాజీరావు – II (క్రీ.శ. 1795 – 1818)

- పీష్వా పదవిని రద్దు చేసిన గవర్నర్ జనరల్ లార్డ్‌మార్క్వెస్ హేస్టింగ్స్.

1వ ఆంగ్లో -మరాఠా యుద్ధం–I (క్రీ.శ.1775–82)

- గవర్నర్ జనరల్ – వారన్‌హేస్టింగ్స్.
- మాధవరావు –I మరణానంతరం నారాయణరావు పీష్వా కాగా అతన్ని హత్య చేసి రఘునాథరావు పీష్వాగా ప్రకటించుకున్నాడు.
- నారాయణరావు మరణించిన కొంతకాలానికి 2వ మాధవరావు (తల్లి గంగాబాయి) జన్మించగా అతన్ని పీష్వాగా ప్రకటించాలని మరాఠా మేధావులైన నానాపడ్నావీస్, (బాలాజీ జనార్దన్) మహద్ది సింధియాలు పేర్కొని యుద్ధం ప్రకటించారు.
- దీనికి భయపడిన రఘోభా / రఘునాథరావు బాంబే బ్రిటీష్ ప్రభుత్వం సహాయంను కోరుతూ 1775లో సూరత్ ఒప్పందంపై సంతకం చేశాడు.
- సూరత్ ఒప్పందం వారన్ హేస్టింగ్స్‌కు తెలియకుండా జరగడంతో దీనిని తిరస్కరించి నానాపడ్నివీస్‌తో 1776లో పురందర్ ఒప్పందంను చేసుకున్నాడు. పురందర్ ఒప్పందం ప్రకారం బ్రిటీష్ వారు రఘోబాకు సహాయం చేయరు.
- బ్రిటీష్ బాంబే ప్రభుత్వం సూరత్, పురందర్ ఒప్పందాలను లండన్‌కు పంపగా బ్రిటన్ ప్రభుత్వం సూరత్ ఒప్పందాన్ని సమర్థించింది.
- 1778 నానాపడ్నావీస్ బ్రిటీష్ కూటమిని తెలగామ్ యుద్ధంలో ఓడించి ''వడగాం'' ఒప్పందం కుదుర్చుకున్నాడు.
- వారన్ హేస్టింగ్స్ ఈ ఒప్పందంను తిరస్కరించి మరాఠాపైకి జనరల్ గుడార్డ్‌ను పంపించాడు.
- 1782నాటికి ఎవరూ గెలవలేని స్థితిలో సాల్బే / సాల్బాయ్ ఒప్పందంలో మొదటి ఆంగ్లో మరాఠా యుద్ధం ముగిసింది.
- సాల్బే ఒడంబడిక ప్రకారం సాల్‌సెట్టి బ్రిటీష్ వారికి ఇవ్వబడింది.

2వ ఆంగ్లో–మరాఠా యుద్ధం –I (క్రీ.శ.1802 –05)

- గవర్నర్ జనరల్ – వెల్లస్లీ
- బాజీరావు – I కాలంలోనే మరాఠాలు అనేక సర్దారులుగా విడిపోయారు.
- పూణె – పీష్వాలు 2) నాగపూర్ – బోంస్లే 3) గ్వాలియర్ – సింధియాలు, 4) బరోడా – గైక్వాడ్‌లు 5) ఇండోర్ – హోల్కార్స్.
- 1802లో జస్వంతరావు హోల్కార్ (ఇండోర్‌పాలకుడు) పీష్వా 2వ బాజీరావు పూణె వద్ద ఓడించాడు.
- దీంతో 2వ బాజీరావు బ్రిటీష్ సహాయం కోరుతూ బస్సైన్ ఒడంబడిక చేసుకోవడంతో 2వ మరాఠా యుద్ధం ప్రారంభమైంది.
- వెల్లస్లీ తన సోదరుడైన సర్‌ఆర్థర్ వెల్లస్లీ, లేక్ అనే అనే ఇద్దరు సైనిక జనరల్స్‌ను మరాఠాలపైకి పంపారు.
- 1803 జనరల లేక్ గ్వాలియర్‌పై దాడి చేసి వారితో సుర్జీ అర్జున్‌గాం ఒప్పందం కుదుర్చుకొని జైపూర్ (పింక్‌సిటి), జోధ్‌పూర్, గోహద్‌కోటను, గంగా–యుమనాల మధ్య గల భూభాగంను పొందాడు.
- వీరిద్దరూ కలిసి జస్వంతరావు హోల్కర్‌పై దాడి చేయగా భరత్‌పూర్ రాజు సహకారంతో వారి దాడులు అణచివేశాడు.
- 1805 నాటికి ఎవరూ గెలిచే పరిస్థితి లేకపోవడంతో రాజ్‌ఘాట్ ఒప్పందం ప్రకారం 2వ మరాఠా యుద్ధం ముగిసింది.

సింధ్ ఆక్రమణ ఎప్పుడు?

3వ ఆంగ్లో–మరాఠా యుద్ధం (క్రీ.శ.1817–18)

- గవర్నర్ జనరల్ – లార్డ్ మార్క్వస్ హేస్టింగ్స్ కాగా పీష్వా – 2వ బాజీరావు. సైనిక జనరల్ – మాల్కోన్.
- రెండవ బాజీరావు బస్సైన్ సంధిని అతిక్రమించాడని నేరారోపణ చేసి 1817 పూణే ఒప్పందంను బ్రిటీష్‌వారు కుదుర్చుకున్నారు.
- దీని ప్రకారం 2వ బాజీరావు మరాఠా కూటమిలో చేరకుండుటయే కాక కొత్త కూటమి ఏర్పాటుకు కూడా ప్రయత్నం చేయరాదు. అహ్మద్‌నగర్‌ను బ్రిటీష్ వారికే శాశ్వతంగా ఇవ్వాలి.
- 1817లో 2వ బాజీరావు బ్రిటీష్ వారి చేతిలో కీలుబొమ్మగా మారానని భావించి వారిపై దాడి చేసి ఖిర్కీ వద్ద ఓడిపోయాడు.
- 1817లో హోల్కర్స్ (రెండవ మల్హర్‌రావు) మహాదేవ్‌పూర్ యుద్ధంలో ఓడిపోయారు.
- 1818 హోల్కర్స్ మాండసోర్ ఒప్పందంను బ్రిటీష్ వారితో కుదుర్చుకోవడంతో 3వ మరాఠాయుద్ధం అంతమైంది.
- 1818లో మాండసోర్ ఒప్పందం ప్రకారం లార్డ్‌హేస్టింగ్ పీష్వా పదవిని రద్దు చేస్తూ మరాఠాను బ్రిటీష్ రాజ్యంలో కలిపి 2వ బాజీరావుకు (కాన్పూర్ దగ్గర గల బీతూర్) 8 లక్షలు పెన్షన్ ఇచ్చాడు.
- మరాఠా ప్రతిష్ఠను కాపాడుటకై సతారా అనే ఒక చిన్న రాజ్యం ఏర్పాటు చేయబడి శివాజీ సంతతికి చెందిన ప్రతాప్‌సిన్హా అప్పగించబడింది.
- 1818లో డల్హౌసి– రాజ్యసంక్రమణసిద్ధాంతం ప్రకారం తొలిసారిగా ఆక్రమించిన ప్రాంతం సతరా (మరాఠా చివరి పాలకుడు) – 2వ షాజీ.

సింధ్ ఆక్రమణ 1843

- గవర్నర్ జనరల్ – ఎలెన్‌బరో
- బెలుచిస్తాన్‌కు చెందిన తల్పూర అనే తెగవారు సింధ్‌ను అనేక ప్రాంతాలుగా విభజించి ఒక్కొక్క ప్రాంతాన్ని ఒక్కొక్క గిరిజన నాయకుడు పాలించేవాడు వారిని అమీర్‌లు అనేవారు.
- 1839 సింధ్ అమీర్‌లు బ్రిటీష్ వారితో సైన్య సహకార ఒప్పందంను కుదుర్చుకున్నాడు.
- 1843 రష్యా భారతదేశంపై సింధూ మీదుగా దాడిచేసే అవకాశం ఉందని భావించి ఎలిన్‌బరో సైనిక జనరల్ అయిన చార్లెస్ నేపియర్‌ను సింధ్ ఆక్రమణకు పంపాడు.(లాగర్ధమ్‌నుకనుగొన్నది–జాన్‌నేపియర్)
- చార్లెస్ నేపియర్ (I haveSind)అనే సందేశంను ఎలిన్‌బరోకు పంపాడు.

పంజాబ్ ఆక్రమణ/ ఆంగ్లో–సిక్కు యుద్ధాలు

- మధ్యయుగంలో పంజాబ్ లో వర్థిల్లిన భక్తి ఉద్యమకారుడు –గురునానక్.
- 15వ శతాబ్దంలో గురునానక్ బోధనల ఆధారంగా రూపుదిద్దుకున్న నూతన మతం – సిక్కుమతం
- సిక్కు అనగా పంజాబీ / గురుముఖి లిపి భాషలో శిష్యుడు అని అర్థం.
- సిక్కు మతంలో పదిమంది గురువులు కలరు.
- తొలి గురువు గురునానక్ కాగా, చివరి గురువు గురుగోవింద్ సింగ్.
- ఇతని తరువాత ఆదిగ్రంథ్/గురుగ్రంథ్ సాహిబ్ అనే సిక్కుల పవిత్ర గ్రంథం 1708 అక్టోబర్ 7 గురువుగా కొనసాగింది.

గురునానక్ (క్రీ.శ.1469–1538)

- సిక్కు మత స్థాపకుడైన గురునానక్ 1469లో పంజాబ్ (పాక్)లోని తల్వండి అనే గ్రామంలో యెహతా కాలు (తండ్రి), మాతా త్రిప్తా (తల్లి) అనే దంపతులకు జన్మించాడు.
- గురునానక్ ప్రారంభంలో పంజాబ్ గవర్నర్ దౌలత్‌ఖాన్ లోడీ ఆస్థానంలో అకౌంటెంట్‌గా పనిచేశాడు.
- 1507 ఆగస్టు 20న గురువుగా మారాడు.
- గురునానక్ సిలోన్, చైనా, టిబెట్, మక్కాలను సందర్శించాడు.
- గురునానక్ బోధనలకు ప్రధాన కేంద్రం – కర్తార్‌పూర్.
- ప్రధాన శిష్యుడు – మదన్ కాగా, సంగీత వాయిద్యం పేరు – రబాబ్.
- మతం మాటలలో లేదని, మానవులందరినీ సమానంగా చూసినవాడే మతపరుడు, భక్తుడు అని గురునానక్ పేర్కొన్నాడు.
- గురునానక్ 1538లో మరణించాడు. ఇతని సమాది రావి నది ఒడ్డున కలదు.

ఎస్ లక్ష్మీనారాయణ
డైరెక్టర్, రామయ్య
కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్
దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్,
8885555202

గురు అంగద్ (క్రీ.శ. 1538–1552)

- 1504లో బాబాఫైరూ (తండ్రి), మాతారాయో (తల్లి) అనే దంపతులకు జన్మించాడు.
- గురునానక్ తన వారసుడిగా గురు అంగద్‌ను ప్రకటించాడు.
- గురు అంగద్ గురువైన సంవత్సరము 1539 సెప్టెంబర్ 7.
- సిక్కు లిపి అయిన గురుముఖి లిపి (పంజాబీ భాషను) రూపొందించాడు.
- పంజాబ్‌లో వర్గవైషమ్యాలను, కులవ్యవస్థను రూపుమాపుటకు 'లంగర్' అనే వంటశాలను ఏర్పాటు చేశాడు.
- హుమాయున్‌కు సమకాలికుడు.
- సిక్కులు ముస్లింల పవిత్ర ప్రదేశాలను సందర్శించడంను నిషేధించాడు.

గురు అమర్‌దాస్ (క్రీ.శ.1552–1574)

- సిక్కుల మూడవ గురువు.
- 1479లో తేజ్‌బ్యాన్‌భల్లా (తండ్రి), భక్తకౌర్ (తల్లి) అనే దంపతులకు జన్నించాడు.
- గురు అమర్‌దాస్ గురువైన సంవత్సరం 1552 మార్చి 26.
- మొదట్లో విష్ణ భక్తుడు. మంజీ, పిరి అనే రెండు పద్ధతులను పురుష మరియు స్త్రీల కోసం ప్రవేశపెట్టాడు.
- సిక్కులకు ఆధ్యాత్మిక పరంగా 22 సూత్రాలను రూపొందించి, సతీసహగమనం, పరదా పద్ధతి, మత్తుపానియాలు సేవించడాన్ని ఖండించాడు.
- సిక్కులు హోలి, దీపావళి మరియు బైసాకి వేడుకలను ఘనంగా జరుపుకొనుటకు మార్గదర్శకాలను రూపొందించాడు.
- సిక్కు గురువుల జయంతి, వర్ధంతిలను వేడుకగా జరుపుకునే ఆచారంను ప్రవేశపెట్టాడు.

గురు రామదాస్ (క్రీ.శ.1574–1581)

- సిక్కుల నాలుగవ గురువు గురు రామదాస్.
- 1534లో బాబాహరిదాస్ (తండ్రి), మాతాదయాకౌర్‌జీ (తల్లి) అనే దంపతులకు లహోర్ సమీపాన గల చూనామండీలో జన్మించాడు.
- రామదాస్ గురువైన సంవత్సరము 1574 సెప్టెంబర్ 1.
- అమర్‌దాస్ అల్లుడైన రామదాస్ అక్బర్‌కు సమకాలికుడు.
- రామదాస్‌పుర (ప్రస్తుత అమృత్‌సర్) అనే పట్టణాన్ని నిర్మించాడు. సిక్కుల పవిత్ర దేవాలయ / గురుద్వార నిర్మాణం (స్వర్ణ దేవాలయం) కొరకు అక్బర్ నుండి భూమిని దానంగా పొందాడు.

గురు అర్జున్‌దేవ్‌సింగ్ (క్రీ.శ.1581–1606)

- సిక్కుల ఐదవ మరియు గురువులందరికెల్లా గొప్పవాడు గురు అర్జున్‌దేవ్‌సింగ్ .
- 1563లో రామదాస్ (తండ్రి), మాతాభానీ (తల్లి) అనే దంపతులకు గోవింద్‌వాల్ సాహెబ్ అనే ప్రాంతంలో జన్మించాడు.

మారని చట్టాలు... ఆగని ప్రమాదాలు



16 ఏళ్లుగా సవరణకు నోచుకోని మోటారు వాహన చట్టం

రహదారుల్లో ఇంజినీరింగ్ లోపాలతోనే ప్రమాదాలు

ప్రధాన దారుల్లో సాఫ్ట్‌లైన్ల ఏర్పాటులో నిర్లక్ష్యం

మన తెలంగాణ/ హైదరాబాద్ : రోడ్డు ప్రమాద ఘటనలు నిత్యం చోటుచేసుకుంటున్నా కేంద్ర ప్రభుత్వం మోటారు వాహనచట్ట సవరణ విషయంలో 16 సంవత్సరాలుగా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏడాదికి సగటు 50 ప్రమాదాలు చోటు చేసుకున్న రహదారులను (ప్రాంతాలను) బ్లాక్ స్పాట్లుగా గుర్తించడంలో రోడ్ సేఫ్టీ అధికారులు విఫలమౌతూనే ఉన్నారు. జాతీయ రహదారులలో ఇంజినీరింగ్ లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం పలు ప్రయోగాలకు శ్రీకారం చూడుతున్నారే తప్ప వాటికి ఆచరణలో పెట్టడం లేదన్న ఆరోపణలూ లేకపోలేదు. ముఖ్యంగా భారీ వాహనాలకు, కార్లకు, లారీలకు, మినీ బస్సులకు వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లు వేయాలన్న నిబంధనలను పాటించడం లేదు. అదేవిధంగా వాహనాలకు వెనుకవైపులో రియర్ ల్యాంప్స్ తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకునే సమాలోచనలు అమలుకు నోచుకోవడం లేదు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి భారీ జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకునేలా నిబంధనలు రూపొందించినా వాహనదారుల్లో ఏమాత్రం మార్పు రాకపోవడం శోచనీయం. తెలంగాణ రాష్ట్రానికి నలువైపులా ఉన్న జాతీయ రహదారుల్లో బ్లాక్ స్పాట్స్, డార్క్ స్పాట్స్‌లను గుర్తించి యూటర్న్, అటవీ ప్రాంతాలలో డ్యాష్ బోర్డులు, సైన్ బోర్డుల ఏర్పాటు చేసేందుకు తెలంగాణ సర్కారు ముందడుగు వేసినా ఇతర రాష్ట్రాలలో వీటిని అమలు చేయడం లేదు. రోడ్డు ప్రమాదాల నివారణ, భద్రత విషయంలో కట్టుదిట్టమైన చర్యల్లో భాగంగా వాహనాలకు నిర్దిష్ట వేగాన్ని నిర్ణయించడం, ఆపై వేగ నియంత్రణ సూచికలను రహదారులకు ఇరువైపులా ఏర్పాటు చేసేందుకు అధికారులు పనిచేయాలని గతంలో ప్రభుత్వం ఆదేశించినా అశించిన మేరకు పనులు జరుగలేదని తెలుస్తోంది, ఈ నేపథ్యంలో జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, గ్రామీణ ప్రాంతాలలోని రోడ్లలో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు అనతికాలంలో జారీ చేయనున్నట్లు సమాచారం. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం మోటారు వాహనాల చట్టం సవరణ బిల్లును మరోసారి కేంద్రం దృష్టికి తీసుకువెళ్లేందుకు నివేదిక సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర ప్రభుత్వం రోడ్ సేఫ్టీ విభాగాన్ని సైతం బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టే అవగాహన కార్యక్రమాల కోసం కేటాయిస్తున్న నిధులను పెంచాలని కేంద్రాన్ని కోరినప్పటికీ ఏమాత్రం స్పందన రాలేదన్నది సమాచారం. ప్రస్తుతం అమలులో ఉన్న మోటారు వాహన చట్టం 1988 నాటిదన్న విషయం తెలిసిందే. ఆ కాలంలో ఉన్న వాహనాలకు అనుగుణంగా చట్టాన్ని రూపొందించారు. ఇదిలావుండగా అప్పట్లో దేశ వ్యాప్తంగా వివిధ ప్రమాదాల్లో 49వేల పైచిలుకు ఉండగా అది కాస్త నేడు 1.50లక్షలకు చేరుకుందని రికార్డులు చెబుతున్నాయి. రాష్ట్రంలో హైదరాబాద్ నుంచి నల్గొండ జిల్లా హైవేలతో పాటు ఇటు కర్నూలు, నిజామాబాద్, కరీంనగర్ హైవేలలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ప్రాంతాలలో చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో చర్చలు జరిపాలని సర్కారు ఆదేశించినా ఇంతవరకు అమలుకాకపోవడం విచారకరం. కొండగట్టు ప్రమాద ఘటనలో 63 మంది మృతి చెందిన విషయం విదితమే. ఈ ప్రమాద ఘటనతో రాష్ట్రంలోని హైవేలలో ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు తీసుకోవాల్సిన నిర్ణయాలపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తాజాగా తమిళనాడులోని పుదుకొట్టై వద్ద ఘోర రోడ్డు ప్రమాదంలో రాష్ట్రంలోని మెదక్‌కు చెందిన 10 మంది అయ్యప్ప మాల ధరించిన భక్తులు మృత్యువాత పడ్డారు. నర్సాపూర్ మండలం కాజీపేట, మంతూర్ గ్రామాలకు చెందిన 16 మంది అయ్యప్ప భక్తులు వ్యాన్‌లో ప్రయాణిస్తుండగా ఎదురుగా కంటెయినర్‌ను ఢీ కొన్న ప్రమాదంలో ఘటనాస్థలిలో ఏడుగురు మృతి చెందగా మరో ముగ్గురు క్షతగాత్రులు పుదుకొట్టై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఈక్రమంలో ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో ఆరుగురు స్థానిక ఆసుప్రతులలో చికిత్స పొందుతున్నారు. ఇదివరలో సైతం మహబూబ్‌నగర్ జిల్లాలోని కోస్గి మండలానికి చెందిన ఇద్దరు అయ్యప్ప భక్తులు ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలోని దువ్వూరు మండల పరిధిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా అదే ప్రమాదంలో నలుగురు భక్తులు గాయాలపాలయ్యారు. గతంలోనూ బోడుప్పల్‌కు చెందిన ఆరుగురు భక్తులు ఇన్నోవాలో ప్రయాణిస్తుండగా తిరుపతి సమీపంలో ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఐదుగురు గాయాలపాలయ్యారు. జాతీయ రహదారుల్లో సాఫ్ట్‌లైన్ల ఏర్పాలు విషయంలో నిర్లక్ష్యం కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాని పలువురు వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారి కూడళ్ల వద్ద సాఫ్ట్ లైన్ల ఏర్పాటుతో వాహనాల వేగాన్ని కొంతమేర నియంత్రించవచ్చు. జాతీయ రహదారుల్లో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు నిబంధనలు అడ్డువస్తుండటంతో సాఫ్ట్‌లైన్ల ఏర్పాటుపై దృష్టి సారించడలేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఒక ఇంచు ఎత్తులో సాఫ్ట్‌లైన్లను ఏర్పాటు చేయడం వల్ల వేగంగా వెళ్లే వాహనాల స్పీడును తగ్గించవచ్చని, ప్రధాన రహదారుల్లోని కూడళ్లలో 10 నుంచి 12 సాఫ్ట్‌లైన్లను ఏర్పాటు చేయడం వల్ల వాహనాలు నడిపే డ్రైవర్లు అప్రమత్తమౌతారని, దీంతో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని పలువురు వాహన చోదకులు మూకుమ్మడిగా వివరిస్తున్నారు.



సీజను కాకున్నా పెరుగుతున్న డెంగ్యూ జ్వరాలు

రాష్ట్రంలో పెరుగుతున్న మరణాలు

మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రాన్ని డెంగ్యూ జ్వరం వణికిస్తోంది. మరణాలు కూడా పెరుగుతున్నాయి. దీని నివారణకు ముందస్తు జాగ్రత్తలను వైద్యులు సలహాల ద్వారా ఇస్తూనే ఉన్నారు. ఈ వ్యాధి చికిత్సకు ప్రత్యేకమైన మందులేమీ లేవని, లక్షణాలను బట్టి చికిత్స అందించాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. మూడేళ్ల క్రితం వరకు జులై నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో డెంగ్యూ జ్వరాలు నమోదయ్యేవని, కానీ ఇప్పుడు అక్టోబర్, నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లోనూ కనిపిస్తోందని, సీజన్‌లతో సంబంధం లేకుండా ఉంటోందని వైద్యులు వ్యాఖ్యానించారు. రెండేళ్ల డెంగ్యూ కేసుల్లో సగం వరకు అన్‌సీజన్‌లోనే నమోదయ్యాయి. హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి వచ్చిన డెంగ్యూ కేసులను పరిశీలిస్తే 2017 సంవత్సరంలో గాంధీ ఆసుపత్రిలో 1200 కేసులు నమోదు కాగా, అందులో 102 కేసులు డిసెంబర్‌లోనే రికార్డు అయ్యాయి. అదే ఆసుపత్రిలో 2018లో 1104 కేసులు నమోదు కాగా, అందులో సీజన్‌లో చూస్తే, జులై నెలలో 92 కేసులు, ఆగస్టులో 115, సెప్టెంబర్‌లో 176 కేసుల చొప్పున నమోదయ్యాయి. అన్‌సీజన్‌గా పరిగణించే అక్టోబర్‌లో 210, నవంబర్‌లో 230, డిసెంబర్‌లో 77 కేసులు నమోదయినట్టు గణాంకాలు చెపుతున్నాయి. గత ఏడాదితో పోల్చితే రాష్ట్రంలో డెంగ్యూ జ్వరాలు గణనీయంగా పెరిగాయి. కేసుల సంఖ్య దాదాపు రెట్టింపయ్యింది. 2017లో రాష్ట్రంలో 3,827 కేసులు నమోదైతే, 2018లో ఏకంగా 4,592 కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్, ఖమ్మం జిల్లాల్లోనే అత్యధికంగా నమోదయ్యాయి. 2018లో ఖమ్మం జిల్లాలో 708 కేసులు నమోదుకాగా, హైదరాబాద్‌లో 596 రికార్డు అయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాలో 494 కేసులు, భద్రా ద్రి కొత్తగూడెం జిల్లాలో 400 కేసులు నమోదయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో 321, మేడ్చల్ జిల్లాలో 217, పెద్దపల్లి జిల్లాలో 271 కేసులు నమోదయ్యాయి.

డెంగీ లక్షణాలు

ఉన్నట్టుండి తీవ్ర జ్వరం, భరించలేని తలనొప్పి, కళ్లు తెరవడానికి కూడా కష్టంగా ఉండడం, శరీర కదలికల వలన నొప్పి పెరగడం, చర్మంపై దద్దుర్లు రావడం, కండరాలు, కీళ్లనొప్పులు ఉండడం, అధిక దాహం, రక్తపోటు పడిపోవడం తదితరాలన్నీ డెంగ్యూ వ్యాధి లక్షణాలుగా గుర్తించవచ్చని వైద్యులు పేర్కొన్నారు. ఈ వ్యాధి నిర్ధారణలో వైద్య పరీక్షలే కీలకమని, కేవలం ప్లేట్‌లెట్ కౌంట్, డెంగీ స్ట్రిప్ టెస్ట్, సీరమ్ టెస్ట్ వంటి వాటితో నిర్ధారించడం శాస్త్రీయం కాదని వైద్య ఆరోగ్యశాఖ వివరించింది. రక్తంలో ప్లేట్‌లెట్లు 50 వేలలోపు పడిపోతే ప్రమాదకరంగా భావించాలని, 15 వేల కన్నా తగ్గితే మరణాలు సంభవించే అవకాశం ఎక్కువ అని పేర్కొనింది. డెంగ్యూ జ్వరం వస్తే తీవ్రతను తగ్గించేందుకు చల్లని నీటిలో స్పాంజీని ముంచి శరీరాన్ని తుడవాలని, తాగడానికి ఎలక్ట్రాల్ పౌడర్, పళ్లరసాలు ఇవ్వాలని, దీనివల్ల జ్వర తీవ్రత తగ్గి ప్లేట్‌లెట్లు అదుపులోకి వస్తాయని, వీలైనంత త్వరగా వైద్యుని దగ్గరకు తీసుకెళ్లాలని వైద్య ఆరోగ్యశాఖ సూచించింది.



జనసేన, లెఫ్ట్‌పార్టీల మధ్య చర్చలు

మన తెలంగాణ/హైదరాబాద్ : జనసేన, లెఫ్ట్ పార్టీ నేతలు మంగళవారం జనసేన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఎన్నికల్లో పోటీకి దింపాల్సిన అభ్యర్థుల జాబితాపై వారి మధ్య గంటపాటు చర్చ జరిగింది. ఎక్కడెక్కడ ఏ పార్టీ అభ్యర్థులు పోటీ చేయాలన్న దానిపై ఇరుపక్షాల మధ్య ప్రాథమికంగా ఓ అవగాహన కుదిరినట్లు తెలిసింది. మొత్తం 175 నియోజకవర్గాల్లో జనసేన,వామపక్షాల నేతలు పోటీ చేయడం, అలాగే ఆయా నియోజకవర్గాల్లో క్యాడర్‌ను పెంచుకోవడం తదితర అంశాలపై చర్చలు జరిగినట్టు తెలిసింది. జనసేన నేత నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో జరిగిన చర్చలు ముగిసిన అనంతరం ఇరు పార్టీల నేతలు పవన్‌కళ్యాణ్ నివాసానికి బయలుదేరి వెళ్లారు.

టిడిపి, వైసిపిలకు సిద్ధాంతాలు లేవు

కార్యకర్తల సమావేశంలో పవన్‌కళ్యాణ్

మన తెలంగాణ/హైదరాబాద్ : సిద్ధాంతం లేకుండా కేవలం నాయకుల బలం మీద ఆధారపడి నడిచే పార్టీలు ఎక్కువ కాలం మనుగడ సాగించవని టిడిపి, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలు అందుకు ఉదాహరణ అని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. జిల్లా స్థాయి సమీక్షా సమావేశాల్లో పాల్గొన్న ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ 2019లో జరిగే ఎన్నికలు జనసేనకు మొదటి పోరాటమేనన్నారు. ఇది ఆఖరిపోరాటం కాదని ఆయన పేర్కొన్నారు. రాజకీయాల్లో ఓ స్థాయికి రావాలంటే ఒక దశాబ్ధం పాటు ఓపికగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఆసన్నమయ్యిందన్నారు. కొత్తవారు ఎంతవరకు నిలబడతారన్నది అసలు సమస్య అని ఆయన పేర్కొన్నారు. వ్యవస్థను మార్చేయాలన్న లక్ష్యంతో ముందుకు వచ్చిన వారిని ఓ క్రమ పద్ధతిలో అనుసంధానం చేసి వారిలో ఉన్న కసిని వెలికితీయాలన్నారు. అది సమాజానికి ఉపయోగపడేలా తయారు చేయాలన్నారు. 2001 నుంచే ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.

కర్నాటకలో మంత్రి టైపిస్ట్ నుంచి రూ.25.76 లక్షలు స్వాధీనం

–నలుగురు సివిల్ కాంట్రాక్టర్ల నుంచి వసూలు

బెంగళూరు: వెనుకబడిన తరగతుల శాఖ మంత్రి కార్యాలయ టైపిస్ట్ నుంచి రూ.25.76 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నలుగురు సివిల్ కాంట్రాక్టర్ల నుంచి ఈ మొత్తాన్ని వసూలు చేశారన్నారు. డిప్యూటేషన్‌పై వచ్చిన మోహన్, మంత్రి సి పుట్టరంగశెట్టి కి పర్సనల్ అసిస్టెంట్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. జనవరి4న సాయంత్రం సెక్రటరియేట్ నుంచి డబ్బులు తీసుకెళ్తుండగా మోహన్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంత్ అనే వ్యక్తి నుంచి రూ.3.6 లక్షలు తీసుకొని ఆఫీసులో పెట్టినట్లు నిందితుడు అంగీకరించారన్నారు. ఆ తర్వాత రోజు నందు అనే కాంట్రాక్టర్ నుంచి రూ.15.9 లక్షలు, శ్రీనిధి నుంచి రూ.2 లక్షలు, కృష్ణమూర్తి అనే కాంట్రాక్టర్ నుంచి 4.26 లక్షలు వసూలు చేసినట్లు నిందితుడు అంగీకరించినట్లు వారు తెలిపారు.ఈ ఘటనకు సంబంధించి మంత్రి పుట్టరంగ శెట్టి రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. విచారణలోజోక్యం చేసుకోబోనని ముఖ్యమంత్రి హెచ్‌డి కుమారస్వామి తెలిపారు. తాను బెంగళూరులో లేనప్పుడు జరిగిన వ్యవహారానికి తనకు సంబంధం లేదని పుట్టరంగశెట్టి తిరస్కరించారు. విచారణలో అన్ని విషయాలు బయట పడతాయన్నారు.

సైనిక దళాల నిధులపై కోత: కమిటీ ఆగ్రహం

న్యూఢిల్లీ: సాయుధ దళాలకు తగినన్ని కేటాయించకపోవడం పట్ల బిజెపి ఎంపి కల్‌రాజ్ మిశ్రా నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ నరేంద్ర మోడీ సారథ్యంలోని ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసింది. రక్షణ వ్యయం కోసం కాలపరిమితి లేని నిధిని సృష్టించడంలో విముఖత చూపుతున్నందుకు ఆర్థిక మంత్రిత్వశాఖను కూడా కమిటీ తప్పుపట్టింది. రక్షణ దళాల కోసం తక్కువ నిధులు కేటాయించడంలోని ఔచిత్యం ఏమిటో తమకు అర్థం కావడం లేదని కమిటీ వ్యాఖ్యానించింది. రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన నిధుల కన్నా అతి తక్కువ నిధులను బడ్జెట్‌లో కేటాయిస్తున్నారని, ఇది తప్పనిసరిగా తీర్చవలసిన వ్యయాలకు కూడా సరిపోవడం లేదని సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన నివేదికలో రక్షణ శాఖకు సంబంధించిన స్థాయీ సంఘం పేర్కొంది. 201819 ఆర్థిక సంవత్సరానికి రూ.1.72 లక్షల కోట్లను బడ్జెట్‌లో కేటాయించాలని రక్షణ శాఖ కోరగా కేవలం రూ.93,982 కోట్లను మాత్రమే ఆర్థిక శాఖ కేటాయించిందని కమిటీ తెలిపింది. 201819 సంవత్సరంలో సైన్యానికి రూ.17,756 కోట్లు, నౌకాదళానికి రూ.15,691 కోట్లు, వైమానికి దళానికి రూ. 41,924 కోట్లు తక్కువ కేటాయింపులు జరిగాయని కమిటీ వివరించింది. మిగిలిపోయిన నిధులను తిరిగి తదుపరి సంవత్సరంలో ఉపయోగించుకోవడానికి వీలుగా ఒక నిధిని ఏర్పాటు చేయాలన్ని సైనిక దళాల డిమాండును పట్టించుకోకపోవడం పట్ల ఆర్థిక శాఖపై కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. నిధుల లేమి వల్ల సైనిక స్థావరాల వద్ద భద్రతకు సంబంధించిన వనరులపై కోత విధించడం లేదా ఆధునీకరణ విషయంలో రాజీపడడం అనివార్యమవుతోందని కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది.

మైనర్ బాలికపై యువకుల అత్యాచారం

బాలిక శీలానికి వెల కట్టిన ఇటుక బట్టీల యజమానులు

పోలీసుల రాకతో బెడిసి కొట్టిన ప్రయత్నం



మన తెలంగాణ/మంచాల : పొట్టకూటి కోసం తన తల్లిదండ్రుల వెంట పని కోసం వచ్చిన ఓ మైనర్ బాలిక పై ఇద్దరు యువకులు ఎవ్వరూ లేని సమయంలో ఆ బాలిక నోరు మూసి ఆమెపై అఘాత్యానికి పాల్పడిన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మంచాల మండల పరిధిలోని బోడకొండ గ్రామానికి చెందిన టిల్లు అనే ఇటుకల బట్టి వ్యాపారికి చెందిన బట్టిలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కూలీలు గత కొన్ని రోజులుగా పని చేస్తున్నారు. అందులో ఓ బాలిక (15) తన తల్లిదండ్రులతో ఇటుకలను తయ్యారు చేసే పనిచేస్తుంది. బట్టిలో ఇటుకల లారీ పై డ్రైవర్‌గా చేస్తున్న రత్నావత్ మహేందర్(25), జాట్రోత్ శ్రీనివాస్(23)లు సోమవారం సాయంత్రం బట్టి వద్దకు వచ్చారు. వారి కన్ను ఆ బాలిక పై పడటంతో ఎవ్వరు లేని సమయంలో రాత్రి బాలిక నోరు మూసి ఆఘాయిత్యానికి పాల్పడ్డారు. బాలిక కేకలు వేయడంతో చుట్టు పక్కల కూలీలు రావడంతో ఆ యువకులు అక్కడి నుంచి పారిపోయారు.

బాలిక శీలానికి వెలం కట్టిన ఇటుకల బట్టీల యజమానులు..

ఒరిస్సా బాలిక పై బోడకొండ గ్రామానికి చెందిన యువకులు అఘాయిత్యానికి పాల్పడడంతో ఇటుకల బట్టీల వద్ద బాలిక తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. దీంతో బోడకొండ గ్రామానికి చెందిన ఇటుకల బట్టీల యజమానులు ఎట్టకేలకు బాలిక శీలానికి వెల కట్టారు. కొంత డబ్బు ఇస్తాం ఈ విషయం బయట చెప్పొద్దని వారికి నచ్చ చెప్పడానికి ప్రయత్నించారు. కాని విషయం గ్రామంలో తెలియడంతో అది కాస్త మంచాల పోలీసులకు తెలిసింది. దీంతో మంచాల సిఐ అనుదీప్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టి నిందుతులను అరెస్ట్ చేశారు.

ఇంటర్ పర్యావరణ పరీక్ష వాయిదా

మన తెలంగాణ/హైదరాబాద్ : పంచాయతీ ఎన్నికల కారణంగా ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 30వ తేదీన జరగాల్సిన పర్యావరణ విద్య పరీక్ష వాయిదా వేస్తున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఈ నెల 31న పర్యావరణ పరీక్ష నిర్వహిస్తున్నట్లు బోర్డు కార్యదర్శి ఎ.అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. నైతికత, మానవ విలువల పరీక్షను ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 28న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

దేశవ్యాప్త సమ్మెతో జనజీవనం స్తంభన

- రోడ్డెక్కిన కార్మికులు
- రైల్‌రోకో, రోడ్డురోకోలు, నిరసన ప్రదర్శనలు
- ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించిన 9 సంఘాల ఉద్యోగులు
- సమ్మెతో కేంద్రం దిగిరావాలి: కార్మిక సంఘాల నాయకులు
- బుధవారం తీవ్రరూపం దాల్చనున్న సమ్మె





మన తెలంగాణ/హైదరాబాద్, న్యూఢిల్లీ : ట్రేడ్ యూనియన్లు ఇచ్చిన దేశవ్యాప్త సమ్మెతో చాలా రాష్ట్రాల్లో జనజీవనం స్తంభించింది. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, ఏకపక్ష కార్మిక చట్టాల సంస్కరణలను నిరసిస్తూ కార్మిక సంఘాలు మంగళ, బుధవారాలు బంద్‌కు పిలుపినిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణతో పాటు ఏపిలో కూడా సమ్మెలో కార్మికసంఘాలు పాల్గొన్నారు. ప్రైవేటు కంపెనీల్లో పని చేసే కార్మికులు రోడ్డు ఎక్కడంతో ఆ కంపెనీల్లో ఉత్పత్తిని పరిశ్రమలు ఆపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆటోలతో పాటు బస్సులు అరకొరగా నడవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కొన్ని బ్యాంకులు మాత్రం యధావిధిగా పనిచేశాయి. తెలంగాణలో మొదటిరోజు 18 నుంచి 20 లక్షల మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నట్టు కార్మికసంఘాల నాయకులు తెలిపారు. మొదటి రోజు ఈ సమ్మెను విజయవంతం చేసినందుకు ఏఐటియూసి రాష్ట్ర సమితి అభినందనలు తెలిపింది. రాష్ట్రంలోని 31 జిల్లా కేంద్రాలతో పాటు డివిజన్, మండల కేంద్రాల్లోని కార్మికులు ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వ్యవసాయ కార్మికులుచ భవన నిర్మాణ రంగ కార్మికులు, బీడీ కార్మికులు, ఆటో, హమాలీ, ట్రాన్స్‌పోర్టు కార్మికులతో పాటు గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ, ఇండస్ట్రీయల్ వర్కర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, పోస్టల్ ఉద్యోగులు సమ్మెలో పాల్గొని ధర్నాలు చేపట్టారు. హెల్త్, మెడికల్ ఉద్యోగులు ఆస్పత్రుల ఎదుట ధర్నాలు నిర్వహించారు. ఏఐటియూసీ, ఐఎన్‌టియూసి, హెచ్ఎంఎస్, సిఐటియూ, ఏఐయూటిసియుసి, టిఆర్‌ఎస్‌కెవి, ఐఎఫ్‌టియు, టిఎన్‌టియుసి, ఐఎఫ్‌టియు అనుబంధ సంఘాల కార్మికులు, స్వతంత్ర ఫెడరేషన్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద 9 కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నాను నిర్వహించారు.

సమ్మెలో భాగంగా రైల్‌రోకో, రోడ్‌రోకో....

మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి 4 లేబర్ కోడ్‌లను మారుస్తోందని, కనీస వేతనాలను పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మార్చడం లేదని కార్మికసంఘాలు ఈ సందర్భంగా ఆరోపించాయి. కొన్ని రాష్ట్రాల్లో ఈ బంద్ సంపూర్ణంగా జరగ్గా, మరికొన్ని చోట్ల పాక్షికంగా జరిగింది. 10 పెద్ద ట్రేడ్ యూనియన్లు ఈ సమ్మెలో పాల్గొన్నాయి. ఆలిండియా కిసాన్ మహాసభ కూడా ట్రేడ్ యూనియన్లు సమ్మెను స్వాగతించాయి. సమ్మెలో భాగంగా రైల్‌రోకో, రోడ్‌రోకో , నిరసన ప్రదర్శనలు, ఇతర ఆందోళనలను పలు రాష్ట్రాల్లో నిర్వహించనున్నారు. పబ్లిక్ సెక్టార్, చిన్న పరిశ్రమలు, ప్రైవేటు రంగ ఉద్యోగులు, నౌకాశ్రయాల్లో పనిచేసే వారు, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాల ఉద్యోగులు బంద్‌లో పాల్గొన్నారు. చాలాచోట్ల నిత్యావసర సరుకులకు ఇబ్బందులు పడ్డారు. బుధవారం ఈ సమ్మె మరింత ఉధృతంగా చేస్తామని పలు కార్మికసంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ సమ్మెతో కేంద్రం దిగిరావాలని ఆ సంఘాల నాయకులు హెచ్చరించారు.

టైర్లకు నిప్పుపెట్టి నిరసన

ఒడిశాలో కార్మికులు రోడ్లపైకి చేరి ఆందోళన చేపట్టారు. టైర్లకు నిప్పుపెట్టి నిరసన వ్యక్తం చేశారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కత్తాలో సమ్మెకు దిగిన కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రలో బృహన్ముంబయి ఎలక్ట్రిసిటీ సప్లయ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ చేపట్టిన బంద్‌తో ముంబయి వ్యాప్తంగా బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి.

కేరళలలోనూ పలు చోట్ల కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ఢిల్లీలోనూ పలు కార్మిక సంఘాలు రోడ్లపై ఆందోళన చేపట్టాయి. మరోవైపు కార్మిక సంఘాల సమ్మెకు కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు, ప్రభుత్వ బ్యాంకుల ఉద్యోగుల సంఘాలు దేశవ్యాప్తంగా రైతులు కూడా మద్ధతు పలికారు.

కార్మికుల సమ్మెకు మద్దతుగా బ్యాంకు ఉద్యోగులు కూడా కొన్ని చోట్ల సమ్మెలో పాల్గొన్నారు. దీంతో బ్యాంకుల సేవలకు విఘాతం కలిగాయి. ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపుమేరకు బ్యాంకు ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొననున్నారు. దేశ ప్రజలకు నష్టం కలిగించేలా పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ, ప్రభుత్వ రంగ బ్యాంకులను నాశనం చేసేలా ఎఫ్‌ఆర్‌డిఐ చట్టం తదితర విధానాలను అవలంభిస్తోందని కార్మికసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

'భర్తలు ఇక్కడ ఉంటారు.. భార్యలు అక్కడ పిల్లల్ని కంటారు'

బీహారీ వలస కార్మికులపై బిజెపి ఎంఎల్‌సి వివాదాస్పద వ్యాఖ్యలు

ముంబయి: మహారాష్ట్ర బిజెపి ఎంఎల్‌సి సురేశ్ ధాస్ బీహార్‌కు చెందిన వలస కార్మికులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బీహార్‌కు చెందిన కార్మికులు మహారాష్ట్రలో నివసిస్తారని, వారి భార్యలు మాత్రం తమ సొంత రాష్ట్రంలో బిడ్డలకు జన్మనిస్తారని, వారి భర్తలు ఇక్కడ మిఠాయిలు పంచిపెడుతుంటారని సురేశ్ ధాస్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ప్రాంతాలకు అతీతంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు బిజెపి ఎంఎల్‌సి వ్యాఖ్యలను ఖండించారు. ధాస్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండు చేస్తున్నారు. దీనిపై బిజెపి నాయకుడు సంజయ్ టైగర్ మాట్లాడుతూ సురేశ్ ధాస్ వ్యాఖ్యలు ఖండనీయమే కాదు సమాజంలో చీలికలకు దారితీసేవని, ఈ వ్యాఖ్యలపై తమ పార్టీ ధాస్ నుంచి సంజాయిషీ కోరుతుందని చెప్పారు. కాగా, ఎన్‌డిఏలో భాగస్వామ్య పక్షమైన జెడియు కూడా ఈ వ్యాఖ్యలను ఖండించింది. ఇది 11 కోట్ల బీహారీలను అవమానించడమేనని, బీహార్ ప్రజల గౌరవమర్యాదలపై ఇది దాడి అని జెడియు ప్రతినిధి రాజీవ్ రంజన్ చెప్పారు. ఇదిలా ఉంటే ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్న ప్రతిపక్ష ఆర్‌జెడి బిజెపి ఎంఎల్‌సి వ్యాఖ్యలను ఖండిస్తూ ఇది బిజెపి సిద్ధాంతాలను ప్రతిబింబిస్తుందని చెప్పింది.



బరిలోకి బడా నేతలు

- పార్లమెంట్ ఎన్నికలపై కాంగ్రెస్ నజర్
- అభ్యర్థులపై ఎంపికపై కసరత్తు
- బడా నేతలను బరిలోకి దించాలని వ్యూహం
- ముందుస్తుగానే అభ్యర్థుల ప్రకటన



మన తెలంగాణ/హైదరాబాద్ : పార్లమెంట్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. ఈ ఎన్నికల్లో విజయం సాధించేందుకు అవసరమైన అన్ని రకాల వ్యూహాలకు పదునుపెడుతోంది. ఇందులో భాగంగానే ముందుగానే అభ్యర్థుల ప్రకటనపై దృష్టి సారించింది. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో చివరి నిమిషం వరకు పొత్తుల అంశం తేలకపోవడంతో అభ్యర్థుల ఎంపికలో జరిగిన ఆలస్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈసారి ముందుగానే మేల్కొనింది. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను బేరీజు వేసుకున్న ఏఐసిసి అధిష్టానం పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించేందుకు పక్కా ప్రణాళికకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాలని ఇటీవల ఆయా రాష్ట్రాల పిసిసి అధ్యక్షులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జీ కుంటియా, పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల నేతృత్వంలో మూడు రోజుల పాటు గాంధీ భవన్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి దారి తీసిన పరిస్థితులతో పాటు రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న అభ్యర్థుల వివరాలపై ఆరాతీసింది. ఈ సమీక్షా సమాశంలోనే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ముఖ్యనాయకులను లోక్‌సభ నియోజకవర్గం బరిలోకి దింపితే ఎలా ఉంటుందన్న అంశంపై కూడా చర్చకు వచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చెందిన అగ్ర నాయకుల్లో చాలా మంది ఓటమి పాలయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు, పార్లమెంట్ ఎన్నికకు తేడా ఉంటుందని పార్టీ నేతలు భావిస్తున్నారు. ప్రధాని నరేంద్రమోడీ పట్ల ప్రజల్లో తగ్గుతున్న ఆదరణ ఈసారి కాంగ్రెస్‌కు కలిసొస్తుందని బలంగా విశ్వసిస్తున్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పార్టీ ఓడిపోవడం, కాంగ్రెస్ విజయం సాధించడం ఇందుకు నిదర్శమని కొద్దిమంది నేతలు అభిప్రాయపడ్డారు. ఇవే ఫలితాలు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పునరావృతం అవుతాయన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ తెలంగాణ రాష్ట్రంలో మొదలుపెట్టారు. రాష్ట్రంలో మొత్తం 17 లోక్‌సభ నియోజకవర్గాలు ఉండగా వాటిల్లో కనీసం పదికిపైగా స్థానాలను గెలుచుకోవాలన్న పట్టుదలతో ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమిని పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా అధికార టిఆర్‌ఎస్ పార్టీపై తమ ప్రతీకారాన్ని తీర్చుకోవాలన్న కసితో ఉంది. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో ముఖ్యనేతలను బరిలో దించాలని యోచిస్తోంది. త్వరలోనే సదరు నేతలను పార్టీ హై కమాండ్ ఢిల్లీకి పిలిపించి చర్చలు జరిపే అవకాశమున్నట్లు తెలుస్తోంది. వారి నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించగానే అన్ని పార్టీల కంటే ముందుగానే అభ్యర్థులను సైతం ప్రకటించే విధంగా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద పార్లమెంట్ ఎన్నికలపై కాంగ్రెస్ అధిష్టానం ముందస్తుగానే సిద్ధమవుతోందని తెలుస్తోంది.

ప్రతి జిల్లాలో ఎన్నికల సంఘం 'స్పెషల్ సెల్'

'ఏకగ్రీవ' ఎన్నికలపై నజర్

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలోని కొన్ని పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థుల ఏకగ్రీవ ఎన్నికల వెనక బలవంతం, వత్తిడి ఉన్నట్లు వస్తున్న మీడియా కథనాలపై స్పందించిన రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రతీ జిల్లాలో ఒక 'స్పెషల్ సెల్'ను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల యంత్రాంగం ప్రతీరోజూ పత్రికల్లో, ప్రసార మాధ్యమాల్లో వస్తున్న వార్తలను పరిశీలించి వేలంపాటల ద్వారా సర్పంచ్ అభ్యర్థుల ఏకగ్రీవ ఎన్నికల జరుగుతున్నట్లు వస్తున్న కథనాలపై స్పందించి తగిన దర్యాప్తు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దర్యాప్తులో బలవంతం లేదా వత్తిడి లేదా వేలంపాట లాంటి అంశాలు ఉన్నట్లు రూఢీ అయితే జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా ఎస్‌పి, పోలీసు కమిషనర్ తదితర అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, దర్యాప్తు జరిపించాలని, బాధ్యులైనవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు కలిసి సంయుక్తంగా పరిశీలించి ఆరోపణల్లో సాక్ష్యాధారాలు ఉన్నట్లయితే జిల్లాల్లో ఎన్నికల సంఘం తరఫున ఉన్న సాధారణ పరిశీలకులకు నివేదిక మర్పించాలని స్పష్టం చేశారు. ఏదేని పంచాయతీలో సర్పంచ్ లేదా వార్డు సభ్యుడి ఎన్నిక ఏకగ్రీవమైనట్లయితే సాధారణ ఎన్నికల పరిశీలకుల అనుమతి తీసుకున్న తర్వాత మాత్రమే రిటర్నింగ్ అధికారులు 'ఏకగ్రీవం' అనే నిర్ణయాన్ని ప్రకటించాలని స్పష్టం చేశారు. ప్రతీ జిల్లాలోని ఎన్నికల పరిశీలకులు ఏకగ్రీవం అయిన అంశాలను పరిశీలించి పారదర్శకంగా అది ఉన్నట్లు సంతృప్తి చెందిన తర్వాత మాత్రమే విజేతలకు ఇచ్చే సర్టిఫికెట్లు లేదా అధికారికంగా గెలిచినట్లు చేసే ప్రకటన వెల్లడించాలని స్పష్టం చేశారు. ఒక వేళ వత్తిడి లేదా బలవంతం లేదా వేలంపాట లాంటి చర్యల ద్వారా ఏకగ్రీవం అయినట్లు రూఢీ అయితే ఆ విషయాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘానికి తెలియజేయాలని స్పష్టం చేశారు.

తొలగించిన ఓట్లు చేర్చండి

- నమోదుకు మరింత సమయం ఇవ్వండి
- సిఇఒకు వివరించిన రాజకీయ పార్టీల ప్రతినిధులు

మన తెలంగాణ/హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రజత్ కుమార్ మంగళవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా అందరి నుంచి పలు సూచనలు, సలహాలు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ భేటీలో టిఆర్‌ఎస్ తరపున ఎంఎల్‌సి శ్రీనివాస్ రెడ్డి, గట్టు రాంచంద్రరావు, కాంగ్రెస్ నుంచి మర్రి శశిధర్ రెడ్డి, టిడిపి నుంచి రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బిజెపి నుంచి ఎంఎల్‌సి రాంచంద్రారావు, ఎస్‌పి, బిఎస్‌పి, ఇతర పార్టీల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. ముఖ్యంగా అర్హులైనప్పటికీ తొలగించిన ఓటర్లను వెంటనే చేర్చాలని అన్ని పార్టీలు విజ్ఞప్తి చేశాయి. పంచాయతీ ఎన్నికలు ఉన్నందున నమోదుకు సమయం పొడిగించాలని కోరారు. ఓటర్ల నమోదుకు వినూత్న అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, మెస్సేజ్‌లు పంపాలని సులువుగా ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని పార్టీలు కోరాయి.

ఎన్నికల నిర్వహణ తీరుపై అనుమానాలు: కాంగ్రెస్



ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం ఈ నెల 25 వరకు గడువు విధించడం నామమాత్రమేనని కాంగ్రెస్ సీనియర్ నేత మర్రిశశిధర్ రెడ్డి అన్నారు. షెడ్యూల్‌ను పెంచాలని సిఇఒను కోరినట్లు తెలిపారు. పంచాయితీ విధుల్లో అధికారులు ఉంటారని, దీంతో సరైన ఓటర్ లిస్ట్ రాదన్నారు. అక్రమంగా ఓటర్లను తొలగించారని, దీనిని అధికార పార్టీ ప్రోత్సహించిందన్నారు. అధికార పార్టీ అధికార దుర్వినియోగాన్ని అడ్డుకోవాలన్నారు.ఇంటి నెంబర్ ప్రకారం ఆన్‌లైన్‌లో వెతికే అవకాశం ఇవ్వాలని కోరామని, కుట్రపూరితంగా అవకాశాన్ని తొలగించారన్నారు. ఎన్నికల నిర్వహణ తీరుపైనా కూడా అనుమానాలున్నాయన్నారు. తెలంగాణలో ఎన్నికల వస్త్రాపహరణం జరుగుతుంటే కేంద్ర ఎన్నికల సంఘం దృతరాష్టుడిలా చూస్తూ ఉండిపోయిందన్నారు.

తొలగించిన ఓటర్లను మళ్లీ చేర్చాలి : టిఆర్‌ఎస్



ఓటర్ల జాబితా నుంచి తొలగించబడిన ఓటర్లను మళ్లీ జాబితాలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని టిఆర్‌ఎస్ ప్రతినిధి బృందం కోరింది. టిఆర్‌ఎస్ ఎంఎల్‌సి శ్రీనివాస్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఒక ఇంట్లో ఒకరికి ఓటు ఉంటే మరొకరికి ఉండదు. ఓటరు కార్డు ఉన్నా జాబితాలో పేరుండదు, వీటిపై దృష్టి పెట్టాలని చెప్పినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో ఓటింగ్ తగ్గడానికి గల కారణాలను విశ్లేషించాలని సూచించామన్నారు. ఓట్ల తొలగింపుపై బిఎల్‌ఒలను బాధ్యులుగా చేయాలని, వచ్చే ఎన్నికలకు అన్ని సమస్యలను సరి చేసి జాబితాను విడుదల చేయాలని సూచించామన్నారు. కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్న తీరు పట్ల టిఆర్‌ఎస్ నేత గట్టు రాంచంద్రరావు తీవ్ర అభ్యంతరం తెలిపారు. మొహం బాగోలేదని అద్దం పగులగొట్టినట్లుగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తుందని విమర్శించారు. సిఇఒ ముందు కాంగ్రెస్ పార్టీ నేతలు ఎవరిని మాట్లాడనీయకుండా అడ్డు తగులుతుందన్నారు. పేదలు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా గణనీయంగా ఓట్లు తొలగించబడ్డాయని, దీంతో టీఆర్‌ఎస్‌కు మెజార్టీ తగ్గిందని అన్నారు.

బూత్‌ల వద్ద నమోదు : బిజెపి



పోలింగ్ బూత్‌ల వద్ద ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టాలని సిఇఒను కోరినట్లు బిజెపి ఎంఎల్‌సి రామచంద్రరావు తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓట్ల నమోదు కార్యక్రమాన్ని మరో మూడు రోజులు పొడగించాలని కోరినట్లు తెలిపారు. ఓట్లు తొలగిపోయిన వాళ్లు మళ్లీ నమోదు చేసుకోవాలన్నారు. బిజెపి ఎంఎల్‌ఎ నియోజకవర్గాల్లో ఓట్లు తొలగించారన్నారు. బోగస్ ఓట్లు నమోదు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

మద్యాన్ని, నగదును ఆపలేదు : బిఎస్‌పి

అసెంబ్లీ ఎన్నికల్లో మద్యం, డబ్బు సరఫరాను ఎన్నికల సంఘం ఆపలేదని బిఎస్‌పి నేత సిద్ధార్థ పూలే అన్నారు. ఎన్నికల నిర్వహణలో రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించలేదన్నారు. ఓట్ల తొలగింపుపై ఎన్నికలు ముగిసాక సారీ చెప్పడం రాజ్యాంగానికి మంచిది కాదన్నారు. ఎన్నికల్లో పెద్దమొత్తంలో ఖర్చు చేశారని, వారిలో ఎంత మందిని డిస్ క్వాలిఫై చేసారని అడిగామన్నారు.

అప్రజాస్వామికంగా వ్యవహరించారు: ఎన్‌సిపి



అసెంబ్లీ ఎన్నికల్లో అనేక అవకతవకలు జరిగాయని నేషనల్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) నేత సామల రవీందర్ అన్నారు. ఓటుహక్కు వినియోగించుకోలేని పరిస్థితి కల్పించారన్నారు. క్షమాపణలతో చేతులు దులుపుకోకుండా.. అక్రమాలకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. కోట్లు ఖర్చు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. పేరు, ఇంటి నెంబర్ కొడితే బూత్ చూపించే టెక్నాలజీ వినియోగించమని కోరామన్నారు. వివిప్యాట్‌లలో కొన్నిచోట్ల ప్రింట్ కాలేదని, దీనిపైనా దృష్టి సారించమని కోరామన్నారు.

ఆస్ట్రేలియాలో 2-1 తేడాతో సిరీస్ గెలిచిన భారత క్రికెట్ జట్టు ఆటగాళ్లు అపూర్వ ఘనతకు అర్హులేనని మాజీ సారథి అనిల్ కుంబ్లే అన్నాడు. కోహ్లీసేనను ప్రశంసిం చాడు. 'ఇలాంటి ఘనతను ఇంతకు ముందు సాధించలేదు. 2003-04, 2007 -08లో ఆస్ట్రేలియాలో సిరీస్ విజయానికి సమీపించాం. ఒకవేళ, కానీ అనే పదాలు వినిపిస్తూనే ఉంటాయి. ఆస్ట్రేలియాను ఓడించిన ఈ జట్టు మాత్రం ఆ ఘనతకు అర్హమైందే' అని కుంబ్లే అన్నాడు.

సమిష్టి విజయమిది

ఆసీస్ గడ్డపై చరిత్ర సృష్టించిన భారత్



మన తెలంగాణ/క్రీడా విభాగం: భారత టెస్టు క్రికెట్ చరిత్రలోనే అత్యంత అరుదైన విజయాన్ని విరాట్ కోహ్లి సేన సాధించింది. ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన నాలుగు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను టీమిండియా 2–1తో గెలిచి చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. హేమాహేమీ ఆటగాళ్లు ఉన్నప్పుడే సాధ్యం కానీ రికార్డును కోహ్లి సేన అందుకుంది. యువ ఆటగాళ్లతో కూడిన భారత జట్టు అసాధారణ ఆటతో ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్‌ను దక్కించుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించడం భారత విజయానికి ముఖ్య కారణం. బ్యాటింగ్‌లో చటేశ్వర్ పుజారా జట్టుకు వెన్నంటి నిలిచాడు. మిస్టర్ డిపెండబుల్ పేరును నిలబెట్టుకుంటూ పుజారా ఆస్ట్రేలియా సిరీస్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగి పోయాడు. పుజారా బ్యాటింగ్‌ను ఎంత పొగిడినా తక్కువే. ఒత్తిడిలోనూ అసాధారణ పోరాట పటిమను కనబరుస్తూ పుజారా ఆడిన తీరు చిరకాలం గుర్తుండిపోతోంది. నయా వాల్‌గా పేరు తెచ్చుకున్న పుజారా సిరీస్‌లో ఏకంగా మూడు సెంచరీలతో సహా 521 పరుగులు సాధించాడు. ఒక్క రెండో టెస్టులో తప్ప పుజారా మిగిలిన మూడు మ్యాచుల్లోనూ సత్తా చాటాడు. కీలక సమయాల్లో అసాధారణ బ్యాటింగ్‌తో జట్టుకు అండగా నిలిచాడు. భారత్ సిరీస్ గెలిచిందంటే పుజారా పోషించిన పాత్ర వేల కట్టలేనిదని చెప్పాలి. మరోవైపు కెప్టెన్ విరాట్ కోహ్లి కూడా నిలకడైన ఆటతో జట్టుకు అండగా ఉన్నాడు. కీలక సమయాల్లో అద్భుత బ్యాటింగ్‌తో జట్టును ఆదుకున్నాడు. కెప్టెన్‌గా జట్టును ముందుండి నడిపించడంలో కోహ్లి సఫలమయ్యాడు. బ్యాటింగ్‌లో తనకు ఎదురు లేదని కోహ్లి మరోసారి నిరూపించాడు. ఓ సెంచరీ, మరో అర్ధ సెంచరీతో సహా 282 పరుగులు సాధించాడు. ఇక, వికెట్ కీపర్ రిషబ్ పంత్ కూడా అసాధారణ ఆటతో ఆకట్టుకున్నాడు. వికెట్ల వెనకాలే కాకుండా బ్యాట్‌తోనూ రాణించాడు. సిడ్నీ టెస్టులో కళ్లు చెదిరే శతకం సాధించి ప్రకంపనలు సృష్టించాడు. కీపింగ్‌లోనూ తనకు ఎదురు లేదని నిరూపించాడు. 7 ఇన్నింగ్స్‌లలో 58.33 సగటుతో 350 పరుగులు సాధించాడు. అంతేగాక కీపింగ్‌లోనూ రాణించాడు. ఇక, కొత్త ఆటగాడు, ఓపెనర్ మయాంక్ అగర్వాల్ కూడా అద్భుత బ్యాటింగ్‌ను కనబరిచాడు. ఆడిన మూడు ఇన్నింగ్స్‌లలోనూ చెలరేగి పోయాడు. ఆస్ట్రేలియా బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ పరుగుల వరద పారించాడు. మూడు ఇన్నింగ్స్‌లలో కలిపి ఏకంగా 65 సగటుతో 195 పరుగులు చేశాడు. తొలి సిరీస్‌లోనే మయాంక్ జట్టుపై తనదైన ముద్ర



వేశాడు. వైస్ కెప్టెన్ అజింక్య రహానె కూడా బాగానే ఆడాడు. కీలక సమయాల్లో జట్టుకు అండగా నిలిచాడు. అద్భుత పోరాట పటిమతో జట్టును ఆదుకున్నాడు. అయితే గతంతో పోల్చితే రహానె బ్యాటింగ్ కాస్త గతి తప్పిందనే చెప్పాలి.

తీరు మారని రాహుల్

ఈ సిరీస్‌లో ఓపెనర్ లోకేశ్ రాహుల్ అత్యంత పేలవమైన ప్రదర్శనతో నిరాశ పరిచాడు. మూడు టెస్టుల్లో అవకాశం లభించినా ఫలితం లేకుండా పోయింది. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేక పోయాడు. మరో ఓపెనర్ మురళీ విజయ్ కూడా చెత్త బ్యాటింగ్‌తో నిరాశే మిగిల్చాడు. ఇటు మురళీ, అటు రాహుల్ ఒక్కసారి మాత్రమే జట్టుకు శుభారంభం అందించారు. మిగిలిన అన్ని సార్లు తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. రాహుల్ మాత్రం ఘోరంగా విఫలమయ్యాడనే చెప్పాలి. ఎన్ని అవకాశాలు లభించినా దాన్ని సద్వినియోగం చేసుకోలేక పోయాడు. మరోవైపు చివరి వరుస బ్యాట్స్‌మెన్ కూడా జట్టుకు అండగా నిలువడంలో విఫలమయ్యారు. మహ్మద్ షమి, ఇషాంత్, బుమ్రా, ఉమేశ్, అశ్విన్ తదితరులు జట్టుకు అండగా నిలువలేక పోయారు. వీరి వైఫల్యం జట్టును వెంటాడింది.

సత్తా చాటిన బౌలర్లు

ఇక, భారత్ సిరీస్ సాధించిందంటే అందులో బౌలర్లది కీలక పాత్ర అనే చెప్పాలి. స్పీడ్‌స్టర్ జస్‌ప్రిత్ బుమ్రా ఆకాశమే హద్దుగా చెలరేగి పోయాడు. ఏకంగా 21 వికెట్లు తీసి తనకు ఎదురులేదని నిరూపించాడు. మూడో టెస్టులో రెండు ఇన్నింగ్స్‌లలోనూ నిలకడైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. అతని అసాధారణ బౌలింగ్ వల్లే మూడో టెస్టులో భారత్‌కు విజయం వరించిందని చెప్పాలి. మరోవైపు మహ్మద్ షమి కూడా అద్భుత ప్రతిభను కనబరిచాడు. 16 వికెట్లు తీసి తనవంతు పాత్ర పోషించాడు. వెటరన్ బౌలర్ ఇషాంత్ శర్మ కూడా సత్తా చాటాడు. అతను కూడా కీలక సమయాల్లో వికెట్లు తీసి జట్టుకు అండగా నిలిచాడు. ఇషాంత్‌కు 11 వికెట్లు దక్కాయి. రవీంద్ర జడేజా, కుల్దీప్, అశ్విన్‌లు కూడా తమ స్పిన్ బౌలింగ్‌తో జట్టును ఆదుకున్నారు. ఇలా బ్యాటింగ్, బౌలింగ్‌లో సమష్టిగా రాణించడంతో భారత్‌కు ఆస్ట్రేలియా గడ్డపై చారిత్రక విజయం దక్కింది







కోహ్లీ సేనకు భారీ నజరానా

ముంబయి: ఆస్ట్రేలియాలో చరిత్ర సృష్టించిన కోహ్లసేనకు బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. ఆటగాళ్లు, సహాయక సిబ్బందికి నగదు బహుమతి ఇవ్వనుంది. దాదాపు 71 ఏళ్లకు టీమిండియా ఆస్ట్రేలియాను వారి సొంతగడ్డపైనే ఓడించి 21 తేడాతో టెస్టు సిరీస్ కైవసం చేసుకుంది. దిగ్గజ క్రికెటర్లకు సాధ్యం కాని లక్ష్యాన్ని సాధించింది. ఈ ఘనతకు నజరానా ఇవ్వాలని బీసీసీఐ పాలకుల కమిటీ నిర్ణయించింది. మ్యాచ్ ఫీజ్‌కు సమానంగా బోనస్ ఇవ్వనుంది. అంటే ఒక్కో మ్యాచ్‌కు ఫీజు రూ.15 లక్షల వరకు ఉంటుంది. నాలుగు మ్యాచ్‌లు ఆడిన వారికి రూ.60 లక్షల వరకు బహుమానం దక్కనుంది! రిజర్వు ఆటగాళ్లకు మ్యాచ్‌కు రూ.7.5 లక్షలు ఇస్తారు. కోచ్‌లకు తలో రూ.25 లక్షలు ఇవ్వనున్నారు. సహాయక సిబ్బందికి ప్రొ రేటా వేతనం లేదా ప్రొఫెషనల్ ఫీజుకు సమానంగా బోనస్ ఇస్తారు. సుప్రీం కోర్టు నియమించిన పాలకుల కమిటీ ఇందుకు ఆమోదం తెలిపింది. కంగారూలను వారి సొంతగడ్డపై ఓడించిన కోహ్లీసేనను అందరూ ప్రశంసించిన సంగతి తెలిసిందే. ఆ గడ్డపై ఇంతకు ముందెన్నడూ భారత్ టెస్టు సిరీస్ గెలవలేదు. చాలా మంది దిగ్గజాలు అక్కడ సిరీస్ గెలవాలని కలలు కన్నారు. గంగూలీ సారథ్యంలో ఒక సిరీస్ డ్రా అయింది.

పంత్ అరుదైన ఘనత

టెస్ట్ ర్యాకింగ్స్‌లో 17వ స్థానం



దుబాయ్: ఆసీస్‌తో జరిగిన చివరి టెస్టులో శతకం సాధించి ఆస్ట్రేలియాలో ఆ ఘనత సాధించిన తొలి టీమిండియా వికెట్ కీపర్‌గా రికార్డు సృష్టించిన రిషభ్ పంత్ తాజాగా అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) టెస్టు ర్యాంకింగ్స్‌లో సైతం అరుదైన ఘనతను అందుకున్నాడు. ఒక్కసారిగా 21 స్థానాలు ఎగబాకి 17 స్థానంలో నిలిచాడు. రిషభ్ పంత్ 673 రేటింగ్ పాయింట్లతో తన స్థానాన్ని మరింత మెరుగుపరుచుకున్నాడు. ఫలితంగా భారత్ తరఫున బెస్ట్ ర్యాంక్ సాధించిన స్పెషలిస్టు వికెట్ కీపర్ల జాబితాలో ఫరూఖ్ ఇంజనీర్ సరసన నిలిచాడు. 1973, జనవరిలో ఫరూఖ్ ఇంజనీర్ 17 ర్యాంకును సాధించగా, ఇప్పుడు అతని సరసన పంత్ చేరాడు. కాగా, ఈ క్రమంలోనే ఎంఎస్ ధోని అత్యుత్తమ టెస్టు ర్యాంకును పంత్ బ్రేక్ చేశాడు. ధోనీ టెస్టు కెరీర్‌లో 19వ ర్యాంకే అత్యుత్తమ ర్యాంక్ కాగా, ధోని టెస్టు కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్ పాయింట్లు 662గా ఉంది. ఇక టెస్టు నంబర్‌వన్ ర్యాంకింగ్‌ను విరాట్ కోహ్లి నిలబెట్టుకున్నాడు. ఆసీస్‌తో జరిగిన సిరీస్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచిన పుజారా మూడో స్థానాన్ని ఆక్రమించాడు. మరొకవైపు రవీంద్ర జడేజా, మయాంక్ అగర్వాల్ కూడా బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో తమ స్థానాలను మెరుగుపర్చుకున్నారు. ఆరు స్థానాలు ఎగబాకిన భారత ఆల్‌రౌండర్ జడేజా 57వ స్థానంలో నిలవగా, మయాంక్ ఐదు స్థానాలు మెరుగుపర్చుకుని 62వ స్థానంలో నిలిచాడు. ఇక బౌలర్ల ర్యాంకింగ్స్‌లో పలువురు టీమిండియా బౌలర్లు తమ స్థానాలను మెరుగుపర్చుకున్నారు. కుల్దీప్ యాదవ్ ఏడు స్థానాలు ఎగబాకి 45వ స్థానంలో నిలవగా, బుమ్రా 16, షమీ 22వ స్థానాల్లో నిలిచారు.

ఆనందంతో కళ్లు చెమర్చాయి : గవాస్కర్



ముంబయి: టీమిండియా సిడ్నీలో బోర్డర్–గావస్కర్ ట్రోఫీని అందుకోవడం చూసి ఆనందంతో తన కళ్లు చెమర్చాయని మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ అన్నారు. క్రికెట్ ఆస్ట్రేలియా నిర్వాహకుల తప్పిదం కారణంగా ఆయన ట్రోఫీ బహూకరణ కార్యక్రమానికి హాజరుకాలేపోయారు. ఆస్ట్రేలియాలో భారత్ 21 తేడాతో తొలిసారి చారిత్రక సిరీస్ విజయాన్ని సొంతం చేసుకుంది. 'చాలా గర్వంగా ఉంది. ఈ చారిత్రక సన్నివేశాన్ని చూసిన తర్వాత ఆనందంతో నా కళ్లు చెమర్చా యి. ఇదొక గొప్ప రోజు కాబట్టి నేను అక్కడ ఉండి ట్రోఫీని అందిస్తే ఇంకా అద్భుతంగా ఉండేది. వారి గెలుపు, ట్రోఫీని అందుకోవడాన్ని చూడటం నిజంగా మధురానుభూతి' అని గావస్కర్ మీడియాతో తన సంతోషాన్ని పంచుకున్నారు. అలెన్ బోర్డర్, సునీల్ గావస్కర్ పేర్ల మీద ఏర్పాటు చేసిన ఈ ట్రోఫీ ప్రెజెంటేషన్ కార్యక్రమానికి ప్రతిసారి గావస్కర్ హాజరవుతారు.

స్టార్క్‌కు కోహ్లి మద్దతు

సిడ్నీ: టెస్టు సిరీస్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేక విమర్శలు ఎదుర్కొంటున్న ఆసీస్ ప్రధాన పేసర్ మిచెల్ స్టార్క్‌కు టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి మద్దతుగా నిలిచాడు. ఎంతోకాలంగా ఆసీస్ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న స్టార్క్.. ఏదొక సిరీస్‌లో ఆకట్టుకోలేకపోతే ఆ దేశ మాజీలు ఒక్కసారిగా విమర్శలు ఎక్కుపెట్టడం తనను ఆశ్చర్యానికి గురి చేసిందన్నాడు. కొన్ని సందర్భాల్లో ఎవరైనా గాడి తప్పడం సహజమేనని, అటువంటి తరుణంలో వారికి మద్దతుగా ఉండాలే తప్ప ఇలా విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించాడు. ఒక బెస్ట్ బౌలర్‌కు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ కోహ్లి నిలదీశాడు.

భారత్‌లోనే ఐపిఎల్ !

ఎన్నికల దృష్ట్యా మార్చి 23 నుంచి ప్రారంభించే యోచనలో బిసిసిఐ

ముంబై : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) సీజన్ ముందుగానే ప్రారంభం కానుంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఐపీఎల్ షెడ్యూల్‌ను బీసీసీఐ రెండు వారాల ముందుకు జరిపింది. అంతేకాకుండా 12వ సీజన్ ఐపీఎల్‌ను భారత్‌లోనే నిర్వహించనున్నట్టు స్పష్టం చేసింది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా.. టోర్నీని యూఏఈ లేదా దక్షిణాఫ్రికాకు తరలిస్తారని జోరుగా ప్రచారం జరిగింది. కానీ భారత్‌లోనే టోర్నీ నిర్వహించాలని తాజాగా బీసీసీఐ నిర్ణయించింది. గత సీజన్‌ను ఏప్రిల్ 7 నుంచి ప్రారంభించగా.. ఈసారి అంతకు ముందే ఈ క్యాష్ రిచ్ లీగ్‌ను ఆరంభించనుంది. మార్చి 23 నుంచి ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రారంభించేందుకు బీసీసీఐ సన్నాహాలు చేస్తోంది. ఐపీఎల్ వేదికల విషయమై చర్చించేందుకు సుప్రీం కోర్టు నియమిత క్రికెట్ పాలకుల కమిటీ (సీఓఏ) మంగళవారం న్యూఢిల్లీలో సమావేశం అయ్యింది. ప్రాథమికంగా చర్చించిన అనంతరం 12వ సీజన్ ఐపీఎల్‌ను స్వదేశంలోనే నిర్వహించాలని నిర్ణయించారు. విస్తృతమైన చర్చల అనంతరం ఐపీఎల్ 2019 పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేయనున్నట్టు బీసీసీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. ఇక గతంలో 2009, 2014లో ఎన్నికల సందర్భంగా ఐపీఎల్‌ను దక్షిణాఫ్రికా, యూఏఈలో నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈసారి కూడా విదేశాల్లోనే ఐపీఎల్ నిర్వహిస్తారని అందరూ భావించారు. కానీ బీసీసీఐ భారత్‌లోనే నిర్వహిస్తామని ప్రకటించి.. క్రికెట్ అభిమానులకు శుభావార్తను అందించింది.

ఉత్తమ బ్యాటింగ్ కూర్పు కాదు

కోహ్లి సేనపై ఇయాన్ చాపెల్



న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌లో టీమిండియా బౌలింగ్, ఫీల్డింగ్ అత్యుత్తమంగా ఉన్నాయని బ్యాటింగ్ మాత్రం ఆ స్థాయిలో లేదని ఆసీస్ మాజీ సారథి ఇయాన్ చాపెల్ అన్నాడు. కంగారూలను తమ సొంతగడ్డపై ఓడించాలన్న 71 ఏళ్ల కలను కోహ్లి సేన నెరవేర్చింది. ఆతిథ్య జట్టును 21 తేడాతో ఓడించింది. దీంతో కోహ్లి, కుర్రాళ్లపై ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసల జల్లు కురుస్తోంది. కాగా ఇప్పుడు చూసిందే టీమిండియా అత్యుత్తమ బ్యాటింగా? అన్న ప్రశ్నకు ఇయాన్ చాపెల్ కాదని జవాబు ఇచ్చాడు. 'ప్రస్తుత భారత జట్టు బౌలింగ్, ఫీల్డింగ్ అత్యుత్తమంగా కనిపించింది. అయితే ఇది అత్యుత్తమ బ్యాటింగ్ విభాగం మాత్రం కాదు. ఇంతకన్నా మెరుగైన బ్యాటింగ్ కూర్పును చూశా' అని చాపెల్ అన్నాడు. ఈ సిరీస్‌లో చెతేశ్వర్ పుజారా మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికైన సంగతి తెలిసిందే. 1200కు పైగా బంతు లు ఆడిన ఈ టీమిండియా నయావాల్ 500 పైచిలుకు పరుగులు చేసి ఆసీస్ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. అలసిపోయేలా చేశాడు. భారత బౌలింగ్ మాత్రం అత్యుత్తమంగా ఉంది. పేసర్లు 70 ఆస్ట్రేలియా వికెట్లకు 50 పడగొట్టారు. జస్ప్రీత్ బుమ్రా, ఇషాంత్ శర్మ, మహ్మద్ షమి త్రయం 21.62 సగటు నమోదు చేసింది. అదే ఆసీస్ బౌలర్లు పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, హేజిల్ వుడ్ మొత్తం సగటు 30కి పైగా ఉంది. ఆసీస్ పరిస్థితులను భారత బౌలర్లు అద్భుతంగా ఉపయోగించుకున్నారు. కంగారూ బౌలర్లతో పోలిస్తే మరింత స్వింగ్ రాబట్టారు. వారి సీమ్ పొజిషన్ సైతం బాగుంది. వారు క్రమశిక్షణతో కట్టుదిట్టంగా సరైన ప్రాంతాల్లో బంతులు వేయడంతో మంచి స్వింగ్ రాబట్టడానికి కారణం' అని చాపెల్ అభిప్రాయపడ్డాడు.

జట్టులోకి సిరాజ్.. బుమ్రాకు విశ్రాంతి



న్యూఢిల్లీ: హైదరాబాద్ పేసర్ మహ్మద్ సిరాజ్ మళ్లీ భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఆసీస్‌తో వన్డే సిరీస్‌లో భాగంగా మహ్మద్ సిరాజ్‌ను అనుకోకుండా జట్టులో చేర్చుతూ భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బిసిసిఐ) నిర్ణయం తీసుకుంది. ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు సంబంధించి జట్టును గతంలోనే ప్రకటించినప్పటికీ, కొన్ని మార్పులు చేయాల్సి రావడంతో సిరాజ్‌ను ఎంపిక చేసింది. ఆసీస్ వన్డే సిరీస్‌తో పాటు న్యూజీలాండ్ పర్యటనకు బూమ్రాకు విశ్రాంతి ఇస్తున్నట్లు మంగళవారం బీసీసీఐ ఒక ప్రకటనలో పేర్కొంది. కెప్టెన్ కోహ్లి, కోచ్ రవి శాస్త్రిల సూచనతో బూమ్రాకు విశ్రాంతి ఇచ్చేందుకు సెలక్టర్లు అంగీకరించారు. దాంతో బూమ్రా స్థానంలో సిరాజ్‌ను జట్టులోకి తీసుకున్నట్లు తన అధికారిక ట్విట్టర్ అకౌంట్‌లో స్పష్టం చేసింది. ఇప్పటివరకూ అంతర్జాతీయ టీ20లు మాత్రమే ఆడిన సిరాజ్.. ఆసీస్‌తో వన్డే ఫార్మాట్‌లో అరంగేట్రం చేయనున్నాడు. అదే సమయంలో న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌కు సిద్ధార్థ్ కౌల్‌కు అవకాశం కల్పించారు సెలక్టర్లు. ఆసీస్‌తో మూడు వన్డేల సిరీస్ తర్వాత విరాట్ కోహ్లి గ్యాంగ్ న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనుంది. కివీస్‌తో ఐదు వన్డేల సిరీస్‌తో పాటు మూడు టీ20 సిరీస్‌లో భారత్ పాల్గొనుంది.

మధ్యప్రదేశ్ అసెంబ్లీ నూతన స్పీకర్‌గా మంగళవారం కాంగ్రెస్ ఎంఎల్‌ఎ ఎన్ ప్రజాపతి ఎన్నికయ్యారు. తమ స్పీకర్ అభ్యర్థిగా విజయ్ షాను బిజెపి ప్రతిపాదించడంతో సభలో ప్రొసిడింగ్స్ ప్రారంభమయ్యాయి. ఈ ప్రతిపాదనను ప్రొటెం స్పీకర్ దీపక్ సక్సేనా తిరస్కరించడాన్ని నిరసిస్తూ ప్రతిపక్షం వాకౌట్ చేసింది. ఈ పరిణామాలు ప్రజాస్వామ్యంలో బ్లాక్ డే గా మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వ్యాఖ్యానించారు.

'పౌరసత్వ' బిల్లుకు లోక్‌సభ ఆమోదం

అన్ని కోణాల్లో బిల్లును సమర్థించిన రాజ్‌నాథ్‌సింగ్ • ఆగ్రహించిన మిత్రపక్షాలకు బుజ్జగింపులు
అసోంలో కొన్ని తెగలకు ప్రత్యేక హోదా • మతపరమైన వివక్షకు తావులేదు: రాజ్‌నాథ్ సింగ్ • నిరసన తెలిపిన ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ నుంచి వచ్చిన ముస్లిమేతరులకు భారతీయ పౌరసత్వం కల్పించాలని కోరే బిల్లును లోక్‌సభ మంగళవారం ఆమోదించింది. కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వివాదాస్పదమైన సిటిజన్‌షిప్ (అమెండ్‌మెంట్) బిల్లు–2019ని లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు రాజ్యాంగంలోని అంశాలకు విరుద్ధం కాదని, మూడు దేశాల్లోని పీడనలో ఉన్న మైనారిటీలకు ప్రయోజనకారిగా ఉంటుందని ఆయన ప్రతిపక్షాలకు తెలిపారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌ల నుంచి వచ్చి, ఆరేళ్లుగా భారతదేశంలో ఉంటున్న హిందువులు, జైనులు, క్రిస్టియన్లు, సిక్కులు, బౌద్ధులు, పార్సీలకు ... వారు ఎలాంటి డాక్యుమెంట్ చూపించకపోయినా ఈ బిల్లు భారతదేశ పౌరసత్వం కల్పిస్తుంది. ఇప్పటివరకూ అలాంటివారు 12 ఏళ్ల నుంచీ మనదేశంలో నివసిస్తూ ఉండాలనే నిబంధన ఉండేది. 'మనదేశంలో తప్ప వారు ఇంకెక్కడా నివసించలేరు. మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూతో సహా అనేకమంది నాయకులు.. పొరుగు దేశాల్లో పీడనకు గురవుతున్న మైనారిటీలకు మన దేశంలో ఆశ్రయం కల్పించడంపట్ల సుముఖంగా వ్యవహరించారు' అని రాజ్‌నాథ్‌సింగ్ వివరించారు. మైనారిటీలకు రక్షణ కల్పించే ఒప్పందాలపై బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లతో మన నాయకులు సంతకాలు చేసినా, దురదృష్టవశాత్తు అవి అమలు కాలేదని కేంద్ర హోంమంత్రి చెప్పారు. బంగ్లాదేశ్ లో పీడిత మైనారిటీలపట్ల బిజెపి ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించాలని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కూడా, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడి హోదాలో మాట్లాడుతూ కోరారు.

ఈ బిల్లు మతపరంగా ప్రజలమధ్య వివక్షకు దారితీస్తుందనే వాదనను రాజ్‌నాథ్‌సింగ్ తోసిపుచ్చారు. 'చట్టపరం గా అర్హులైనవారు... ఏ మతానికి చెందిన వారైనా ఈ బిల్లుద్వారా భారతదేశ పౌరసత్వాన్ని పొందుతారు' అని కేంద్ర హోంమంత్రి అన్నారు. ఈశాన్య ప్రజల ఆందోళనను ఈ బిల్లు ఉపశమింపచేస్తుందని భావిస్తున్నానని, ఈ బిల్లు కేవలం అసోంకు మాత్రమే పరిమితం కాదని రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టం చేశారు. పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఈశాన్య భారతంలో అనేక సంఘాలు, పార్టీలు 11గంటలపాటు బంద్ పాటించిన సంగతి తెలిసిందే.'పీడిత మైనారిటీల భారాన్ని దేశం మొత్తం పంచుకుంటుంది. మొత్తం బాధ్యతను, బరువును అసోం ఒక్కటే మోయనక్కర్లేదు. అసోం రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రజలకు అన్నివిధాలా సాయమందించేందుకు భారత ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు.



బిజెపి ఒంటరిదైందా?

ఈ సమస్యపై మిత్రపక్షాలు ఏకీభవించకపోవడంతో బిజెపి ఒంటరిదైందా? అన్న సందేహం కలుగుతోంది. అసోంలో బిజెపి సారథ్యంలో నడుస్తున్న ప్రభుత్వంలో భాగస్వామ్య పక్షమైన అసోం గణ పరిషద్ (ఎజిపి) బిజెపితో తెగతెంపులు చేసుకుంది. కాగా, బిజెపి మిత్రపక్షాలైన శివసేన, జనతాదళ్ (యు) ఈ బిల్లును వ్యతిరేకించాయి. ఇకపోతే...మిజోరాం, మేఘాలయ ప్రభుత్వాలు తమ కేబినెట్ సమావేశాల్లో ఈ బిల్లును వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేశాయి. అసోంలోని ఆరు తెగలు తాజ్ అహోం, కొచ్ రాజబోంగ్షి, చుటియా, టీ ట్రైబ్స్, మోరన్, మాటక్‌లకు ఎస్‌టి హోదా ఇవ్వడానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. అసోంలో ఈ బిల్లుకు తీవ్రమైన వ్యతిరేకత రావడంతో, ఆ వ్యతిరేకతను సమతుల్యం చేసేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. 'అదే సమయంలో ప్రస్తుతం అసోంలో ఉన్న షెడ్యూల్డ్ తెగల ప్రయోజనాలు, హక్కుల రక్షణకు అన్ని చర్యలూ తీసుకుంటాం. అసోం పర్వత ప్రాంత జిల్లాల్లో నివసిస్తున్న బోడో కచారీలు, మైదాన ప్రాంతాల్లో ఉనన కరబీలకు ఎస్‌టి హోదా కల్పించేందుకు ప్రత్యేక బిల్లును కూడా తెస్తాం. అటానమస్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్స్‌ను పటిష్టపరిచేందుకు రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌ను సవరించే ప్రతిపాదన కూడా ఉంది' అని కేంద్రహోంమంత్రి సూచించారు. వలసవచ్చిన హిందువులు, జైనులు, క్రిస్టియన్లు, సిక్కులు, బౌద్ధులు, పార్సీలకు 2015, 2016 లలో చట్టపరంగా ఏ చర్యా లేకుండా రక్షణ కల్పించామన్నారు. అలాగే వారికి దీర్ఘకాలిక వీసా సదుపాయాన్ని కూడా కల్పించాం. ఈ బిల్లువల్ల పీడిత మైనారిటీలకు భారతదేశ పౌరసత్వానికి దరఖాస్తు చేసుకునే అర్హత వ స్తుంది.

ప్రతిపక్షాల నుంచి నిరసనలు

ఇలా ఉండగా, ఈ బిల్లును వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు అభ్యంతరాలు లేవనెత్తాయి. చాలా రాష్ట్రాలు బిల్లును వ్యతిరేకించాయని బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. కానీ ప్రభుత్వం ఆ డిమాండ్‌ను పట్టించుకోకపోవడంతో వాకౌట్ చేసింది. ఈ బిల్లు విభజనల్ని ప్రోత్సహించేదిగా ఉందని తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడ్ సౌగత రాయ్ అన్నారు. ఇది నీచమైన ఓటు బ్యాంక్ రాజకీయమని విమర్శించారు. ఐయు ఎంఎల్ సభ్యు పిఆర్ కున్హాలికుట్టి కూడా బిల్లును వ్యతిరేకించారు. ఎంఐఎం సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ ఇది రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉందన్నారు. బిజెడి, శివసేన, సిపిఎం సభ్యులు కూడా బిల్లును వ్యతిరేకించారు.

రాజ్యసభలో కొనసాగిన ఆందోళనల పర్వం

ప్రతిపక్షాల గొడవతో పలుసార్లు వాయిదా



న్యూఢిల్లీ: రాజ్యసభలో మంగళవారంకూడా ఆందోళనల పర్వం కొనసాగింది. విపక్షాల ఆందోళనలతో శీతాకాల సమావేశాల చివరి రోజయిన మంగళవారం సభ పలుమార్లు వాయిదా పడింది. పార్లమెంటు శీతాకాల సమావేశాలు వాస్తవానికి మంగళవారంతో ముగియాల్సి ఉంది. అయితే పలు అంశాలపై చర్చ పెండింగ్‌లో ఉండడంతో సభను బుధవారానికి పొడిగించారు. మంగళవారం ఉదయం సభ ప్రారంభం కాగానే సమాజ్‌వాది పార్టీ సభ్యులు ఆందోళనకు దిగారు. ఆ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్‌పై సిబిఐ దర్యాప్తును వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టారు. వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. దీంతో రాజ్యసభ చైర్మన్ ఎం వెంకయ్యనాయుడు సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైన తర్వాత కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. ఎస్‌పి, బిఎస్‌పి సభ్యుల ఆందోళనకు కాంగ్రెస్ సభ్యులు కూడా మద్దతు ప్రకటించారు. పలు అంశాలపై చర్చించాల్సి ఉన్నందున గొడవ చేయొద్దని డిప్యూటీ చైర్మన్ రఘువంశ్ పదేపదే కోరినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. గొడవ మధ్యలోనే కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డా ఇండియన్ మెడికల్ కౌన్సిల్ సవరణ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. గొడవ సద్దుమణగక పోవడంతో డిప్యూటీ చైర్మన్ సభను 15 నిమిషాలపాటు వాయిదా వేశారు.ఆ తర్వాత కూడా మరో రెండు సార్లు వాయిదాపడిన తర్వాత సభను చివరికి బుధవారానికి వాయిదా వేశారు. ఇదిలా ఉండగా, రాజ్యసభను బుధవారానికి పొడిగించడంపైన కూడా విపక్ష సభ్యులు అభ్యంతరం తెలియజేశారు. తమ సమ్మతి లేకుండానే ప్రభుత్వం సభను పొడిగించిందని ఆరోపిస్తూ ప్రతిపక్ష కాంగ్రెస్ సహా విపక్ష పార్టీల సభ్యులు పార్లమెంటు ఆవరణలో ఆందోళనకు దిగారు.

యూపీలో బిజెపికి 'మిత్రభేదం'

బిసి కోటాపై ఎస్‌బిఎస్‌పి, అప్నాదళ్ బెదిరింపులు



లక్నో: వెనకబడిన తరగతులకు రిజర్వేషన్ పై ఉత్తరప్రదేశ్‌లో బిజెపి మిత్రపక్షాలైన సుహేల్‌దేవ్ భారతీయ సమాజ్‌పార్టీ (ఎస్‌బిఎస్‌పి), అప్నాదళ్ (సోనేలాల్) భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మరికొద్ది నెలల్లో లోక్‌సభకు ఎన్నికలు జరగబోతున్న తరుణంలో మిత్రపక్షాల వైఖరితో బిజెపికి ముల్లు గుచ్చుకున్నట్టయింది. వెనకబడిన తరగతుల రిజర్వేషన్లపై ఏర్పాటు చేసిన సోషల్ జస్టిస్ కమిటీ చేసిన సిఫార్సులు అమలుకు భారతీయ జనతాపార్టీకి ఎస్‌బిఎస్‌పి వంద రోజుల గడువిస్తూ అల్టిమేటం జారీచేసింది. కుల గణన లేకుండా కమిటీ ఏ ఆధారంతో నివేదిక రూపొందించిందని అప్నాదళ్ (సోనేలాల్) ప్రశ్నలు లేవనెత్తింది. వెనకబడిన తరగతుల రిజర్వేషన్లపై గత ఏడాది మే నెలలో ఏర్పాటు చేసిన కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సులు చేసింది. వెనకబడిన తరగతులను మూడు కేటగిరీలుగా... వెనకబడిన తరగతులు, బాగా వెనకబడిన, మరీ వెనకబడిన తరగతులుగా విభజించాలని తన నివేదికలో పేర్కొంది. 'ప్రభుత్వం మొదట కులగణన చేయాలి. ఆ తర్వాత కమిటీ సిఫార్సుల్ని అమలు పరచాలి. రిజర్వేషన్లు కుల జనాభా ఆధారంగా ఉండాలి. కుల గణన చేయకుండా ప్రభుత్వం రిజర్వేషన్ కోటాలో మరో కోటా ఎలా కల్పిస్తుంది? అని కేంద్ర మంత్రి, అప్నాదళ్ (ఎస్) నాయకురాలు అనుప్రియా పటేల్ ప్రశ్నించారు. మరోవైపు... ఎస్‌బిఎస్‌పి అధినేత, కేబినెట్ మంత్రి ఓంప్రకాష్ రాజ్‌భర్ మాట్లాడుతూ... కమిటీ నివేదికను వంద రోజుల్లో అమలు చేయకపోతే బిజెపిని వదిలేసి, ఉత్తరప్రదేశ్‌లో 80 లోక్‌సభా స్థానాలకు పోటీ చేస్తాం' అని హెచ్చరించారు.

ఫోన్‌లో మాట్లాడుకున్న మోడీ, ట్రంప్

న్యూఢిల్లీ / వాషింగ్టన్: ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లు సోమవారం సాయంత్రం టెలిఫోన్‌లో మాట్లాడుకున్నారు.ఈ సందర్భంగా రెండు దేశాల మధ్య సంబంధాలు, రక్షణ రంగం, ఉగ్రవాదంపై పోరులో పరస్పర సహకారంపై ఇరువురు నేతలు చర్చించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది.తొలుత నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్న ఇరువురు నేతలు ఇరుదేశాల ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు.గత ఏడాది ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం కావడంపై ఇరువురు నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గత ఏడాది రెండు దేశాల మధ్య జరిగిన 2+2 చర్చలు, భారత్, అమెరికా, జపాన్‌ల మధ్య జరిగిన తొలి త్రైపాక్షిక చర్చల అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. 2019లో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతానికి కృషి చేయాలని ఇరువురు నేతలు అంగీకారారానికి వచ్చారు.గత ఏడాది నవంబర్‌లో అర్జెంటీనాలో జరిగిన జి–20 సదస్సు సందర్భంగా మోడీ, ట్రంప్, జపాన్ ప్రధాని షింజో అబె మధ్య త్రైపాక్షిక సమావేశం జరిగింది. ఆ భేటీ తర్వాత మోడీ, ట్రంప్ మాట్లాడుకోవడం ఇదే తొలిసారి.





రాఫెల్ దర్యాప్తు నుంచి మోడీని కాపాడలేరు

సిబిఐ వివాదంలో సుప్రీం తీర్పుపై రాహుల్ వ్యాఖ్య



న్యూఢిల్లీ: రాఫెల్ దర్యాప్తు నుంచి ప్రధాని నరేంద్ర మోడీని ఎవరూ కాపాడలేరని, ఆయన 30 వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని తీసుకొని తన మిత్రుడు అనిల్ అంబానీకి ఇచ్చిన విషయం ఈ దేశానికి ఎలాంటి అనుమానం లేకుండా తెలిసి తీరాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. సిబిఐ డైరెక్టర్ అలోక్ వర్మను తక్షణం తిరిగి పదవిలో నియమించాలంటూ మంగళవారం సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో రాహుల్ గాంధీ పార్లమెంటు బయట మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందంపై అలోక్‌వర్మ దర్యాప్తు జరపబోతున్నందునే ఆయనను అర్ధరాత్రి ఒంటిగంటకు పదవినుంచి తప్పించారని, ప్రధాని మోడీ, ఆయన ప్రభుత్వం ఈ దర్యాప్తునుంచి తప్పించుకోలేరని అన్నారు. 'రాఫెల్ దర్యాప్తునుంచి వారు తప్పించుకు పోలేరు. అది అసాధ్యం. రాఫెల్ ఒప్పందంపై చర్చనుంచి ప్రధాని మోడీ పారిపోయారు.ఆయన ఈ ఒప్పందంపై ప్రజాకోర్టులో మాతో చర్చించాలి. వారిని రాఫెల్‌నుంచి ఎవరూ కాపాడలేరు. ఎందుకంటే ఆ ఒప్పందంలో కుంభకోణం జరిగిందనేది నిజం. వాస్తవంనుంచి ఎవరూ తప్పించుకోలేరు' అని రాహుల్ అన్నారు.

రాజ్యాంగ విరుద్ధం...రాజకీయ అస్త్రం

ఇబిసిలకు10 శాతం కోటాపై న్యాయనిపుణుల అభిప్రాయం



న్యూఢిల్లీ: ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగాల్లో జనరల్ కేటగిరీలో పది శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ విరుద్ధం, కోర్టులో సవాల్ చేసేందుకు ఒక రాజకీయ అస్త్రంగా ఉపయోగపడుతుందని న్యాయనిపుణులు మంగళవారం చెప్పారు. ఈ బిల్లుకోసం రాజ్యాంగాన్ని సవరించాల్సి ఉంటుంది. కేంద్ర కేబినెట్ సోమవారం ఆమోదించిన రాజ్యాంగం 124వ సవరణ బిల్లు– 2019 పై సీనియర్ న్యాయవాదులు రాకేష్ ద్వివేది, రాజీవ్ ధావన్, అజిత్ సిన్హా... న్యాయపరంగా ఇదొక పరీక్ష అని భయాందోళనలు వ్యక్తం చేశారు. కేబినెట్ తీసుకున్న ఈ చర్య ఎన్నికల గిమ్మిక్కు అని ద్వివేది వ్యాఖ్యానించగా, ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధం అని ధావన్ అన్నారు. ఈ బిల్లు కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 15కు సవరణ చేయాల్సి ఉంటుందని, ప్రభుత్వ నిర్ణయానికి ఇందిరా సాహ్నీ కేసు జడ్జిమెంట్ కూడా న్యాయపరంగా అవరోధం కలిగిస్తుందని సిన్హా తెలిపారు. 'అసలు ఆలోచించాల్సిన సంగతి మరొకటి ఉంది. ఇది ఎన్నికల వేళ కాబట్టి ప్రభుత్వాలు ఏవో చర్యలు తీసుకుంటాయి. ప్రజల ప్రయోజనాలు నెరవేరేట్టయితే మంచిదే. కానీ నిరుద్యోగ సమస్య పరిష్కారంలో ఈ రిజర్వేషన్లు ఎంతవరకు తోడ్పడతాయి?' అని ద్వివేదీ సందేహం వ్యక్తం చేశారు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని సుప్రీంకోర్టు నుంచి ఇందిరా సాహ్నీ తీర్పు వెలువడింది. కానీ ఆ తీర్పును జవదాటకూడదని, కట్టుబడి ఉండాలని రూలేం లేదు. కొన్ని ప్రత్యేక పరిస్థితులు, కారణాలు ఉంటే ఆ హద్దును దాటవచ్చని వారు చెప్పారు. రిజర్వేషన్లను పది శాతం పెంచవచ్చా వద్దా? అనుమతించడం సహేతుకమే అవుతుందా? అన్నది కూడా ఆలోచించాలి' అని ఆయన చెప్పారు.

న్యాయపరంగా చూసినప్పుడు ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధం అనడానికి కారణాలున్నాయి. మొదటిది: ఎస్‌సి ఎస్‌టిలకు ఉద్యోగాల్లో ప్రమోషన్లకు రిజర్వేషన్ ఉండాలన్న ఇందిరా సాహ్నీ కేసు తీర్పు తర్వాత... మళ్లీ ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడమనే అంశానికి విలువ లేదు. తొమ్మిది మందితో కూడిన ధర్మాసనంలో ఆరుగురు న్యాయమూర్తులు ఏకీభవించారు. ఇకపోతే... రిజర్వేషన్లకు కేవలం ఆర్థికతే ప్రాతిపదిక కావాలి. కానీ అందుకు ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసీ ప్రాతిపదిక కాకూడదు అని మిగిలిన ముగ్గురు న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. పది శాతం కోటా సుప్రీం విధించిన పరిమితిని దాటే సింది కాబట్టి ఇందుకు అనుమతి దొరకదు ...అని ధావన్ వ్యాఖ్యానించారు. ఆర్థికంగా వెనుకబాటుతనం పరిగణన లోకి తీసుకున్నప్పుడు అది మాత్రమే చెల్లుతుంది కానీ కులం, శాఖ, మతం ప్రాధాన్యత వహించవు ' అని అజిత్ సిన్హా తెలిపారు. ఇక్కడ మరో విషయాన్ని కూడా లెక్కలోకి తీసుకోవాలి. క్రీమీ లేయర్ అనే నిబంధనను తొలగించాలి. అప్పుడు మాత్రమే ఆర్థికాంశం రిజర్వేషన్‌కు ప్రాతిపదిక అవుతుంది. అయితే 50 శాతం దాటి ఎంతవరకు వెళ్లవచ్చు అన్నది మరో సమస్య... అని ధావన్ అభిప్రాయపడ్డారు. బిల్లు నెగ్గితే కోర్టు పరీక్షకు నిలవాల్సి ఉంటుంది. వీగిపోతే అది విపక్షాలకు రాజకీయాస్త్రం అవుతుంది అని ధావన్ వ్యాఖ్యానించారు.

గుడిలో మద్యం సీసాలు పంచిన బిజెపి నేత

హర్దోయి(యుపి): ఉత్తర్‌ప్రదేశ్‌కు బిజెపి నాయకుడు ఒకరు ఒక గుడిలో జరిగిన కార్యక్రమంలో ఆహార పొట్లంతో పాటు మద్యం బాటిల్‌ను జతచేసి గ్రామస్తులకు పంపిణీ చేయడం సంచలనం సృష్టించింది. బిజెపి నాయకుడు నరేష్ అగర్వాల్ కుమారుడు నితిన్ నిర్వహించిన కార్యక్రమంలో ఈ సంఘటన జరిగింది. హర్దోయిలోని శ్రావణ్ దేవి ఆలయంలో పాసి కులానికి చెందిన వారితో జరిగిన ఒక సమ్మేళనంలో ఎమ్మెల్యే కూడా అయిన నితిన్ అగర్వాల్ అక్కడకు వచ్చిన గ్రామస్తులకు ఆహారం పొట్లాలతో పాటు మద్యం సీసాలను కూడా పంచడం వీడియోగా బయటకు వచ్చి వైరల్ అయింది. 2018 మార్చిలో సమాజ్‌వాది పార్టీకి గుడ్‌బై చెప్పి నరేష్ అగర్వాల్ తన కుమారుడు, కార్యకర్తలతో సహా బిజెపిలో చేరారు. అయితే, ఇదే కార్యక్రమంలో తమ తల్లిదండ్రులతోపాటు అక్కడకు వచ్చిన మైనర్ బాలలకు కూడా మద్యం సీసాలు ఇవ్వడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. దీనిపై బిజెపి హర్దోయి ఎంపి అన్షుల్ వర్మ తీవ్రంగా స్పందిస్తూ ఈ వ్యవహారాన్ని పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకువెళతానని చెప్పారు.

ఎఫ్‌ఎం చానళ్లలో ఆకాశవాణి వార్తలు

ప్రయోగాత్మకంగా మే 31 వరకు ఉచితం

న్యూఢిల్లీ: ఆకాశవాణి హిందీ, ఇంగ్లీషులో ప్రసారం చేసే వార్తలను ప్రసారం చేయడానికి ప్రైవేట్ ఎఫ్ ఎం చానళ్లను ప్రభుత్వం అనుమతించింది. కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంగళవారం ఈ సదుపాయాన్ని ప్రారంభించింది. ఎఫ్‌ఎం చానళ్లు ఈ వార్తలను ఎలాంటి మార్పులు, చేర్పులు లేకుండా ప్రసారం చేయాల్సి ఉంటుంది,అంతే కాదు ప్రయోగాత్మకంగా ఈ సదుపాయాన్ని మే 31 వరకు ఉచితంగా లభిస్తుంది. నిబంధనల ప్రకారం ట్రయల్ పీరియడ్‌లో ఎఫ్‌ఎం చానళ్లు ఈ వార్తలను కల్లోలిత ప్రాంతాలు లేదా సరిహద్దు, నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో ఈ వార్తలను ప్రసారం చేయకూడదు.ఈ చర్య పౌరులకు మరింత సాధికారిత ఇస్తుందని, కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి రాజ్యవర్ధన్ రాథోడ్ చెప్పారు. ఇంతకు ముందే ప్రభుత్వం ఈ నిర్ణయానికి ఆమోదం తెలిపిందని, ఇప్పుడు దీన్ని అమలు చేస్తున్నందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందని, ఇందుకు అధికారులను అభినందిస్తున్నానని ఆయన అన్నారు. ప్రైవేట్ బ్రాడ్‌కాస్టర్ల దీర్ఘకాలిక డిమాండ్‌ను అంగీకరించినందుకు ప్రభుత్వానికి భారత రేడియో ఆపరేటర్ల అసోసియేషన్ అధ్యక్షులు అనూరాధా ప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆంధ్ర విద్యార్థి ఆత్మహత్య

గౌహతి: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ గౌహతిలో చివరి సంవత్సరం చదువుతున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థి ఒకరు సోమవారం తన హాస్టల్ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పన్నెం వన్ సిద్ధార్థ అనే విద్యార్థి తల్లిదండ్రులు సోమవారం సాయంత్రం సుమారు 5 గంటల ప్రాంతంలో ఐఐటిజిలోని అతని మిత్రులకు ఫోన్ చేసి తమ కుమారుడు ఫోన్ ఎత్తడం లేదని, అతనితో మాట్లాడాలించాలంటూ కోరారు. రూములోకి వెళ్లిన మిత్రులకు సిద్ధార్థ సీలింగ్ ఫ్యానుకు ఉరి వేసుకుని కనిపించాడు. అతడిని వెంటనే క్యాంపస్ ఆస్పత్రికి తరలించగా అతను అప్పటికే మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. సిద్ధార్థ ఎలెక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ బిటెక్ ప్రోగ్రామ్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. యూమియం హాస్టల్‌లో ఒక్కడే ఉంటున్నాడు. సిద్ధార్థ మృతదేహాన్ని సమీపంలోని ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. అతని కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత పోస్ట్‌మార్టమ్ నిర్వహిస్తారని కళాశాల వర్గాలు తెలిపాయి.

ఆ పెదాల ఖరీదెంతో తెలుసా?



సిడ్నీ: ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన పెదవులు అవి. వజ్రాలు పొదిగిన ఆ పెదాలకు గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు దక్కింది. ఆస్ట్రేలియాకు చెందిన ప్రఖ్యాత వజ్రాల వ్యాపార సంస్థ రోసెండార్ఫ్ తన 50వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఒక వినూత్న కార్యక్రమంలో రూ. 3.78 కోట్లకు పైగా విలువచేసే 126 వజ్రాలను ఒక మోడల్ పెదాలపై అలంకరించి తన డిజైనింగ్‌లోని కళాత్మకతను ప్రదర్శించింది. 1963లో క్రేగ్ రోసెన్‌డార్ఫ్ స్థాపించిన ఈ వజ్రాల వ్యాపార సంస్థ అత్యంత స్టయిలిష్ డిజైన్లకు ప్రపంచ ప్రఖ్యాతి పొందింది. చార్లీ అక్టావియా అనే మోడల్ పెదాలపై మొత్తం 22.92 క్యారెట్ బరువున్న వజ్రాలను ఐలాష్‌ను జిగురుగా వాడి మేకప్ ఆర్టిస్ట్ క్లారె మాక్ అద్దాడు. దాదాపు రెండున్నర గంటలు పట్టిందట మేకప్ పూర్తికావడానికి. ఈ ప్రదర్శన పూర్తయ్యే వరకు ఆ మోడల్‌కు కాపలాగా ఒక పోలీసు అధికారిని కూడా ఉంచారు. ప్రదర్శన పూర్తయ్యాక మోడల్‌ను లోపలకు తీసుకెళ్లి ఒక్కో వజ్రాన్ని జాగ్రత్తగా తొలగించి లాకర్‌లో భద్రపరిచినట్లు వ్యాపార సంస్థ తెలిపింది.

హిమాలయన్ క్వీన్‌లో మంటలు



సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లోని కాల్కా నుంచి సిమ్లా కు పర్వతాల మీదుగా ప్రయాణించే రైలులో మం గళవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రైలులోని దాదాపు 200 మంది ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు. కాల్కాసిమ్లా ప్రపంచ వారసత్వ సంపద సెక్షన్‌లోని కుమార్‌హటి నుంచి దరమ్‌పూర్ మధ్య నడిచే హిమాలయన్ క్వీన్ రైలులో మంటలు వ్యాపించాయి. వెంటనే డ్రైవర్ మంటలను ఆర్పివేసి ఇంజన్‌ను పక్కకు తొలగించారు. అనంతరం ప్రయాణికులంతా సిమ్లాకు పయనమయ్యారు. ఏడు కోచ్‌లతో కూడిన ఈ టాయ్ ట్రెయిన్‌లో సంఘటన జరిగిన సమయంలో దాదాపు 200 మంది పర్యాటకులు ఉన్నట్లు తెలిసింది. పర్వతాల మీదుగా నడిచే 112 ఏళ్ల క్రితం నాటి ఈ రైల్వే ట్రాకును యునెస్కో 2008లో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా ప్రకటించింది.

రైలులో 8 కిలోల బంగారం మాయం!



జైపూర్: బాంద్రా నుంచి ఉదయ్‌పూర్ వెళుతున్న రైలులో రెండున్నర కోట్ల రూపాయలు విలువ చేసే బంగారం మాయమైంది. స్లీపర్ కోచ్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు ప్రయాణికుల నుంచి ఈ బంగారం ఎవరో చోరీ చేశారు. చిత్తోర్‌గఢ్ జిల్లాలోని నింభారా రైల్వే స్టేషన్ సమీపంలో తమ వద్ద నుంచి 8 కిలోల బంగారాన్ని ఎవరో కొట్టేశారని ఆ ఇద్దరు ప్రయాణికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముంబాయికి చెందిన ఒక కంపెనీలో పనిచేసే నరేంద్ర టైలర్, విపుల్ ఉదయ్‌పూర్‌లో బంగారం వ్యాపారులకు అందచేసేందుకు బంగారంతో రైలులో ప్రయాణిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తమ వద్ద ఉన్న బంగారానికి సంబంధించిన పత్రాలన్నీ వారి వద్ద ఉన్నాయని వారు చెప్పారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా రైల్వే పోలీసులు గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666